# జనబలం

ప్రజలే ప్రభువులు

జూన్ 2026 | లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాస పత్రిక | రూ.10/-




## సంక్షోభాన్ని భారత్ ‘సువర్ణావకాశంగా’ మలచుకోవాలి





## తెలంగాణ విద్యా కమిషన్ సిఫార్సులు –టీచర్ల ఆగ్రహం

## 12 ఏళ్ల తెలంగాణ-ఏపీ





## ఒక్క తరం కాలంలో ఈజిప్ట్ కాస్త్రా ఫిన్లాండ్ ఎలా అయ్యింది?



శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు
ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి

# ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ కులముల సహకార ఆర్థిక సంస్థ లిమిటెడ్..అమరావతి

## షెడ్యూల్డ్ కులముల సభ్యుల అభ్యున్నతి కొరకు కార్పొరేషన్ల ఏర్పాటు

- ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 23 జిల్లాల ఎస్సీ సేవా సహకార సంఘాలతో 1974వ సంవత్సరంలో హైదరాబాద్‌లో ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ కులముల సహకార ఆర్థిక సంస్థ లిమిటెడ్ స్థాపించబడినది.
- ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం, 2014 ప్రకారం, రెండు రాష్ట్రాలలో రెండు సంస్థలుగా విభజించబడింది.

### కార్పొరేషన్ యొక్క ప్రధాన లక్ష్యాలు :

- SC నిరుద్యోగుల ఆదాయాన్ని పెంచి ఆస్తుల సృష్టికి ఆర్థిక సహాయం అందించబడుతుంది.
- స్వయం ఉపాధికి దారి తీసే నైపుణ్య పెంపుదల కోసం శిక్షణా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది.
- ఆర్థిక సహాయ పథకాలనందించడం ద్వారా ఎస్సీల కుటుంబాలలో ఆర్థిక అంతరాలను పూడ్చడం జరుగుతుంది.
- తదుపరి 2019 సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము, రాష్ట్రంలోని షెడ్యూల్డ్ కులముల సభ్యుల అభ్యున్నతిపై ప్రత్యేక దృష్టి సారించడానికి మరియు వారి ఆర్థిక మద్దతు ప్రయోజనాల కోసం
  (1) "ఆంధ్రప్రదేశ్ మాల వెల్ఫేర్ కార్పొరేషన్ లిమిటెడ్,G.O.Rt.No.558,SW(SCP,A1)Dept..,DT.04.12.2019
  (2)ఆంధ్రప్రదేశ్ మాదిగ వెల్ఫేర్ కార్పొరేషన్ లిమిటెడ్,G.O.Rt. No.557,SW(SCP,A1)Dept..,DT. 04.12. 2019
  (3) ఆంధ్రప్రదేశ్ రెల్లి మరియు ఇతరుల వెల్ఫేర్ కార్పొరేషన్ లిమిటెడ్, G.O.Rt.No.559, SW (SCP,A1) Dept.., DT.04.12.2019. AP. కోఆపరేటివ్ సొసైటీస్ చట్టం,1964 క్రింద" మూడు వేర్వేరు కార్పొరేషన్లను ఏర్పాటు చేయుట జరిగినది.
- సంస్థను స్థాపించినప్పటి నుండి ఇప్పటి వరకు దారిద్ర్యరేఖ దిగువన గల అనేక ఎస్సీ కుటుంబాలకు ఆర్థిక తోడ్పాటు అందించడం జరుగుచున్నది.



శ్రీ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి గారు
సాంఘిక సంక్షేమశాఖ మంత్రి , ఆంధ్రప్రదేశ్



**సెక్రటరీ**
సాంఘిక సంక్షేమశాఖ మరియు
వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్(ఎఫ్.ఏ.సీ)

ప్రజలే ప్రభువులు

# జనబలం

లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాసపత్రిక

జూన్ 2026

సంపుటి 27 సంచిక 06


**జనబలం చందా రుసుము వివరాలు**

| | | |
|---|---|---|
| సంవత్సర చందా | : | రూ. 100.00 |
| మూడు సంవత్సరాలకు చందా | : | రూ. 290.00 |
| ఐదు సంవత్సరాలకు చందా | : | రూ. 475.00 |
| జీవితకాలపు చందా | : | రూ. 1200.00 |


సంపాదకవర్గం

బండారు రామ్మోహనరావు

శిరమని నరేష్

వర్కింగ్ ఎడిటర్

దూసనపూడి సోమసుందర్



*జనబలంలో ప్రచురితమవుతున్న వ్యాసాలలో రచయిత(త్రు)లు వెలిబుచ్చే అభిప్రాయాలు కేవలం వారి సొంతం. జనబలం సంపాదకవర్గం ఆ అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నట్టు కాదు.*


**చందాదారులకు విజ్ఞప్తి**

చందా మొత్తాలను, ప్రకటనల ధర మొత్తాలను చెక్కుగాని, డి.డి. ద్వారా గాని FOUNDATION FOR DEMOCRATIC REFORMS పేర పంపవచ్చును. NEFT సౌకర్యము ద్వారా పంపదలచినవారు SBI PUNJAGUTTA BRANCHలోని SB A/C. No. 52086568057కి IFSC CODE No. SBIN0020072కు పంపి, Transaction I.D. No. మరియు తారీఖు తప్పనిసరిగా తెలియజేయవలెను. నగదు రూపంలో చెల్లించదలచిన వారు లోక్‌సత్తా సంస్థ కేంద్ర కార్యాలయంలో ఇచ్చి రశీదు పొందవలెను.

**కార్టూన్ కార్నర్**





| | |
|---|---|
| 06 | సంక్షోభాన్ని సువర్ణావకాశంగా మలుచుకోవాలి |
| 09 | తెలంగాణ విద్యాకమిషన్ నివేదిక ముఖ్యాంశాలు |
| 13 | ఒక్క తరం కాలంలో ఈజిప్ట్ కాస్త్రా ఫిన్లాండ్ అయ్యింది.. |
| 17 | విద్యాప్రమాణాల బాధ్యత టీచర్‌దే |
| 18 | 'ఆర్‌టీఐ లైబ్రరీ' యాప్‌ను ప్రారంభించిన జేపీ |
| 19 | డీవీఎస్ వర్మకి లోక్‌సత్తా ఘననివాళులు |
| 20 | ఇంధన సాధికారత, సముద్ర రవాణా మార్గాలపై ప్రపంచ దేశాల హక్కుల్ని పరిరక్షించుకోవాలి |
| 22 | ఈలం .. ఈల: శ్రీలంక, భారత్‌లో తమిళుల విలక్షణ తీర్పు |
| 25 | సమాజంలో ఆలోచన, ఆచరణ కోసం తపించిన ధన్యజీవి ఉప్పల గోపాలరావు |
| 26 | తెలంగాణలో 'ఫ్యూచర్ మైండ్స్' సిద్ధమవ్వాలి: జేపీ |
| 27 | తెలంగాణలో చట్టబద్ధపాలన.. స్థానిక కోర్టుల ఏర్పాటుకు ముందడుగేది? |
| 29 | పన్నెండేళ్ల తెలంగాణ, ఆంధ్రప్రదేశ్.. గతం కంటే భవిష్యత్తు కీలకమైన సంధి దశ |
| 31 | అది అసత్య ప్రచారం : జేపీ |



కార్యాలయ చిరునామా : H.NO. 6-3-678, B-106 , పాషా కోర్టు, 71 , సోమాజీగూడ, త్రిబువన్‌దాస్ జ్యూయలరీ వెనుక, హైదరాబాద్-500 082 ఫోన్: 040-23310288, 040-23419949

Email: accountsdept@loksatta.org

సంపాదకీయం

# పరీక్షా మోసాలకు అంతం లేదా ?

అహ్మదాబాద్‌లోని నరేంద్రమోదీ స్టేడియంలో మే 31 వ తేదీన జరిగిన ఇండియన్ ప్రీమియర్ లీగ్ ఫైనల్ మ్యాచ్‌ను 52 కోట్లమంది లైవ్‌లో వీక్షించారు. ఈ సీజన్‌లో జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లను మొత్తం 110 కోట్ల మంది వీక్షించారు. ఇది మన పొట్టి ఫార్మాట్ క్రికెట్ చరిత్రలో ఒక రికార్డు అంటున్నారు.మన దేశంలో ప్రజలు ముఖ్యంగా అత్యధిక సంఖ్యలో యువత, విద్యార్థులు క్రికెట్‌ను ఒక మతంగా ఆరాధిస్తారు. జన జీవితాన్ని అమితంగా ప్రభావితం చేసే ఈపొట్టి ఫార్మాట్ క్రికెట్ విపరీతమైన జనాకర్షణతో పాటు ధనాకర్షణ కూడా చేస్తున్నది! ఐపీఎల్ వ్యాపార విలువ ఏటా ఒక లక్షా యాభై నాలుగు వేల కోట్ల రూపాయలు అని అంచనా.

మనం ఇప్పుడు మరో ఐపీఎల్ గురించి మాట్లాడుకోవాలి. ప్రశ్న పత్రాల లీకేజీకి నిరసనగా ఇటీవల చాలా ప్రదర్శనలు జరిగాయి. ఆయా సందర్భాల్లో విద్యార్థులు ప్రదర్శించిన వ్యంగ్య పోస్టర్లలో ఐ.పి.ఎల్. "ఇండియన్ పేపర్ లీకేజీ" అనే మాట కూడా ప్రముఖంగా కనిపించింది.ఈ కొత్త ఐపీఎల్ మన దేశంలో ఒక తీవ్రమైన వ్యాధిగా సంక్రమించింది. క్రికెట్ మాదిరిగా ప్రశ్న పత్రాల లీకేజీ కూడా కోట్లమంది విద్యార్థుల, యువత జీవితాలతో ముడిపడిందే! పేపర్ల లీకేజీ వ్యవహారం వందల కోట్ల రూపాయల వ్యాపారస్థాయి నుండి ఎదిగి ఇటీవల నేరపూరిత మాఫియాగా రూపాంతరం చెందింది.

ప్రశ్న పత్రాల లీకేజీ, నకిలీ అభ్యర్థులు, జవాబు పత్రాల మార్పిడి, ఓఎంఆర్ సాంకేతిక లోపాలు, దొంగమార్కులు వంటివి అన్ని రకాల ఎంట్రెన్స్, రిక్రూట్‌మెంట్ పరీక్షల్లోనూ నిత్యకృత్యంగా మారిపోయాయి. విద్యార్థుల, ఉద్యోగార్థుల జీవితాలను అమితంగా ప్రభావితం చేసే రకరకాల పరీక్షల నిర్వహణ గత కొన్నేళ్లుగా ఒక ప్రహసనంగా తయారయ్యింది. వ్యవస్థీకృత నేరంగా రూపాంతరం చెందింది. ఈ నేరం విద్యార్థుల, నిరుద్యోగుల భవిష్యత్తుతో దారుణంగా ఆడుకుంటోంది!

తాజాగా నీట్ - యూజీ ,2026 ప్రశ్నపత్రం లీకేజీ జరిగింది. దాంతో ప్రారంభం కావడానికి కొద్ది గంటల ముందు పరీక్షను రద్దు చేశారు. దాదాపు 22.75 లక్షల మంది విద్యార్థులు తీవ్ర కలవరానికి, మనోవేదనకు గురయ్యారు. వారంతా మరో సారి పరీక్షకు హాజరు కావాల్సి వస్తోంది. నీట్ యూజీ 2024వ సంవత్సరంలో కూడా లీకేజీల ఆరోపణలతో వివాదాస్పదం అయ్యింది. ఇదేదో ఒక ఏడాదిలో ఒక పరీక్ష, ఒక ప్రశ్న పత్రం లీకేజీకి పరిమితమైన సమస్య కాదు. పరీక్షా మోసాలు అనేవి చిరకాలంగా ఒక వైఫల్యంగా క్రమం తప్పకుండా ఎదురవుతున్నాయి.

"భారత్ లో పరీక్షా మోసాల సంక్షోభం 2005-2026" పేరిట పరివర్తన్ సంస్థ ఇటీవల విడుదల చేసిన ఒక అధ్యయనం సమస్యలోని విభిన్న కోణాలను స్పృశించింది.గత ఇరవయ్యేళ్లలో దేశంలోని 21 రాష్ట్రాలలో దాదాపు 220 పరీక్షామోసాల ఉదంతాలు నమోదు అయ్యాయి. వీటివల్ల ఇబ్బందులు పడ్డ విద్యార్థుల, అభ్యర్థుల సంఖ్య దాదాపు పది కోట్లమంది. మెడికల్ ఎంట్రన్స్ పరీక్ష అనేది అన్నిటికంటే అధిక మోసాలకు నెలవుగా మారింది. ఒకప్పుడు పరీక్షా మోసాలు నకిలీ అభ్యర్థులు పరీక్షలు రాయడం, మాస్ కాపీయింగ్ వంటి పద్ధతులకు మాత్రమే పరిమితంగా ఉండేవి. అవి అడపాదడపా మాత్రమే జరిగేవి. కానీ ఇటీవల ఈ మోసాలు నిత్యకృత్యం కావడంతో పాటు వేర్వేరు రూపాలకు విస్తరించాయి. ప్రశ్న పత్రాల తయారీ సంస్థలు , వ్యక్తులు, అధికారులు, ముద్రణ, రవాణా, భద్రపరిచే ప్రదేశాలు, పరీక్షా కేంద్రాలు, వంటివన్నీ మోసాలకు నెలవుగా మారాయి. అందుకు డిజిటల్ నెట్‌వర్క్ లను వినియోగించడం కూడా పెరిగింది.

రాసిన ఎంట్రెన్స్, రిక్రూట్‌మెంట్ పరీక్షలు రద్దు కావడం, రాయాల్సినవి వాయిదాలు పడటం, విద్యార్థులపై ఉద్యోగార్థులపై తీవ్రమైన ఒత్తిడిని పెంచుతున్నాయి. తయారీలో ఎన్నో ఏళ్ళ కాలం, డబ్బు, శ్రమ వెచ్చించిన పిల్లలు, తల్లిదండ్రులు పరీక్షల వ్యవస్థపై నమ్మకాన్ని కోల్పోతున్నారు. మొన్నటి నీట్ యూజీ -2026 ప్రశ్నపత్రం లీకేజీ కేసు దర్యాప్తు బాధ్యతను సీబీఐకి అప్పగించారు. నీట్ యూజీ 2024 పరీక్షా మోసం కేసు కూడా సీబీఐ దర్యాప్తులోనే ఉంది. ఇలాంటివి దాదాపు 18 కేసుల దర్యాప్తు బాధ్యత ప్రస్తుతం సీబీఐ చేతిలో ఉన్నది.

గత పదేళ్లలో జరిగిన పరీక్షా మోసాల కేసులలో కేవలం ఒకే ఒక్క కేసులో శిక్ష పడింది. దాంతో దర్యాప్తు సంస్థల పనితీరు సందేహాస్పదం అవుతోంది. దర్యాప్తులో వేగం, పారదర్శకత, జవాబుదారీతనం లోపించిందని ప్రత్యేకించి చెప్పాల్సిన అవసరం లేదు. గత రెండేళ్లలో వెలుగులోకి వచ్చిన పరీక్షా మోసాలపై పెద్ద ఎత్తున ఆందోళనలు జరిగాయి. పార్లమెంటులో కూడా సమస్య ప్రస్తావనకు వచ్చింది. లీకేజీలను అరికట్టడానికి ప్రభుత్వం ఒక చట్టం కూడా తెచ్చింది. ఇటీవల "కాక్రోచ్ జనతా పార్టీ" పిలుపుపై యువత న్యూఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించింది. ఇంకా నిరసనలు కొనసాగిస్తామని యూత్ హెచ్చరిస్తున్నారు.

ప్రభుత్వం సమస్యలోని తీవ్రతను, వ్యవస్థలోని లోపాలను పట్టించుకుని సరిదిద్దే చర్యలు చేపట్టాలి. నిరసనకారులతో ఏదో ఒక స్థాయిలో సంప్రదింపులు జరపాలి. అయితే ఈ విషయంలో ప్రభుత్వం పూర్తిగా మౌనం పాటించింది. అధికార పార్టీ ప్రచార విభాగం మాత్రం నిరసనకారుల విశ్వసనీయతను, వివేకాన్ని, ప్రశ్నిస్తూ ఎదురుదాడికి దిగింది. సమస్యలను పరిష్కారం చేయడం మీదకంటే, పాలక పక్షాలు ఘటనలపై ప్రజల మనోభావాలను శాసించడం మీద, కథన నియంత్రణల మీద ఎక్కువ దృష్టి పెడు తున్నాయి. పాలక పక్షాల అహంభావ ధోరణి పరిష్కారానికి దోహదం చేయదు.వాస్తవానికి పరీక్షా మోసాలను ఏదో ఒక రాజకీయ

పార్టీకో, ఏదో ఒక ప్రభుత్వానికో అంటగట్టడానికి వీల్లేదు. జాతీయ,రాష్ట్రాల స్థాయిలో వెల్లడైన మోసాల ఉదంతాల్లో తిలా పాపం తలా పిడికెడు అన్నట్లు ప్రధాన పార్టీలన్నీ తమ తమ పాలనాకాలంలో జరిగిన మోసాలకు బాధ్యత వహించాల్సిందే.

2005- 2026 మధ్య జరిగిన పరీక్షామోసాల సంఖ్య 220 కాగా అందులో మొదటి దశాబ్దంలో జరిగినవి 72 ఉదంతాలుగా, 2015-2026 మధ్య జరిగిన మోసాల సంఖ్య 148 గా ఉన్నట్లు "పరివర్తన్" వెల్లడించింది. 2005- 2015 మధ్య పేపర్ లీకేజీ సందర్భాలు 32 శాతం కాగా, 2015-2026 సంవత్సరాల మధ్య లీకేజీ సందర్భాలు 70 శాతానికి పెరిగాయి. పూర్వం పరీక్షలు పెద్దగా రద్దు కాలేదు. కానీ గత పదేళ్లలో దాదాపు ప్రతి ఏటా ఎక్కడో ఒకచోట పేపర్ లీక్ కావడం, పరీక్షలు రద్దు కావడం ఆనవాయితీగా మారింది. గణాంకాలు చూస్తే బీజేపీ అధికారంలోకి వచ్చాక కేసుల సంఖ్య రెట్టింపు అయినట్లు కనిపిస్తున్నది. కానీ ఇంటర్నెట్ ఆధారిత మొబైల్ వాడకం విపరీతంగా పెరగడం కూడా ఈ మోసాల సంఖ్య పెరగడానికి ఒక కారణంగా చెప్పవచ్చు. గుజరాత్, రాజస్థాన్, హర్యానా, ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, తెలంగాణా వంటి రాష్ట్రాల్లో గతంతో పోలిస్తే ఇలాంటి మోసాల ఉదంతాలు పెరిగాయని "పరివర్తన్" తన అధ్యయనంలో వెల్లడించింది.

పరీక్షా పత్రాల లీకేజీలను అరికట్టడానికి గుజరాత్ రెండు గట్టి చట్టాలను చేసింది. ఆ చట్టం అమల్లోకి వచ్చాక కూడా ఆ రాష్ట్రంలో లీకేజీ కేసులు పెరిగిపోవడం గమనార్హం. గుజరాత్ సెకండరీ సర్వీస్ సెలెక్షన్ బోర్డు నిర్వహించిన 11 వరుస పరీక్షల్లో మోసాలు జరిగాయని వెల్లడి అయ్యింది. అన్ని ఉదంతాలు జరిగినా అధికార పార్టీకి చెందిన బోర్డు చైర్మన్ ఏళ్ల తరబడి నిరాటంకంగా పదవిలో కొనసాగారు. చివరికి ఒక కేసులో నేరాభియోగ పత్రం దాఖలు అయ్యాకనే ఆయన రాజీనామా చేయాల్సి వచ్చింది.

రకరకాల పరీక్షల సందర్భంగా జరుగుతున్న మోసాల కారణంగా పిల్లలు ఆత్మహత్యలు చేసుకోవడం కూడా ఒక ధోరణిగా మారింది! దేశంలో ఏటా లక్షా డెబ్బై వేల ఆత్మహత్యలు నమోదవుతుండగా అందులో దాదాపు 8.5 శాతం ఆత్మహత్యలు చదువులకు, పరీక్షలకు సంబంధించినవే కావడం సమస్య తీవ్రతను వెల్లడిస్తున్నది!

నీట్ యూజీ 2026 కు సంబంధించిన ప్రశ్న పత్రాలను ఆయా కేంద్రాలకు రక్షణ శాఖ విమానాల ద్వారా చేరవేస్తామని రక్షణ శాఖ మంత్రి ప్రకటించారు. చదువులు, పరీక్షలు సంక్షోభంగా మారడం, వాటి నిర్వహణలో రక్షణశాఖ పాలుపంచుకోవాల్సి రావడం విచారకరం. ఘనత వహించిన మన అధికారయంత్రాంగం పరీక్షలు వంటి చిన్న చిన్న పనులు కూడా నిర్వహించలేని అశక్తతతో చతికిలబడి ఉన్నదన్న మాట. పరీక్షా పత్రాల పంపిణీకి సైతం సైన్యమే దిక్కు అనే సంకేతాన్ని మన పిల్లలకు ఇవ్వడం భావ్యమా?

డి. సోమ సుందర్

## జనబలం చందాదారులు, పాఠకులకు ముఖ్య గమనిక !

**క్షేత్రస్థాయి నుండి రాష్ట్ర స్థాయి దాకా జరిగే లోక్‌సత్తా ఉద్యమ కార్యక్రమాలను సభ్యులకి చేరవేసే ఒక న్యూస్ లెటర్ గా "జనబలం" పత్రిక 29 ఏళ్ల క్రితం మొదలయింది. నలుపు తెలుపు రంగుల్లో ఒక చిన్న న్యూస్ లెటర్‌గా ప్రారంభమైన జనబలం, లోక్ సత్తా ఉద్యమంతో పాటే ఎదిగింది. న్యూస్ లెటర్ దశ నుండి లోక్‌సత్తా భావజాల వ్యాప్తికి ఒక బలమైన మాధ్యమంగా, ఒక పూర్తి స్థాయి మాసపత్రికగా రూపుదిద్దుకుంది. వేలాదిమంది కార్యకర్తలకు కార్యాచరణలో కరదీపికగా మార్గదర్శనం చేసింది. ఒకానొక దశలో చందాదారుల సంఖ్య 35వేలు దాటింది. లోక్ సత్తా సభ్యులే కాకుండా, సమాజహితం కోరే ఎంతోమంది "జనబలం" ను ఆదరించారు. కొన్నాళ్ళ పాటు చందాదారులకే కాక, బహిరంగ మార్కెట్ లోను జనబలం పత్రిక పంపిణీ జరిగింది. లోక్ సత్తా కార్యకర్తలే కాకుండా మరెంతో మంది రచయితలు, కార్టూనిస్ట్ లు జనబలం ద్వారా ప్రజల్లో రాజ్యాంగం పట్ల, చట్టాల పట్ల అవగాహన పెంచే ప్రయత్నం చేసారు. లోక్ సత్తా ఉద్యమం ప్రారంభమై 2026 ఆగస్టుకు ముప్పై ఏళ్ళు పూర్తి అవుతున్నది.**

**ఇప్పుడు కాలం మారుతోంది. డిజిటల్ మీడియా యుగం నడుస్తోంది. పెద్ద పెద్ద దిన పత్రికలు కూడా వెబ్ ఎడిషన్స్ పైనే దృష్టి పెడుతున్నాయి. PDF కాపీలు మాత్రమే వాట్సాప్ ద్వారా పంపిణీ చేసే పత్రికలు కూడా ప్రజల ఆదరణ పొందుతున్నాయి. పాఠకులకు కూడా ఈ డిజిటల్ పత్రికలు చాలా సౌకర్యవంతంగా ఉన్నాయి. సమయం చిక్కినప్పుడు మొబైల్ ఫోన్‌లో చదువుకోవడానికి, మిత్రులతో షేర్ చేసుకోవడానికి ఇవి అనువుగా ఉన్నాయి. మరోవైపు పత్రిక ముద్రణ, పంపిణీ కూడా కష్టంగా మారుతోంది. అంతే కాకుండా ఇటీవల యూట్యూబ్ ద్వారా సమకాలీన పరిణామాలపై, లోక్ సత్తా అజెండాపై డా.జయప్రకాష్ నారాయణ్‌గారి వీడియో సందేశాలను, ప్రసంగాలను, ఇంటర్వ్యూలను ఎప్పటికప్పుడు అప్ లోడ్ చేస్తున్న సంగతి కూడా లోక్ సత్తా మిత్రులు గమనించే ఉంటారు.**


**ఈ నేపథ్యంలో పత్రికా సంపాదకవర్గం, లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాశ్ నారాయణ్ గారితో సంప్రదించి, ఒక కీలక నిర్ణయం తీసుకుంది. జూన్, జూలై, ఆగస్టు నెలలు మాత్రమే పత్రిక ముద్రించిన కాపీలు పోస్ట్ ద్వారా పంపిణీ అవుతాయి. సెప్టెంబర్ 2026 సంచిక నుంచి ఆన్‌లైన్ ఎడిషన్(పీడీఎఫ్) అందుబాటులో ఉంటుంది. ప్రతీనెలా జనబలం పీడీఎఫ్ కాపీ పంపేందుకు జనబలం చందాదారులు మీ వాట్సాప్ నెంబర్, మెయిల్ ఐడీ వివరాలు లోక్‌సత్తా కార్యాలయ వాట్సాప్ నెంబర్ 9866074025 కు పంపగలరు. చందాదారులు, పాఠకులు ఈ మార్పును గమనించి ఎప్పటి మాదిరిగానే సహకరించవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాము.**

**ఇట్లు**
**జనబలం సంపాదకవర్గం**

# సంక్షోభాన్ని సువర్ణావకాశంగా మలుచుకోవాలి

-డాక్టర్ జయప్రకాష్ నారాయణ్-

భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చుకునే అవకాశాన్ని ఎలాగైనా సద్వినియోగం గావించుకుందాం, ఇందుకు అవసరమైన ఆర్థిక క్రమశిక్షణను ఓట్ల కోసం ఉల్లంఘిస్తూ అప్పులు చేసి మరీ తాత్కాలిక తాయిలాల్ని పంచుతున్న కొన్ని రాష్ట్రాలను ఎలా దారికి తెద్దాం?.. అని మల్ల గుల్లాలు పడుతున్నాం. ఇలాంటి తరుణంలో పశ్చిమాసియా యుద్ధం వచ్చిపడింది. ఇరాన్ యుద్ధం మహాఅయితే కొన్ని వారాలపాటు జరుగుతుందని నాతో సహా చాలామంది విశ్లేషకులు అనుకున్నాం. సరఫరా గొలుసుల అవరోధం తాత్కాలికమని భావించాం. కానీ ఇప్పుడు చూస్తే, హోర్ముజ్ జలసంధిని మూసివేసి 10 వారాలు దాటిపోయాయి. శాశ్వత పరిష్కారం కన్పించటం లేదు. ఈ విపత్కర పరిస్థితికి అన్ని రకాలుగా సన్నద్ధమవ్వక తప్పదు. మధ్యకాలిక, దీర్ఘకాల నియంత్రణ చర్యలపై దృష్టి సారించటం తప్ప మార్గం లేదు. గల్ఫ్‌లో నౌకల వాణిజ్య రవాణాను ఇప్పటికిప్పుడు పునరుద్ధరించినా, సరఫరాలు సాధారణ స్థితికి రావటానికి కొన్ని నెలల సమయం పడుతుంది. 2027 వచ్చేస్తుంది. అదీగాక, ఈ సంక్షోభం, రవాణాకు అంతరాయం ఇంకొన్ని వారాలు, నెలలు కొనసాగవచ్చు. ఈ అంతరాయం ఇక్కడితో ఆగదు. భవిష్యత్తులో ఇలాంటి అంతరాయాలు మరిన్ని తలెత్తే అవకాశముంది. వాటికీ మనం సిద్ధం కావాలి.



మన తక్షణ సమస్య- 2027 ఆర్థిక సంవత్సరానికి భారీ విదేశీ వాణిజ్య లోటును ఎదుర్కోవటం. ఇప్పటికే విదేశీ ద్రవ్య నిల్వలు హరించుకుపోతున్నాయి. ధరలు గనక తొందరగా తగ్గకపోతే.. చమురు, గ్యాస్ దిగుమతుల ఖర్చే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 230 బిలియన్ డాలర్ల దాకా అయ్యే అవకాశముంది. దీంతోపాటు, బంగారం పట్ల మన ఎడతెగని మోజు.. ఫారెక్స్ నిల్వల్ని భారీగా ఖాళీ చేస్తోంది. గత మూడు ఆర్థిక సంవత్సరాలనే చూడండి. మనం 2273 మెట్రిక్ టన్నుల పసిడిని దిగుమతి చేసుకున్నాం. ఇది ప్రపంచం మొత్తం బంగారం ఉత్పత్తిలో 25 శాతం. 2021 ఆర్థిక సంవత్సరంలో మనం రికార్డుస్థాయిలో 1067 మెట్రిక్ టన్నుల బంగారం దిగుమతి గావించుకున్నాం. ప్రస్తుత పసిడి ధరల ప్రకారం, గత మూడేళ్ల దిగుమతుల విలువ 336 బిలియన్ డాలర్లు. ముడి చమురు, గ్యాస్ తర్వాత మనం అత్యధికంగా దిగుమతి చేసుకుంటున్నది బంగారాన్నే.

“సంక్షోభం అనేది వృధా చేసుకోకూడని గొప్ప అవకాశం” అంటారు ఆర్థిక శాస్త్ర నోబెల్ గ్రహీత పాల్ రోమర్. ప్రస్తుత సంక్షోభాన్ని మనం దేశానికో అవకాశంగా మలచాలి. ఈ నేపథ్యంలో.. బంగారం విషయంలో అందరికీ లాభదాయకమైన పరిష్కారాన్ని సవినయంగా ప్రతిపాదిస్తున్నాను. భారత్‌లో బంగారం ఉత్పత్తి నామమాత్రంగానే.. దిగుమతులు, నిల్వలు మాత్రం ప్రపంచంలోనే అత్యధికం. ఇందులో చాలావరకు ప్రయివేటు వ్యక్తుల వద్ద ఉన్నాయి.

రోమన్ సామ్రాజ్యం కాలం నుండి ఈ సంస్కృతి మన సమాజంలో భాగమైంది. మన దేశం విలాస సరకుల్ని రోమ్‌కి భారీగా ఎగుమతి చేసేది. సుగంధ ద్రవ్యాలు, ముత్యాలు, ఏనుగు దంతాలు, నాజూకు వస్త్రాలు వంటివి. రుతుపవన ఆధారిత వాణిజ్య మార్గాలను ఇందుకు వినియోగించుకునేది. ఈ ఎగుమతుల నుండి మనకు భారీ వాణిజ్య మిగులు లభించేది. ప్రతిగా బంగారం, వెండి, వజ్ర వైఢూర్యాలు వంటి విలువైన రాళ్లను పెద్దమొత్తంలో భారత్ దిగుమతి చేసుకునేది. ఈ వాణిజ్యంపై రోమ్‌లో ఆనాటి సుప్రసిద్ధ రచయిత, సేనానాయకుడు ప్లైనీ ది ఎల్డర్ (క్రీ.పూ 23-79) పెద్ద ఫిర్యాదే చేశారు. రోమన్లకు విలాస వస్తువుల పట్ల మోజును ఆసరాగా చేసుకుని రోమ్ సామ్రాజ్యం నుండి ఇండియా ప్రతి సంవత్సరం 100 మిలియన్ రోమన్ సిక్కాల (సెస్టర్లు అనే నాణేలు)ను కొల్లగొడుతోందని తీవ్రంగా ఆక్షేపించారు. అలా దిగుమతులు మొదలైన కాలం నుండి.. బంగారాన్ని దాచుకోవటం భారతీయ కుటుంబాలు, మత సంస్థలకు ఆనవాయితీగా మారింది. భారతీయుల వద్ద ఇప్పటికి 35-40,000 మెట్రిక్ టన్నుల పసిడి ఉందని అంచనా. మానవ జాతి చరిత్రలో వెలికితీసిన మొత్తం బంగారంలో



సుమారు ఇది 20%. భారత్‌లో ఉన్న ఈ మొత్తం బంగారం విలువ ప్రస్తుత ధరల ప్రకారం 5 ట్రిలియన్ డాలర్ల దాకా ఉంటుంది.

మన సాంస్కృతిక పరంపరలో బంగారు నగలు భాగమైనప్పటికీ, ఆ పసిడి మన దేశంలో నగల తయారీకి ఉపయోగపడటం లేదు, దీంతో విదేశాల నుండి ఏటా ఇంకా ఇంకా భారీ మొత్తాల్లో దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. పోనీ, డబ్బుల రూపంలోకి మార్చి మన సమాజానికో, కుటుంబానికో అభివృద్ధి అవసరాలకు ఉపయోగపడే పెట్టుబడిగా మార్చుకోగలుగుతున్నామా అంటే– అదీ లేదు. సుమారు 98% బంగారం ప్రజలుగా మన ఇళ్లలోనో, లాకర్లలోనో నిరుపయోగంగా ఉంది. రిజర్వు బ్యాంక్ వద్ద 880 మెట్రిక్ టన్నుల వరకు నిల్వలు ఉంటాయేమో.


2015లో ప్రవేశపెట్టిన గోల్డ్ మానిటైజేషన్ పథకం (జీఎంఎస్) కేవలం 37.81 మెట్రిక్ టన్నుల పసిడిని ఉత్పాదక అవసరాలకు మళ్లించగలిగింది. అదే సంవత్సరం తీసుకొచ్చిన సావరిన్ గోల్డ్ బాండ్ (ఎస్‌జీబీ) రూ. 72,000 కోట్లను మాత్రమే బాండ్లుగా మార్చగలిగింది. సభ్యుల పెట్టుబడి బాండ్ల ద్వారా పోగైన మొత్తం బంగారం సుమారు 147 మెట్రిక్ టన్నులు. ఇప్పుడు బంగారం ధర చుక్కలు చూపిస్తుండటంతో.. ప్రభుత్వ ఖజానాపైన ఆ మేరకు భారం పడుతుంది. జీబీఎస్ కింద హామీల్ని నెరవేర్చటానికి అంచనాలకు అనేకరెట్లు కావటంతో.. ఎక్కువ మొత్తాల్ని నష్టపోవాల్సి ఉంటుంది. ఇంత సంక్షోభంలోనైనా.. అత్యంత ఖరీదైన దిగుమతుల అవసరం లేకుండా, మన దేశీయ అవసరాలకు మన వద్దే నిరుపయోగంగా నిల్వవుంచిన బంగారాన్ని వినియోగించలేమా? దేశంలో మనందరి ఉమ్మడి అవసరాలకు మౌలిక వసతులను, మన ఉత్పాదక శక్తిని పెంచే ప్రయివేటు ప్రాజెక్టులకు అవసరమైన నిధులను సమకూర్చుకోవటం కోసం భారీ బంగారం నిల్వల రూపంలో

**సభ్యుల పెట్టుబడి బాండ్ల ద్వారా పోగైన మొత్తం బంగారం సుమారు 147 మెట్రిక్ టన్నులు. ఇప్పుడు బంగారం ధర చుక్కలు చూపిస్తుండటంతో.. ప్రభుత్వ ఖజానాపైన ఆ మేరకు భారం పడుతుంది. జీబీఎస్ కింద హామీల్ని నెరవేర్చటానికి అంచనాలకు అనేకరెట్లు కావటంతో.. ఎక్కువ మొత్తాల్ని నష్టపోవాల్సి ఉంటుంది.**

నిరుపయోగంగా ఉన్న ఈ పెట్టుబడిని ఉపయోగించలేమా? బాండ్ల పథకం – ఎస్‌జీబీలో చాలా రిస్క్ ఉన్నమాట వాస్తవం. బాండ్ కొనుగోలుదారులు నగదు చెల్లించి, వర్చువల్ (ఆన్‌లైన్) బంగారాన్ని కొనుగోలు చేస్తారు. బాండ్ విలువ మేరకు వడ్డీ అందుకుంటారు. బాండ్ గడువుతీరే సమయానికి బంగారానికి మార్కెట్‌లో ఎంత విలువ ఉంటే అంత మొత్తాన్నీ పొందే గ్యారంటీ ఉంటుంది. బాండ్‌ల ద్వారా కొనుగోలు చేసిన 147 మెట్రిక్ టన్నుల బంగారానికి ఇప్పటి మార్కెట్ రేటును చెల్లించాలంటే.. ప్రభుత్వం రూ. 100,000 కోట్లు నష్టపోయే అవకాశం ఉంది. ఆ పథకాన్ని అనాలోచితంగా రూపొందించటం వల్ల ఏర్పడిన నష్టమది.

కానీ, జీఎంఎస్ భిన్నమైనది. సరైనరీతిలో మెరుగుపరిస్తే జీఎంఎస్‌లో ప్రజలకు, ప్రభుత్వ ఖజానాకూ మంచి లాభావకాశాలున్నాయి. జీఎంఎస్‌లో తమ బంగారాన్ని యధాతథంగా (భౌతిక వస్తురూపంలో) ప్రజలు బ్యాంకులో డిపాజిట్ చేస్తారు. సురక్షితమైన వడ్డీ ఖాతాను ప్రారంభిస్తారు. ఏటా కొద్దిమొత్తం వడ్డీని ఆర్జిస్తారు. గడువు తీరాక, డిపాజిటర్‌కి బంగారాన్ని డబ్బు రూపంలో లేదా బంగారు కడ్డీలు లేదా నాణేల రూపంలో వడ్డీతో సహా చెల్లిస్తారు. ఇందులో






బ్యాంకులకు రిస్క్ చాలా తక్కువ. డిపాజిట్ చేసిన బంగారాన్ని కొంతమేర డిమాండ్‌ను బట్టి దేశీయ మార్కెట్‌కి మళ్లించవచ్చు. దీనివల్ల పసుపు లోహాన్ని దిగుమతి చేసుకోవాల్సిన అవసరం ఉండదు. విలువైన విదేశీ మారక ద్రవ్యాన్ని కోల్పోనక్కర్లేదు. ఈ పథకాన్ని గనక సులభతరం చేసి, అవసరానికి మించి సంక్లిష్టతలు లేకుండా, డిపాజిట్ దార్లకు తేలిగ్గా ఉండేలా ప్రక్రియను మారిస్తే.. బంగారాన్ని గణనీయ మొత్తంలో బ్యాంకులు ఆకర్షించగలుగుతాయి. ప్రయివేటు పౌరులను, కుటుంబాలను దొంగ-పోలీస్ తరహా ప్రశ్నలు అడగకుండా; ఇళ్లలోని బంగారాన్ని వెల్లడించినందుకు పన్నులు విధించకుండా ఉంటేనే అది సాధ్యమవుతుంది. సంఘటిత నేర ముఠాలు మనీ లాండరింగ్ లేదా అవినీతి ద్వారా సొమ్మును కష్టార్జితమన్నట్లు చెలామణిలోకి తెచ్చుకోకుండా జీఎంఎస్‌లో తగిన జాగ్రత్తలని తీసుకోవాలి.

**ఓ పదేళ్ల పాటు దిగుమతులకు విరామం అవసరం**

సరైన రీతిలో రూపకల్పన, అమలు చేస్తే.. మంచి ఫలితాలనిచ్చే అవకాశముంది. లావాదేవీలు సాధారణ బ్యాంకింగ్ కలాపంలా జరుగుతాయి. వ్యక్తులు, కుటుంబాలు తాము పొదుపు చేసుకున్న డబ్బుని బ్యాంకుల్లో డిపాజిట్ చేస్తుండటం మనందరికీ తెలిసిన విషయమే. అవసరం ఉన్నవారికి బ్యాంకులు వడ్డీకి ఆ డబ్బును రుణంగా ఇస్తాయి. డిపాజిట్ చేసినవారు వడ్డీ పొందుతారు. అవసరమైనప్పుడు డిపాజిట్‌ను వారు ఉపసంహరించుకోవచ్చు. బంగారాన్ని కూడా మనం అదేరీతిలో చెలామణి చేయవచ్చు. అవసరమైనప్పుడు డిపాజిట్లను తిరిగి తీసుకునే ఏర్పాటు చేయవచ్చు. దీనివల్ల పసిడి దిగుమతి భారీగా తగ్గుతుంది. అంతకంటే ముఖ్యం, ఇతర దేశాలనో, ద్రవ్య సంస్థలనో దేబిరించాల్సిన అవసరం లేకుండా.. బంగారం రూపంలో నిరుపయోగంగా ఉన్న అపార పెట్టుబడిని వినియోగంలోకి తేవచ్చు. డబ్బు రూపంలో చెలామణిలోకి తేవచ్చు. అభివృద్ధి, ఆర్థిక ప్రగతికి అవసరమైన పెట్టుబడి అవసరాలకు వినియోగించవచ్చు. దిగుమతుల మీద ఆధారపడాల్సిన అవసరంలేకుండా డిపాజిట్ రూపంలోని బంగారాన్ని క్రమంగా దేశ వినియోగ అవసరాలకు మళ్లిస్తారు. ఒక దశాబ్దకాలం గడిచేసరికి, మన ఆర్థిక వ్యవస్థ ఇంకా పరిణతి చెందుతుంది. హరిత సాంకేతికతలు విస్తరిస్తాయి. ఇంధన దిగుమతుల మీద మనం ఆధారపడటమూ తగ్గుతుంది. ఎగుమతులు పెరిగి వాణిజ్య మిగులు ఏర్పడుతుంది. అవసరమనుకుంటే, అప్పుడు అడపాదడపా కొంత బంగారం దిగుమతి మొదలు పెట్టవచ్చు. ఇప్పుడు మాత్రం.. ఓ పదేళ్ల పాటు మనం పసిడి దిగుమతులకు విరామం అవసరం.

'భారతదేశం ఓడిపోతే గెలిచేదెవరు? భారత్ గెలిస్తే ఓడిపోయేదెవరు? అని ప్రధాని నెహ్రూ అన్నారు. ఇప్పుడు దేశం కోసం ఈ లక్ష్యాల్ని నెరవేర్చే సంకల్పాన్ని.. ఆర్థిక, బ్యాంకింగ్, పన్నుల, బంగారం వాణిజ్య రంగాలలో నిపుణులు, ఆభరణాల తయారీదారులు ప్రదర్శించాలి. కలిసి కూర్చుని చర్చించాలి. చాలా జాగ్రత్తగా ఆలోచించి ఆకర్షణీయ పథకానికి రూపకల్పన చేయాలి. అది ఆచరణసాధ్యంగా, లక్ష్యాల్ని నెరవేర్చగలగాలి. ఒక పేద దేశం, అభివృద్ధి చెందిన దేశమవటానికి ఓ గొప్ప అవకాశం అందుబాటులోకి వచ్చిన దేశంలో.. భారీ పెట్టుబడిని నిరుపయోగకరంగా దాచిపెట్టటం, బంగారం పట్ల అంతులేని మోజును ప్రదర్శించటం, ఆర్థికాభివృద్ధికి పెట్టుబడి అవసరం విపరీతంగా ఉన్న సమయంలో 5 ట్రిలియన్ డాలర్ల పెట్టుబడి బంగారం రూపంలో నిరుపయోగకరంగా పడివుండటం తెలివైన పంథా కాదు. ప్రజల సాంస్కృతిక సున్నిత భావోద్వేగాల్ని, బ్యాంకుల ప్రయోజనాల్నీ పరిరక్షిస్తూ.. మన సాహసోపేత, ఆలోచనాపూర్వక కార్యాచరణకు ఇది అత్యంత విలువైన సమయం. ✦

# తెలంగాణ విద్యాకమిషన్ నివేదిక ముఖ్యాంశాలు



- ప్రభుత్వ టీచర్ల కారాలు, మిరియాలు..
- ఆకునూరి రాజీనామా

తెలంగాణ ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేశాక మరో విద్యాసంవత్సర క్యాలెండర్ మారుతోంది. చాలామంది ప్రభుత్వాధినేతలకు భిన్నంగా.. అధికారం లోకి వచ్చిన నాటి నుండే విద్యావ్యవస్థను బాగు చేయాలనే బలమైన ఆకాంక్షను రేవంత్ వ్యక్తం చేస్తున్నారు. డబ్బు అవసరానికి మించి ఖర్చు చేస్తున్నా పిల్లలకు చదువు రాకపోవడానికి పాఠశాల విద్యలోనే లోపం ఉందని ఆయన గుర్తించారు. విద్యలో ఎలాంటి మార్పులు తేవాలో తెలియ చేయటానికి రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి చైర్మన్‌గా విద్యా కమిషన్ ఏర్పాటు చేశారు. తగిన నిధులు సమకూర్చారు. 2024లో ఏర్పడిన ఈ కమిషన్ ప్రాథమిక నివేదికను 2025లో సమర్పించింది.

ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్.డి.ఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ కూడా తెలంగాణ విద్యావ్యవస్థలో అదనపు కేటాయింపులు అవసరం లేకుండా సమగ్ర మార్పులకు ఓ నోట్ ముఖ్యమంత్రికి సమర్పించి, వివరించారు. 2026 జనవరిలో విద్యా కమిషన్ పూర్తిస్థాయి నివేదికను ముఖ్యమంత్రి రేవంత్‌కి సమర్పించింది.

354 పేజీలు, 434 సిఫార్సుల తెలంగాణ విద్యాకమిషన్ పూర్తి నివేదికను అధికారిక వెబ్‌సైట్‌లో కూడా అందుబాటులోకి తెచ్చారు. అయితే కమిషన్ నివేదికలోని కొన్ని సిఫార్సులపై వివాదం పెరుగుతోంది.

ప్రభుత్వోద్యోగుల జీతభత్యాలను మార్కెట్‌కు అనుగుణంగా హేతుబద్ధీకరించాలని విద్యాకమిషన్ సిఫార్సు చేసింది. తమ వేతనాలకు సంబంధించి విద్యాకమిషన్ చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ ఉద్యోగుల ఐకాస (జాక్) ఆగ్రహం వ్యక్తం చేసింది.

ఇప్పుడున్న టీచర్ల జీతాలు తగ్గించమని తాను చెప్పలేదని, భవిష్యత్తులో రిక్రూట్‌మెంట్లకు సంబంధించి మాత్రమే జీత భత్యాల్ని హేతుబద్ధీకరించమని తాను చెప్పానని మురళి వివరణ ఇచ్చినా పట్టించుకోకపోవటం గమనార్హం.

విద్యకు కేంద్రబిందువైన విద్యాప్రమాణాలు రాష్ట్రంలో ఎందుకు అధ్వాన్నంగా ఉన్నాయో కనీసం ఆత్మవిమర్శ గావించుకోని టీచర్లు, ఇతర ప్రభుత్వోద్యోగుల సంఘాలు.. అసలు తమ జీతాల గురించి మాట్లాడటమే దుస్సాహసమన్నట్లు వ్యవహరించటాన్ని ఒకరిద్దరు మినహాయించి ప్రభుత్వం, పౌర సమాజం లోని పెద్దలు కూడా ఖండించే బాధ్యతను ప్రదర్శించకపోవటం విషాదకరం. ప్రభుత్వోద్యోగుల జీతభత్యాలు, సంక్షేమ పథకాల భారం పెరగటం వల్లే హిమాచల్‌ప్రదేశ్‌లో ఉన్నతాధికారుల జీతాల్ని తగ్గించిన సంగతి వారు గమనించలేదేమో. ఆచరణ సాధ్యంకాని, ఈవేళ మనం వాటా చెల్లించకుండా తీసుకునే పెన్షన్ భవిష్యత్తు తరాల మీద మితిమీరిన, అన్యాయమైన పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) పునరుద్ధరించవద్దని, 2004 నుండి అమలు చేస్తున్న కంట్రిబ్యూటరీ పింఛను విధానాన్నే (ఎన్‌పీఎస్/సీపీఎస్)నే కొనసాగించాలని డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ పలు సందర్భాల్లో పేర్కొన్నారు. అప్పు చేసి రాష్ట్రాలు సంక్షేమ పథకాలు వంటి రోజు వారీ ఖర్చులు చేయకుండా రాజ్యాంగంలోని ఆర్టికల్ 296 ద్వారా ఎఫ్ఆర్‌బీఎం తరహాలో కట్టడి చేయాలని యూనియన్‌కి విజ్ఞప్తి చేశారు. కానీ ఇవేవీ వినిపించుకునే స్థితిలో ఎక్కువమంది టీచర్లు, ఇతర ప్రభుత్వోద్యోగులు లేరు. ప్రభుత్వం ఆమోదించకుండానే.. అధికారిక వెబ్‌సైట్‌లో నివేదికను కమిషన్‌వారు ఎలా అప్‌లోడ్ చేశారని పసలేని వాదనలు వినిపిస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ కూడా.. ఈ సిఫార్సుపై ఏ విమర్శ వచ్చినా మురళి పేరే చెబుతాననటం, మూడు కాళ్ల గుర్రంపై స్వారీ చేసే రౌతు సామెతను గుర్తుచేస్తోంది. టీచర్లు, ఇతర ప్రభుత్వోద్యోగుల జీతాలు తగ్గించాలనే సిఫార్సు వద్దని చెప్పినా, చైర్మన్ వినలేదని విద్యా కమిషన్‌లోని ఒక సభ్యుడు మీడియాతో చెప్పటం వివాదాన్ని మరింత పెంచింది. తన పదవీకాలం నాలుగు నెలలుండగానే, ఆకునూరి మురళి రాజీనామా సమర్పించారు.

ముఖ్యంగా 'విద్య అంటే విద్యార్థి కేంద్రంగా ఉండాలని, మంచి విద్యలో ప్రమాణాలు కీలకమని' నివేదిక స్పష్టంగా పేర్కొంది. కొన్ని సిఫార్సులు తక్షణ ఆమోదనీయత కోసం పెద్ద దూరదృష్టి లేకుండా చేసినవి అనిపించినా, అవసరమైతే చర్చించి మార్చుకోవచ్చని ప్రజాస్వామిక వైఖరితో కమిటీవారే పేర్కొనటం వల్ల వ్యతిరేకించనక్కర్లేదు. **తెలంగాణ విద్యాకమిషన్ నివేదికలోని ముఖ్యాంశాలను అందించే ప్రయత్నం ఈ వ్యాసం..**

నివేదికను తయారుచేయటానికి సుమారు 14 నెలలకు పైగా సమయాన్ని ఆకునూరి మురళి కమిషన్ తీసుకుంది. ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్ని ప్రీ ప్రైమరీ నుండి, కళాశాలలు, విశ్వవిద్యాలయాలను తెలంగాణలోని 33 జిల్లాల్లో అధ్యయనం చేసింది. పంజాబ్, హర్యానా, ఆంధ్రప్రదేశ్, కేరళం, కర్ణాటక తదితర రాష్ట్రాలలో సందర్శించింది. మలేషియా, వియత్నాం, సింగపూర్, అమెరికా తదితర దేశాల్లోని ప్రభుత్వ పాఠశాలల్ని కొంతమేర అధ్యయనం చేసింది. ఇలా 305 విద్యాసంస్థల్ని

పరిశీలించటంతోపాటు.. విద్యాకమిషన్ కార్యాలయంలో సమావేశాలు, తల్లిదండ్రులు, ఇతర సంబంధిత వర్గాలతో సెమినార్లు నిర్వహించింది. మేధోమథనం అనంతరం నివేదిక రూపొందించారు.

**నివేదిక ముఖ్యాంశాలు**

**1. ప్రీ ప్రైమరీ విద్య:** విద్యాప్రమాణాలు అధ్వాన్నంగా ఉండటానికి, ప్రభుత్వ స్కూళ్లలో పిల్లల చేరికలు తగ్గిపోతుండటానికి ప్రీ ప్రైమరీ స్థాయి విద్యలో అవ్యవస్థ ఒక కీలక కారణం. ప్రస్తుతం తెలంగాణలో అంగన్‌వాడీలు పెద్దసంఖ్యలో ఉన్నా, బోధన అక్కడ ప్రధానాంశం కాదు.

సిఫార్సులు: ఎ) అంగన్‌వాడీల్లో కావచ్చు, ప్రభుత్వ పాఠశాలల్లోనే కావచ్చు.. ప్రీ ప్రైమరీ విద్యకు వ్యవస్థీకృత ఏర్పాట్లు చేయాలి. ప్రపంచస్థాయిలో స్థిరీకరించిన ప్రమాణాలను అనుసరించాలి.

బి) క్వాలిఫైడ్ టీచర్లను నియమించాలి. సి) భద్రతకు తగిన చర్యలు తీసుకోవాలి. ఇతర మౌలిక వసతుల్ని కల్పించాలి.

డి) యూనిఫాం డ్రెస్ కోడ్ ప్రమాణాల్ని పాటించాలి.

**2. పాఠశాల విద్య:** పాఠశాల విద్యలో నాణ్యత, మౌలిక వసతుల లేమి, తగ్గుతున్న పిల్లల నమోదు, తరగతి స్థాయికి సరితూగని అభ్యసన ప్రమాణాలు, అధ్వాన్నంగా ఇంగ్లిష్ నైపుణ్యం, పర్యవేక్షణ, జవాబుదారీతనానికి అవసరమైన వ్యవస్థలు కొరవడటం వంటి సమస్యలు పాతుకుపోయాయి. దీంతో తల్లిదండ్రులు ప్రయివేటు స్కూళ్లలో పిల్లల్ని చేరుస్తున్నారు. ఈ సవాళ్లను ఎదుర్కోవటానికి వ్యవస్థీకృతమైన, ఆచరణ సాధ్యమైన సిఫార్సుల్ని అమలు చేయాలి.

**సిఫార్సులు:** ఎ) ఉపాధ్యాయుల రిక్రూట్‌మెంట్ ప్రక్రియను మరింత జవాబుదారీతనంతో రూపొందించాలి. సమాజావసరాలకు తగ్గ బోధనకు ప్రాధాన్యతనిచ్చేలా ఎంపిక ప్రక్రియ ఉండాలి. టీచర్ల నియామకాలను హేతుబద్ధీకరించాలి. పటిష్ఠ జవాబుదారీతనానికి ఏర్పాట్లు సంస్థాగతంగా ఉండాలి. సబ్జెక్ట్‌లో ప్రావీణ్యం, బోధనా నైపుణ్యాలు, ముఖ్యంగా ఇంగ్లిష్‌లో దీర్ఘకాల అనుభవంతో కూడిన నైపుణ్యం, బోధనలో ప్రతిభ చూపిన ఉపాధ్యాయులకు ప్రోత్సాహకాలు, తగిన మద్దతు వ్యవస్థ ఉండాలి.

బి) ప్రాథమిక, ఉన్నత పాఠశాల స్థాయిలో ఇంగ్లిష్ మీడియం విద్యను, ఇంగ్లిష్‌లో ధారాళంగా మాట్లాడటాన్ని ప్రోత్సహించాలి. (ఎక్కువమందికి మాతృభాష)లో కూడా పాఠ్యాంశాలను వివరించాలి. దీనివల్ల విషయం మెరుగ్గా అర్థం కావటంతోపాటు..ఇంగ్లిష్ కూడా సొంత భాషలా పరిచయమవుతుంది.

సి) పాఠశాలల మౌలిక వసతులు, భద్రతాపరమైన చర్యలు, ల్యాబొరేటరీలు, గ్రంథాలయాలు, డిజిటల్ మౌలిక వసతుల్ని ప్రామాణీకరించాలి. డి) బట్టీ పట్టటం నుండి పోటీ ఆధారిత, ప్రయోగాత్మక, ఆచరణ ద్వారా నేర్చుకునే పద్ధతులను ప్రోత్సహించాలి. ఫౌండేషనల్ లిటరసీ, న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్) పద్ధతిని ప్రాథమిక తరగతులలో అమలు చేయాలి. ఆలోచించటం, సమస్యల్ని పరిష్కరించటం, నేర్చుకున్న అంశాల్ని రోజువారీ జీవితంలో అమలు చేయగలగటం ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల స్థాయి బోధనగా ఉండాలి.

ఇ) విద్యార్థి సమగ్ర వికాసానికి అవసరమైన సహ విద్య, పాఠ్యాంశాలకు అదనంగా శారీరక దారుఢ్యాన్ని, మానసిక ఉల్లాసాన్ని పెంపొందించే విద్య (ఎక్స్‌ట్రా కరిక్యులర్) ఉండాలి.

ఎఫ్) అభ్యసన ప్రమాణాల్ని బేరీజు వేసే పద్ధతుల్ని హేతుబద్ధీకరించాలి. సులభంగా, ప్రామాణికంగా అంచనాలు రూపొందించగలగాలి. స్వతంత్ర బృందం (థర్డ్ పార్టీ) చేత పోటీతత్వం, నిష్పాక్షికత ప్రాతిపదికన ధృవీకరణ పొందాలి. ప్రమాణాల్ని అనుసరించటం, బోధనాపరమైన అవసరాల్లో మద్దతు, అభ్యసన ఫలితాలు, ప్రమాణాల నిరంతర మెరుగుదల కోసం నిర్ణీత కాలవ్యవధిలో ఇన్‌స్పెక్షన్లు నిర్వహించాలి.

జి) పాఠశాల విద్యలో పాలనా ప్రక్రియను మెరుగుపరిచి వికేంద్రీకృత నిర్ణయాల్ని ప్రోత్సహించాలి. అధికారాల విభజన స్పష్టంగా ఉండాలి. పర్యవేక్షణ ఖాళీల్ని భర్తీ చేయాలి. డేటాను మెరుగ్గా వినియోగించుకోవాలి. పాఠశాలల్లో నాయకత్వ బాధ్యతల నిర్వహణను ప్రోత్సహించాలి. తరగతి గది స్థాయి ప్రభావాన్ని పెంచేందుకు విద్యాపరంగా మెంటారింగ్, జవాబు దారీతనం, క్లస్టర్ పద్ధతి వంటి విధానాల్ని అనుసరించాలి.

3. ఇంటర్మీడియెట్: ఇంటర్ దశ విద్యార్థులకు సంధి దశ. వయసు రీత్యా భావోద్వేగాలు ఉధృతంగా ఉండే కాలం. ఉద్వేగాలను నిర్మాణాత్మకంగా మళ్లించకపోతే.. ఉన్నత విద్యలో, కెరీర్‌లో విపరీత పరిణామాలు ఎదురయ్యే అవకాశముంది. ప్రయివేటు, కార్పొరేట్ కళాశాలలున్నప్పటికీ.. కస్తూరిబా, ఇతర రెసిడెన్షియల్ కళాశాలలు మంచి ఫలితాలు సాధిస్తున్నాయి. కార్పొరేట్ కళాశాలల్లో గంటల తరబడి బట్టీ పట్టటం, ఆటవిడుపు లేకపోవటం వంటి సమస్యలతోపాటు.. రాష్ట్ర సిలబస్‌ను హడావుడిగా కొద్ది రోజుల్లో పూర్తి చేస్తుంటారు. 1% ర్యాంకుల కోసం 99% మంది జీవితాలతో చెలగాటమాడే రీతిలో అక్కడ బోధన ఉంటోంది. ప్రభుత్వ కళాశాలలు గ్రామీణ విద్యార్థులకు ఉపయోగపడుతున్నాయిగానీ, రకరకాల సమస్యలను ఎదుర్కొంటున్నాయి.

**సిఫార్సులు:** ఎ) ఇంటర్మీడియెట్‌ను స్కూలు విద్యలో విలీనం (ప్లస్ టూ) చేయాలి. బి) కార్పొరేట్ కళాశాలల్ని ఆరోగ్యకరమైన రీతిలో సమగ్ర నాణ్యమైన విద్య దిశగా మళ్లించటం, విద్యార్థుల వికాసానికి అవరోధాలపై ప్రభుత్వం ఎప్పటికప్పుడు పర్యవేక్షించటం. కెరీర్ కౌన్సెలింగ్‌కి ఏర్పాట్లు.సి) ఇంటర్మీడియెట్‌లో వృత్తి విద్యను ఐటీఐలు, పాలిటెక్నిక్‌లకు బదిలీ చేయటం.

4. **తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు (టీపీఎస్).. రూ.48,000తోనే మంచి విద్య:** స్కూళ్లను బలవంతంగా విలీనం చేయకుండా ఆధునిక మౌలిక వసతులతో తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను ఏర్పాటు చేయాలి. వీటితోపాటు ఫౌండేషనల్ స్కూళ్లు 35 లక్షల మంది విద్యార్థులకు అవకాశం కల్పిస్తాయి. వీటివల్ల విద్యాప్రమాణాల్ని కనిష్ట స్థాయి నుండి గరిష్ట స్థాయికి వేగంగా పెంచవచ్చు. నిర్దిష్ట దూరంతో వీటిని ఏర్పాటు చేసి, అవసరమైన విద్యార్థులకు స్కూల్ బస్సులతో రవాణా సౌకర్యం కల్పించాలి.

ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ఒక్కో పాఠశాల విద్యార్థి మీద ఏటా రూ. 1,30,000 దాకా ఖర్చు చేస్తోంది. టీపీఎస్‌లలో నాణ్యమైన చదువు రావటంతోపాటు.. ఒక్కో విద్యార్థికి సంవత్సరానికి

కేవలం రూ.48,000 ఖర్చవుతుంది. గురుకుల పాఠశాలల్లో మెరుగైన విద్య అందుతున్నా.. స్కూలు వయసు నుండి ఇంటికి దూరంగా హాస్టళ్లలో ఉండటం భవిష్యత్తులో విద్యార్థుల మానవ సంబంధాలకి అవరోధం కావచ్చు. ప్రపంచంలో ఏ దేశంలోనూ గురుకుల పాఠశాలల వ్యవస్థ లేదు.

**5. టీచర్ ఎడ్యుకేషన్:** విద్యలో నాణ్యత, సమానత్వం, సామర్థ్యాలు వికసించటానికి బోధనా ప్రమాణాలు కీలకం. పిల్లల అభ్యసన ఫలితాలు మెరుగవ్వాలంటే.. ఉపాధ్యాయ విద్యను సమూలంగా సంస్కరించాలి. విద్యాకమిషన్ సందర్శించిన ఒక బీఈడీ కళాశాల భవనం బ్రహ్మాండంగా ఉంది. కానీ టీచర్లు, సిబ్బంది, విద్యార్థులు ఎవరూ లేరు. వాచ్‌మన్ మాత్రమే ఉన్నాడు. ప్రిన్సిపాల్‌ని పిలిపిస్తే, చాలా కాలేజీలు ఇలాగే ఉంటాయని నసిగారు. ఎప్పుడో పూర్వకాలం ఏర్పాటు చేసిన డీఈడీని ఇప్పటికీ కొనసాగిస్తూ, అంతకంటే ఎక్కువ అర్హత గల బీఈడీ వారిని కొన్ని పోస్టులకు అనర్హుల్ని చేస్తున్నారు. 'ప్రయివేటు పాఠశాలల్లో టీచర్లకు ఎక్కువ క్వాలిఫికేషన్, తక్కువ జీతం' పద్ధతిని అనుసరిస్తుండగా.. ప్రభుత్వ స్కూళ్లలో అందుకు విరుద్ధంగా 'తక్కువ క్వాలిఫికేషన్, ఎక్కువ జీతం' పద్ధతిని అమలు చేస్తున్నారు.

**సిఫార్సులు:** డీఈడీని రద్దు చేయాలి. ఇప్పటికే ఆ డిప్లొమో చేసినవారికి ప్రత్యామ్నాయాలు చూపాలి. ప్రీసర్వీస్ టీచర్ ఎడ్యుకేషన్ (పీఎస్‌టీఈ), ఇన్ సర్వీస్ టీచర్ ఎడ్యుకేషన్ (ఐఎన్ఎస్‌టీఈ)తోపాటు నిర్వహణ, నియంత్రణ పరంగా కూడా సంస్కరణలు అమలు చేయాలి.

**6. తెలంగాణ ఎడ్యుకేషన్ స్టాండర్డ్స్ అథారిటీ (టీఈఎస్ఏ):** విద్యార్థులు ఏం నేర్చుకున్నారు, సంస్థాగత ప్రమాణాలు ఎలా ఉన్నాయి అంచనా వేయటానికి తెలంగాణలో ఒక సమగ్రమైన, స్వతంత్రమైన, విశ్వసనీయమైన వ్యవస్థ లేదు. అతుకుల బొంత డేటా వ్యవస్థ మీద ఆధారపడుతోంది. అంతర్గత అసెస్‌మెంట్లు, బలహీన పర్యవేక్షణ వ్యవస్థలు వంటి వాటి వల్ల ప్రభుత్వానికి, ప్రజలకు పాఠశాలల నాణ్యత, బోధన ప్రభావం, పిల్లల అభ్యసన సామర్థ్యాలు, ఉన్నత విద్యాసంస్థల బోధనారోగ్యం మొదలైన అంశాలపై వాస్తవాలు తెలియటం లేదు. మొత్తంగా ఎక్కువ మంది విద్యార్థులకు నైపుణాలు పెంపొందటం లేదు. నియంత్రణా సంస్థ అనుమతి, ఎఫిలియేషన్ జారీ చేయటం తప్ప ఆ తర్వాత క్రియాశూన్యమవుతోంది. స్వచ్ఛంద అక్రెడిటేషన్, ర్యాంకింగ్ పద్ధతులు జవాబుదారీతనాన్ని మరింత బలహీన పరుస్తున్నాయి. ఫలితంగా, విద్యార్థులకు అర్థవంతమైన విద్యా ప్రమాణాలు అందించటంలో ప్రభుత్వ,ప్రయివేటు తేడా లేకుండా తరచూ, ఎక్కువశాతం విఫలమయ్యే వ్యవస్థ స్థిర పడింది.

**సిఫార్సులు:** ఎ) ఈ రకమైన వ్యవస్థీకృత బలహీనతల్ని నిరోధించేందుకు, తెలంగాణ ఎడ్యుకేషన్ స్టాండర్డ్స్ అథారిటీ (టీఈఎస్ఏ)ను చట్టబద్ధ సంస్థగా ఏర్పాటు చేయాలి. ఇది అత్యున్నత స్థాయి సంస్థగా, స్వతంత్ర ప్రతిపత్తితో వ్యవహరించగలగాలి. పాఠశాలలు, ఉన్నత విద్యాసంస్థలకు ప్రమాణాలను నిర్ణయించటం, అవి ఏమేరకు సాధిస్తున్నాయో ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియచేయటం ఈ సంస్థ బాధ్యత. విశ్వసనీయ బయటి (థర్డ్ పార్టీ) సంస్థ ద్వారా విద్యార్థుల అభ్యసన ప్రమాణాలను బేరీజు వేయటం, పాఠశాలు, ఉన్నత విద్యాసంస్థలను అభ్యసన ఫలితాలు సహా స్పష్టంగా నిర్వచించిన ప్రమాణాలకనుగుణంగా మదింపు చేయటం, లోపాల్ని జల్లెడ పట్టి గుర్తించటం, విధానాలు, అమలు పరంగా తీసుకోవాల్సిన చర్యలకు తగిన పటిష్ఠ సాక్ష్యాధారాలను, వాదనలను అందించటం.. సంస్థ విధుల్లో భాగం.

బి) స్కూలు విద్యలో టీఈఎస్ఏ 2 నుండి 12వ తరగతుల వరకు (10, 12 తరగతులు మినహాయించి) సమ్మేటివ్ ఎసెస్‌మెంట్లు నిర్వహిస్తుంది. పూర్వ ప్రాథమిక, ప్రాథమిక తరగతుల్లో ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్.ఎల్.ఎన్)పై, ఉన్నత పాఠశాల తరగతుల్లో కాన్సెప్ట్‌పరమైన అవగాహన, నిత్యజీవితంలో ఉపయోగించగలగటంపై ఈ అథారిటీ దృష్టి సారిస్తుంది. ఎటువంటి దుర్వినియోగానికి, వక్రీకరణకు అవకాశంలేకుండా పకడ్బందీ జాగ్రత్తలతో ఈ రకమైన ఎసెస్‌మెంట్లని రూపొందించి అమలు చేస్తారు. సవివరంగా, ప్రతి విద్యాసంస్థ, బోధనా సిబ్బంది, విద్యార్థి పరంగా సమగ్ర రీతిలో వీటిని రూపొందిస్తారు. ఏ రకమైన చర్యలు తీసుకుంటే విద్యాప్రమాణాలకు సంబంధించి లోపాల్ని సరిచేయవచ్చో ప్రతి కేస్‌నీ విశ్లేషించి తగిన సూచనలు చేస్తారు. ఎసెస్‌మెంట్లు, సమీక్షలు విధిగా నిర్వహిస్తారు. వేగంగా నేర్చుకోగలిగిన విద్యార్థులకు, వెనుకబాటుతనం మధ్య పెరిగిన పిల్లలకు మధ్య అభ్యసన అంతరాలను గుర్తించి సరిదిద్దేలా చేస్తారు. అభివృద్ధి చెందిన దేశాల్లోలా చివరి బెంచ్‌లో విద్యార్థికి కూడా అర్థమయ్యేలా బోధన పట్ల శ్రద్ధ వహించాలి.

సి) ఉన్నత విద్యలో టీఈఎస్ఏ బేస్‌లైన్ ఎసెస్‌మెంట్లు నిర్వహిస్తుంది. కొత్తగా చేరే విద్యార్థుల్లో ప్రాథమిక స్థాయి అంతరాలను గుర్తిస్తారు. డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులను కూడా పరీక్షించి.. ఏం నేర్చుకున్నారు, సదరు విద్యాసంస్థ వల్ల వారికి కలిగిన ప్రయోజనాలను బేరీజు వేస్తారు. అంతర్జాతీయ, జాతీయ అత్యుత్తమ పద్ధతులకు అనుగుణంగా స్కూళ్లు, ఉన్నత విద్యాసంస్థలకు ర్యాంకులు, గ్రేడ్‌లు ఇచ్చేందుకు ఒక అంచనా పద్ధతిని కూడా టీఈఎస్ఏ రూపొందిస్తుంది. వన రులు, బోధనా నాణ్యత, అధ్యాపక సిబ్బంది అందుబాటు, సమ్మిళిత తత్వం, నాయకత్వం, విద్యార్థుల అభ్యసన ఫలితాలు మొదలైన అంశాలను కూడా ఇందులో పరిగణలోకి తీసుకుంటుంది. ఈ మొత్తం సమాచారాన్ని అందరికీ అందుబాటులో ఉంచటం ద్వారా.. విద్యార్థులు, ఆయా కుటుంబాలు అవగాహనతో ఎంపిక నిర్ణయాలు గావించుకునేలా టీఈఎస్ఏ ప్రక్రియను మెరు గుపరుస్తుంది.

డి) ప్రమాణాల్ని బేరీజు వేయటాలు, ర్యాంకింగులతో పాటు టీఈఎస్ఏ సమాచార, పరిశోధనా కేంద్రంగా కూడా వ్యవహరిస్తుంది. విద్యావ్యవస్థ ఎదుర్కొంటున్న సవాళ్లపై తగిన సంస్కరణలకు పరిశోధన, విధానపరమైన జోక్యాన్ని బేరీజు వేయ టం, జాతీయ, అంతర్జాతీయ సంస్థలతో పరిజ్ఞానాన్ని పంచు కోవటం, సమన్వయంతో పనిచేయటం వంటి బాధ్యతలు నిర్వర్తిస్తుంది. స్వతంత్ర ప్రతిపత్తి, విశ్వసనీయత, వృత్తిపరమైన నిజా యతీ, సుప్రసిద్ధులతో నిర్వాహక బోర్డు, నిర్దిష్ట పదవీకాలం, పార దర్శక నియామక ప్రక్రియ, అసంబద్ధ జోక్యాలకు ఆస్కారం లేకుండా

చట్టబద్ధ రక్షణ మొదలైనవి అథారిటీ పాలనా పద్ధతుల్ని రూపొందిస్తారు.

ఇ) మొత్తంగా, విధిగా అమలు చేయాల్సిన పద్ధతులతోపాటు.. వాస్తవాలు, సాక్ష్యాల ఆధారంగా జవాబుదారీతనం, నిరంతరం మెరుగుపరచుకోవటం, అర్థవంతమైన అభ్యసనం, నాణ్యతలపై నిలకడగా కేంద్రీకరించటం టీఈఎస్ఏ విధుల్లో భాగం.

7) **రెసిడెన్షియల్ విద్యా సంస్థలు:** ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే రెసిడెన్షియల్ విద్యాసంస్థలు అత్యధికంగా ఉన్న రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పెద్ద సంఖ్యలో ఇవి పెరిగినా.. సాంకేతిక, పాలనా పరమైన లోపాలు, బలహీనతలు వెన్నాడుతున్నాయి. ఆహారం తరచూ పౌష్టికత కొరవడుతోంది, కలుషితమవుతోంది.

**సిఫార్సులు:** ఎ) సుమారు 7.45 లక్షల మంది విద్యార్థులు, 36,000 మంది ఉపాధ్యాయులున్న రెసిడెన్షియల్ వ్యవస్థను సమర్థ వంతం చేయాలి. ఇందుకోసం వీటిన్నిటినీ ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చేలా 'రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ సొసైటీ'ని ఏర్పాటు చేయాలి. బి) విద్యార్థుల సంఖ్య గరిష్టంగా 1000కి మించకూడదు.

సి) రిజర్వేషన్లు, గిరిజన ప్రాంతాల్లో రెసిడెన్షియళ్లను యథాతథంగా కొనసాగించాలి.డి) పౌష్టికాహారం పరిశుభ్రంగా అందుబాటులోకి తెచ్చేందుకు సమగ్ర చర్యలు తీసుకోవాలి.ఇ) స్థానిక సంస్కృతికి అనుగుణంగా తగిన మార్పులు గావించు కునేందుకు వీలుగా, పాలనా నిర్వహణను వికేంద్రీకరించాలి. ఫిన్లాండ్, బ్రిటన్ తరహా విద్యావిధానాన్ని యథాతథంగా మన వద్ద అమలు చేయటం వల్ల ఫలితాలు వికటించే అవకాశం ఉంది.

8. **కళాశాల విద్య:** అందరికీ అందుబాటు, విద్యార్థుల చేరికల్లో తెలంగాణ కాలేజీ విద్య బలమైన ప్రగతి సాధించింది. 40% జీఈఆర్, 1.8% లింగ సమానత్వంతో జాతీయ సగటును మించింది. అండర్ గ్రాడ్యుయేట్ స్థాయిలో 65% మంది ప్రయివేటు రంగంలో చదువుతున్నారు. 'న్యాక్' గుర్తింపు అంతంత మాత్రంగా ఉండగా, జాతీయ స్థాయి 100 ర్యాంకుల్లో ఒక్క కాలేజీ కూడా స్థానం సంపాదించలేకపోయింది.

**సిఫార్సులు:**ఎ)సంఖ్యాపరంగా విస్తరించటం కంటే.. నాణ్యతా పరంగా స్థిరీకరించటం మేలు.బి) వికేంద్రీకరించాలి.

**9) సాంకేతిక విద్య:** జనాభా పరంగా అతి ఎక్కువ ఇంజినీరింగ్ కళాశాలలున్న రాష్ట్రం తెలంగాణ. 2024-25లో 175 కాలేజీలున్నాయి. ఇంజినీరింగ్ విద్య సంతృప్తస్థాయికి చేరింది. తర్వాతి దశకు సంస్కరణలు కొరవడటం, వేగంగా మారుతున్న సాంకేతికతలతో సమస్యల వలయంలో కూరుకుపోతోంది. పాతకాలం పాఠ్యాంశాలు, ఉపాధి మార్కెట్ అవసరాలతో పొంతన లేని అభ్యసనం మొదలైన వ్యవస్థీకృత బలహీనతలు వేధిస్తున్నాయి. దీనివల్ల రాష్ట్రం సాంకేతికత, ఆవిష్కరణల్లో ఆశించిన లక్ష్యాల్ని సాధించలేకపోతోంది. కొన్ని చిన్న కళాశాలల్లో అతి తక్కువ సదు పాయాలున్నాయి. అనేక అంతరాలు కొనసాగుతున్నాయి. జాతీయ, అంతర్జాతీయ యూనివర్సిటీలను ప్రోత్సహించటం, సంస్కరణల్ని అమలు చేయటం అవసరం.

9.2) **పాలిటెక్నిక్ కళాశాలలు:** కీలక ప్రాధాన్యత కలిగినవి గానీ, ఉన్నకొద్దీ బలహీనమవుతున్నాయి. రాష్ట్ర సాంకేతిక అనుకూలతలకు (ఎకోసిస్టమ్) విలువ జోడించలేకపోతున్నాయి. ప్రభుత్వ, ప్రయివేటు కలిపి రాష్ట్రంలో మొత్తం 128 పాలిటెక్నిక్ కళాశాలలున్నాయి. పాఠ్యాంశాల నుండి ల్యాబొరేటరీల వరకు కీలక మార్పులు అమలు చేయాలి.

10)**యూనివర్సిటీ విద్య:** ఎన్నడూలేనిస్థాయి సంక్షోభం విశ్వ విద్యాలయ విభాగంలో రాజ్యమేలుతోంది. 1917లో స్థాపించిన ఉస్మానియా వర్సిటీ ఎంతో గొప్ప విద్యాసంస్థగా పేరొందినప్పటికీ.. విద్యాపరమైన నిబద్ధత, పాలనా వ్యవస్థలు, దీర్ఘకాలిక మనుగడపరంగా సమస్యలను ఎదుర్కొంటోంది.

**సిఫార్సులు:** ప్రతిభావంతులైన, సమర్థులైన వీసీల నియామకానికి వివాదరహిత ప్రక్రియను ప్రవేశపెట్టాలి. సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను రెగ్యులర్ చేయాలి. పరిశోధనను ప్రోత్సహించాలి.

11) **మధ్యాహ్న భోజనం, పౌష్టిక, సురక్షిత ఆహారం:** సదుద్దేశంతో ప్రవేశపెట్టిన పథకమిది. నాణ్యతతో ప్రామాణీ కరించాలి. సరఫరాలు, సేవలన్నిటినీ ఆన్‌లైన్ చేయాలి. విద్యార్థుల దీర్ఘకాల ఆరోగ్యానికి, సురక్షితకు, పౌష్టికతకు ప్రాధాన్యం ఇవ్వాలి.

**12) ఓపెన్ & డిస్టెన్స్ లెర్నింగ్ (ఓడీఎల్) – ఆన్‌లైన్ విద్య:** ఓపెన్ విద్యలో బీఆర్ అంబేద్కర్ వర్సిటీ ద్వారా తెలంగాణ గుర్తింపు పొందింది. ఆ తర్వాత ఓపెన్ స్కూళ్లు, ఆన్‌లైన్ విద్య, టాస్, ఇగ్నో, ఎన్ఐఓఎస్ వంటివి ఏర్పడ్డాయి. 2020 జాతీయ విద్యావిధానం ఇందుకు బలమైన పునాదిని అందించింది. డిజిటల్, ఏఐ పవర్‌హౌస్‌గా రాష్ట్రం ఆన్‌లైన్ విద్యను వ్యూహాత్మక శక్తిగా, ప్రధాన స్రవంతి విద్యలో భాగంగా ఉపయోగించుకోవాలి. అదేవిధంగా, పాఠ్యాంశాలపరంగా సంస్కరణల్ని తీసుకు రావాలి.

**మిగిలిన సిఫార్సులు**

పాలన:

- తెలంగాణలో 29 రకాల స్కూళ్లు ఉన్నాయి. గౌరవప్రదమైన, విద్యార్థి పూర్తి సామర్థ్యం వెలికితీసే రీతిలో, గ్రామీణ-పట్టణ అంతరంలేని బోధనను అందించే కామన్ స్కూల్ విధానం అమలు చేయాలి.
- విద్యాసంస్థల విస్తరణకు తగిన భూమిని ప్రభుత్వం సమకూర్చాలి.
- ఈ సంస్కరణల అమలుకు సమయం పడుతుంది కాబట్టి.. అధికారులు నిలకడగా పనిచేయటం అవసరం. అందువల్ల నియామకాలను కనీసం 5 ఏళ్లపాటు కొనసాగించాలి.
- డిజిటలీకరణతో అసమర్థ విధానాలను నియంత్రించాలి.
- ప్రభుత్వంలోని అన్ని విభాగాల నుండి విద్యకు సంబంధించి సేకరించిన సమాచారాన్ని పౌరులు అర్థం చేసుకోగలిగే రీతిలో వెబ్‌సైట్‌లో (పబ్లిక్ డొమైన్) ఉంచాలి.

**(మిగతా 19వ పేజీలో..)**

# ఒక్క తరం కాలంలో ఈజిప్ట్ కాస్తా ఫిన్లాండ్ అయ్యింది..

## టీచర్ల టూర్: సింగపూర్, ఫిన్లాండ్ విద్యానమూనా తెలుగు రాష్ట్రాలకు ఎంత అనుసరణీయం?

***'ఒక్క తరం కాలంలో ఈజిప్ట్ కాస్తా ఫిన్లాండ్ అయ్యింది' అని నాణ్యమైన విద్య ప్రాధాన్యతను గురించి చెబుతూ ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్.డి.ఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ తరచూ చెబుతుంటారు.***



తెలుగు రాష్ట్రాల్లో, దేశంలో పాఠశాల విద్యను బాగు చేయటానికి కొన్ని ఆచరణసాధ్య పరిష్కారాలు, సాంకేతికత ద్వారా విస్తృతస్థాయి కృషి చేస్తున్నారు. సుమారు 25 కోట్ల మంది పిల్లలు ఈవేళ భారతదేశ స్కూళ్లలో ఉన్నారు. దేశ సుస్థిర ఆర్థికాభివృద్ధి కోసం వారికి నాణ్యమైన చదువు అబ్బటం ఎంతో కీలకం. సరైన విద్య అంటే ఏమిటో తెలియకపోయినా, విద్యకి సమాజంలో విపరీతమైన డిమాండ్ ఉండటం, ప్రభుత్వం ఇప్పుడు చేస్తున్న ఖర్చు కంటే అదనంగా వెచ్చించాల్సిన అవసరం లేకపోవటంతో.. మనకు సంకల్పం ఉండాలేగానీ, సులభంగా విద్యా వ్యవస్థలో మార్పులు తేవచ్చని జేపీ పేర్కొంటారు. జూన్‌లో విద్యా సంవత్సరం ప్రారంభమయ్యేలోగా తెలంగాణ నూతన విద్యా విధానాన్ని ప్రకటించాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. విద్యలో ప్రపంచ దేశాల అనుభవాలను తెలుసుకోవాలనే ఉద్దేశంతో ఇటీవల కొందరు ఉపాధ్యాయులు, అధికారులను ప్రభుత్వం ఫిన్లాండ్ దేశానికి పంపింది. ఫిన్లాండ్ విశ్వ విద్యాలయాలను అధ్యయనం చేయటానికి తెలంగాణ వర్సిటీల ఆచార్యులను కూడా విదేశీ పర్యటనకు పంపుతున్నారు. ఈజిప్ట్, ఫిన్లాండ్ నేపథ్యంలో కొంత తేడా వున్నా.. ఒకప్పుడు చాలావరకు ఒకే నమూనాలో, స్థాయిలో ఉండేవి. ఇప్పుడు ఈజిప్ట్ ఇంకా వెనుకబడిపోగా, ఫిన్లాండ్..విద్య, ఆనందం, పరిపాలన, పరిశోధన-ఆవిష్కరణల్లో ప్రపంచస్థాయిలో ఉంది. ఒక తరంలో, అంటే ఇరవయ్యో శతాబ్ద మార్పుల వేగాన్ని అనుసరించి..ఓ ముప్పై యేళ్ల కాలంలో ఈ మార్పుని ఫిన్లాండ్ సాధించటంలో విద్యా వ్యవస్థను పాలనకు, రాజకీయానికి కేంద్రబిందువు చేయటం ప్రధాన పాత్ర వహించింది.

ఫిన్లాండ్, ఈజిప్ట్ రెండూ వ్యవసాయాధారిత ఆర్థిక వ్యవస్థలుగా ఉండేవి. సోవియెట్ యూనియన్‌తో సరిహద్దు పున్న ఫిన్లాండ్.. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో ఆ కమ్యూనిస్టు దేశంతో, ఆ తర్వాత జర్మనీతో తలపడి దారుణంగా దెబ్బతింది. ఇప్పుడు ఉక్రెయిన్ తరహాలో ఫిన్లాండ్‌లోని విలువైన భూభాగమున్న రాష్ట్రాన్ని ఆక్రమించటంతోపాటు.. యుద్ధ నష్టపరిహారం కింద భారీ పరిహారానికి సోవియెట్ యూనియన్ డిమాండ్ చేసింది. యుద్ధం ముగిశాక రష్యాకి పరిహారం చెల్లించే క్రమంలో ఫిన్లాండ్ తయారీ రంగ పరిశ్రమలను భారీగా అభివృద్ధి చేసింది. ఇలా ఓ ఆపద్ధర్మ అవసరంగా మొదలుపెట్టిన అభివృద్ధి ఫిన్లాండ్ ఆర్థిక వ్యవస్థను గణనీయంగా పెంచింది. దీనికి కొనసాగింపుగా ఆధునిక ఆర్థిక వ్యవస్థను అందుకునేందుకు 1970లలో ప్రపంచ సుప్రసిద్ధ విద్యా విధానాన్ని ఆ దేశం తీసుకొచ్చింది. ప్రచ్ఛన్న యుద్ధ కాలంలో సోవియెట్‌తో ఉద్రిక్తతలు లేకుండా లౌక్యంగా వ్యవహరిస్తూ అక్కడి మార్కెట్ అవకాశాలను సద్వినియోగం గావించుకుంది. ఇంటర్నెట్ ఆధారిత సాంకేతిక ఆర్థిక వ్యవస్థను బహుముఖంగా అందిపుచ్చుకుంది. దీంతో, మూడు దశాబ్దాల కాలంలో ఫిన్లాండ్.. ప్రపంచంలోనే అన్ని రకాలుగా విజయం సాధించిన ప్రజాస్వామ్య దేశంగా గుర్తింపు పొందింది.

ఫిన్లాండ్ వెళ్లి వచ్చిన తెలంగాణ టీచర్లు ఏం చెబుతున్నారు, ఆ విధానాలు మన రాష్ట్రంలో, దేశంలో అమలు చేయటం సాధ్యమా? పరిశీలిద్దాం.

తెలంగాణలోని వివిధ పాఠశాలలకు చెందిన 28 మంది టీచర్లు, 12 మంది అధ్యాపకులు, కొందరు అధికారులు ఫిన్లాండ్ పర్యటనకు వెళ్లారు. వారందరి అభిప్రాయాలను క్రోడీకరిస్తే.. అక్కడ ఉపాధ్యాయులు ప్రధానంగా ఫలితాలకు బాధ్యత తీసుకుంటారు. అందువల్లే టీచర్ రిక్రూట్‌మెంట్ పరీక్షలకు అక్కడ అంత ప్రాధాన్యత ఉంటుంది. తెలుగునాట తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్‌గా జేపీ తనను చేసిన ఇంటర్వ్యూ ఎంత సమగ్రమైనదో, ఎంత శ్రద్ధగా, ఏ ప్రశ్నలు అడిగారో ఒక టీచర్

రిటైర్‌మెంట్ తర్వాత పొల్లుపోకుండా చెప్పటం ఆశ్చర్యం కలిగించింది. ఫిన్లాండ్‌లో స్కూలు టీచర్లకు పోస్ట్ గ్రాడ్యుయేషన్ అర్హత, ఎంపికలో జాగ్రత్తలతోపాటు.. శిక్షణ కూడా సమగ్రంగా ఉంటుంది. ప్రతి పాఠశాలలో పాఠ్యపుస్తకాలను కూడా అక్కడి ఉపాధ్యాయులే తయారుచేస్తారు. జాతీయస్థాయిలో ఒక నమూనాను, మార్గదర్శకాలను మాత్రం ప్రభుత్వం వెలువరిస్తుంది. ఆ పరిధిలోపల ప్రతి పాఠశాలా తమకు మెరుగైనవి అనుకున్న పాఠ్యాంశాలను రూపొందించు కోవచ్చు. పిల్లల్లో తెలివితక్కువవారు ఉంటారని ఏ టీచరూ అక్కడ భావించరు. ఎవరు ఏ సబ్జెక్ట్‌లో, ఏ రంగంలో ఎక్కువ ప్రతిభను ప్రదర్శించగలరో, ఆ విభాగంలో చదువుకునే అవకాశం కల్పిస్తారు. అదేవిధంగా టీచర్లు కూడా తమకు నచ్చిన సబ్జెక్ట్‌లో బోధనని ఎంచుకోవచ్చు. విద్యార్థులకు నాణ్యమైన చదువు రావటమే లక్ష్యంగా ఫిన్లాండ్‌లో విద్యావ్యవస్థ ప్రక్రియను రూపొందించారు.

⏭ ప్రపంచస్థాయి ప్రమాణాల పాఠశాల విద్య ఉచితం.

⏭ ఇంట్లో మాట్లాడుకునే భాషలోనే చదువు ప్రారంభిస్తారు. ఒత్తిడి లేకుండా అప్రమత్తంగా ఉంటారు.

⏭ విద్యాప్రణాళికను ప్రతి సంవత్సరం ప్రతి స్కూలూ మార్చుకోవచ్చు.

⏭ పాఠశాల స్థాయిలోనే ముగ్గురు, నలుగురు విద్యార్థులకు కలిపి ప్రాజెక్టులు ఇస్తారు. ఫలితాలను సాధించే బృందాలుగా పనిచేయటం నేర్పిస్తారు.

⏭ ఉపాధ్యాయులు పిల్లలకు బోధించటం వరకే పరిమితమవరు. తాము పరిశోధనలు, ఆవిష్కరణలు చేస్తుంటారు.

⏭ అనుభవపూర్వక అభ్యసన ప్రక్రియకు ఎక్కువ ప్రాధాన్యతనిస్తారు.

⏭ పఠనా నైపుణ్యాలు పెంచేందుకు తరగతి గదులు, గ్రంథాలయాల్లోనే కాకుండా.. డైనింగ్ హాల్ తదితర చోట్ల కూడా పుస్తకాలను అందుబాటులో ఉంచుతారు. అన్నట్లు, ఉదయం అల్పాహారం నుండి భోజనం, స్నాక్స్ వంటి వన్నీ పౌష్టిక విలువలతో ఉచితం.

⏭ డ్రాపౌట్లు అరుదు. విద్యార్థులు గైర్హాజరు అతి తక్కువ.

⏭ విద్యాసంవత్సరంలో పాఠశాల 180 రోజులు పనిచేస్తుంది. టీచర్లకు 190 రోజులు. అనారోగ్యం వస్తే అయిదు రోజులు సెలవు తీసుకోవచ్చు. అంతకంటే ఎక్కువయితే, వేతనంలో కోత.

⏭ తొమ్మిదవ తరగతి వరకూ పరీక్షలు కాని పరీక్షలు ఉంటాయి. విద్యార్థి ఏ మేరకు నేర్చుకున్నదనేది ఒత్తిడి లేకుండా పరీక్షిస్తారు. పదవ తరగతి పరీక్ష కూడా అదే రీతిలో అభ్యసన ఫలితాలను సౌకర్యవంతంగా బేరీజు వేసేలా నిర్వహిస్తారు.

⏭ నచ్చిన సబ్జెక్ట్ చదవితే క్రెడిట్లు ఉంటాయి.

⏭ పిల్లలకు బోధన ఎలా ఉండాలో స్థానిక ప్రభుత్వాలు నిర్ణయిస్తాయి. అక్కడ స్థానిక పాలన చాలా బలంగా తగినన్ని నిధులు, అధికారాలతో ఉంటుంది. పూర్తి వికేంద్రీకరణతో విద్యార్థి కేంద్రంగా, ఉపాధ్యాయురాలు బాధ్యత తీసుకుంటూ, స్థానిక వ్యవస్థ పర్యవేక్షణలో పాఠశాల విద్య సాగుతుంది.

⏭ ఈ రకమైన జవాబుదారీతనంతో కూడిన ఏర్పాటు వల్ల తల్లిదండ్రులకు ఉపాధ్యాయుల మీద అపారమైన నమ్మకం ఉంటుంది. తొమ్మిది నెలల పిల్లల్ని కూడా టీచర్ వద్ద వదిలేస్తారంటే, ప్రీ స్కూల్ నుండి విద్యావ్యవస్థ ఎంత బలంగా ఉందో అర్థమవుతుంది.

⏭ ఫిన్లాండ్ సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులు ఇంటర్న్‌షిప్‌లో భాగంగా బిల్డర్లతో కలిసి ప్రభుత్వ స్థలంలో ఇళ్ల నిర్మాణం చేయటాన్ని వారు గమనించారు. పనిని ప్రత్యక్షంగా నేర్చుకునేందుకు అక్కడి విద్యావ్యవస్థ అన్ని స్థాయిల్లో ప్రాధాన్యతనివ్వటంతోపాటు, బాధ్యతల విభజన సక్రమంగా, సమర్థవంతంగా ఫలితాల ప్రాతిపదికన జవాబుదారీతనంతో కేటాయించారు.

⏭ బాల్యం నుండి పుస్తకాలు చదవటాన్ని ప్రోత్సహిస్తారు. పిల్లలతో కలిసి పెద్దలూ లైబ్రరీలకు వెళ్తుంటారు. 'నువ్వు ఫలానా తప్పు చేశావు' అంటూ పిల్లల్ని టీచర్లు నిందించరు.

అంతా బాగానే ఉంది. కానీ ఫిన్లాండ్ విద్యావ్యవస్థను తెలంగాణలో అమలు చేయటం సాధ్యమా?.. అంటే ఇప్పటికిప్పుడు ఆచరణసాధ్యంకాదనే చెప్పాలి. అయితే కొన్ని అంశాలను నేర్చుకోవటం ద్వారా, వారి కంటే ఎక్కువ కష్టపడటం ద్వారా మనల్ని మెరుగుపరుచుకోవచ్చు. ముఖ్యం గా, టీచర్లను జవాబుదారీ చేయటం, పరీక్షల పద్ధతుల్ని, కొన్ని పాలన, ప్రజాస్వామ్య విధానాలను సంస్కరించు కోవటం ద్వారా, ఫిన్లాండ్ తలసరి ఆదాయం 50,000 డాలర్లకు పైగా ఉంటే, మన తలసరి ఆదాయం 2,850 డాలర్ల దాకా ఉంది. అదేవిధంగా, 'మన టీచర్లకు మార్కెట్‌లో కంటే జీతాలు ఎక్కువగా ఉన్నాయి. పైగా, ఫిన్లాండ్ జనాభా 5.6 మిలియన్లే. వారు పారిశ్రామిక తయారీ రంగం నుండి సేవారంగంలోకి వెళ్లారు. మనం తయారీ రంగాన్ని విస్మరించి వ్యవసాయం మీద ఆధార పడినవారిని ఇప్పటికీ 40-50 శాతం దాకా కొనసాగిస్తున్నాం. అప్పట్లో వస్తూత్పత్తికి ఉన్న డిమాండ్ ఇప్పుడు ఉంటుందన్న గ్యారంటీ లేకున్నా.. మన జనాభా రీత్యా ఉపాధి అవకాశాలకు ఆ రంగాన్ని కొనసాగించాలి. ఆ రకమైన వైవిధ్యం భౌగోళికంగా, స్వదేశీ మార్కెట్ పరంగా కూడా మనకు ఉంది. ఈ నేపథ్యంలో.. ఒకప్పుడు ఫిన్లాండ్ ఎదిగినరీతిలో మనమూ సంకల్పంతో సర్వశక్తులనూ కేంద్రీకరిస్తే, యథాతథ నమూనాలో కాకున్నా – కచ్చితంగా మనదైన ప్రత్యేకతతో మంచి ప్రమాణాల విద్యను ప్రతి బిడ్డకూ అందించగలం. మనకు ఫిన్లాండ్‌కు లేని గొప్ప జ్ఞాన సంస్కృతి, ఈవేళ ప్రపంచమంతటికీ సమానంగా అందుబాటులో ఉన్న అద్భుత సాంకేతికతలు ఉన్నాయి. మన పిల్లలు, సమాజం ఎంతో కష్టపడతారు. మనకు తగినంతమంది ఉపాధ్యాయులు ఉన్నారు. జనాభా పెరుగుదల రేటు క్రమంగా నియంత్రణలోకి వస్తోంది. కాబట్టి.. ఫిన్లాండ్ నుండి అనుసరించదగిన అంశాలను కొంతమేరకు ఉపయోగించుకోవచ్చు. అదనపు నిధులు, ఫిన్లాండ్ స్థాయిలో వనరుల కేటాయింపు లేకుండానే, సాంకేతికతను గరిష్టంగా వినియోగించుకుంటూ.. హైబ్రిడ్

నమూనాలో ప్రతి బిడ్డకూ నాణ్యమైన విద్యను అందించవచ్చు. ఆర్ అండ్ డీకి గణనీయ నిధుల కేటాయింపు, ప్రతి రూపాయినీ సద్వినియోగం గావించుకోవటం ద్వారా మన దేశ పరిస్థితుల్లోనూ ఫిన్లాండ్ స్థాయి విద్యా ఫలితాలను సాధించవచ్చు.

**ఫిన్లాండ్, సింగపూర్‌లలో**
**ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయుల అధ్యయనం**

అదేవిధంగా, ఆంధ్రప్రదేశ్ కూడా 37 మంది ఉపాధ్యాయులను ఫిన్లాండ్ విద్యారంగం అధ్యయనానికి పంపింది. కానీ ఈ ఏడాది పదో తరగతి ఫలితాలను, 590కి మంచి మార్కులు వచ్చినవారి సంఖ్య ఎక్కువగా ఉండటాన్ని ఘనవిజయంగానూ, టీచర్ల పనితీరుకి ప్రమాణంగానూ భావిస్తుండటం చూస్తే.. ఫిన్లాండ్ నుండి నేర్చుకున్నారని అనుకోలేం. ఫిన్లాండ్ విద్య దీర్ఘకాలంలో ప్రతి పౌరురాలూ స్వావలంబనతో, జటిల సమస్యలను కూడా అవగాహన, సహనంతో పరిష్కరించుకునే పరిణతిని ప్రదర్శించే విధంగా ఉంటుంది. సింగపూర్ విద్యావిధానం అధ్యయనం చేయటానికీ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన 37 మంది టీచర్లను ఏపీ ప్రభుత్వం పంపింది. ఆగస్టులో మరో 31 మంది రాష్ట్రంలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలను ఫిన్లాండ్ పంపుతున్నారు.

**సింగపూర్ వెళ్లొచ్చిన ఏపీ ఉపాధ్యాయులు ఏం చెబుతున్నారు?**

⏭ ఉపాధ్యాయులకు పటిష్ఠ శిక్షణ, ఒత్తిడిలేని తరగతులు, క్రిటికల్ థింకింగ్, డిజిటల్ అక్షరాస్యత.. సింగపూర్ పాఠశాల విద్యావ్యవస్థ బలాలు. ఆ దేశంలో ప్రతి ఒక్కరూ ప్రభుత్వ బడుల్లోనే చదవాలి. ప్రయివేటు స్కూళ్లలో చేరి చదువుకోవాలనుకుంటే.. విద్యావ్యవస్థ ప్రభుత్వ బాధ్యత కాబట్టి, ముందుగా విద్యాశాఖకు సమాచారమివ్వాలి.

⏭ మాతృభాషను ఒక సబ్జెక్ట్‌గా బోధిస్తారు.

⏭ సైన్యం, వైద్యం తర్వాత ఉపాధ్యాయవృత్తికి అధిక ప్రాధాన్యం ఇస్తారు. నియామక ప్రక్రియ పకడ్బందీగా ఉంటుంది. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా టీచర్లకు ఎప్పటికప్పుడు శిక్షణ ఇస్తారు. దీనివల్ల పాఠాలు చెప్పటంలో నాణ్యత పెరుగుతుంది.

⏭ సీనియారిటీ ఆధారంగా కాకుండా, పనితీరు ప్రాతిపదికన గ్రేడింగ్, ప్రమోషన్లు ఉపాధ్యాయులకు ఉంటాయి. పదోన్నతి పొందాక కూడా ఆరు నెలల శిక్షణ తీసుకోవాలి. ప్రమోషన్‌తో సంబంధం లేకుండా.. ప్రతి ఉపాధ్యాయుడూ ఏడాదికి 100 గంటలు తప్పనిసరిగా శిక్షణ పొందాలి.

⏭ ఉపాధ్యాయులు కేవలం ఫెసిలిటేటర్లుగా ఉంటారు. విద్యార్థులకు తెలిసిన విషయాల నుండి, తెలియని, కొత్త విషయాలను నేర్పిస్తారు.

⏭ పిల్లలకు మార్కులు ఉండవు. గ్రేడ్‌లు ఇస్తారు. వెనుకబడిన పిల్లలను వదిలేయకుండా.. ఏ సబ్జెక్ట్‌లో ఇబ్బంది పడుతున్నారో, ఆ పాఠ్యాంశాల కాన్సెప్ట్‌లను అర్థమయ్యేదాకా బోధిస్తారు.

⏭ ప్రతి ఒక్కరి వద్దా ల్యాప్‌టాప్ ఉంటుంది. పిల్లలే పీపీటీలు చేసి, తరగతిలో ప్రజంటేషన్ ఇస్తారు. ఇంటి దగ్గరా అభ్యసనం కొనసాగుతుంది.

⏭ 6-12 ఏళ్ల మధ్య ప్రాథమిక విద్య ఉంటుంది. తర్వాత పరీక్ష నిర్వహించి, గ్రేడ్ల ఆధారంగా సెకండరీ విద్యకు ప్రమోట్ చేస్తారు.

⏭ పిల్లలకు పరీక్షలు ఒత్తిడి లేకుండా నిర్వహిస్తారు. ప్రతి టర్మ్ తర్వాత పది రోజులు సెలవలు ఇస్తారు. టర్మ్‌లో ఏ పాఠం ఎప్పుడైనా చెప్పవచ్చు.

⏭ పిల్లల మెదడు వికసించే వయసులోని ప్రీస్కూల్ విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తారు. ఇక్కడ నాణ్యమైన విద్య పైతరగతుల్లో విద్యాప్రమాణాలకు నాందిగా భావిస్తారు.

**సింగపూర్, ఫిన్లాండ్ నమూనాల నుండి..**

ఆసియాలో సింగపూర్, దక్షిణ కొరియా, జపాన్ విద్య విలువను అర్థం చేసుకుని ఆర్థిక ఫలితాలను సాధించిన దేశాలు. అయితే ఫిన్లాండ్ నమూనా వికేంద్రీకృతమైనదికాగా, సింగపూర్ నమూనా కేంద్రీకృతమైనది.

సింగపూర్ స్వాతంత్ర్యం పొందేనాటికి వనరులపరంగా తీవ్ర కొరతను ఎదుర్కొంటోంది. ఈ నేపథ్యంలో నాణ్యమైన, సాంకేతికత విద్యనే ఆ దేశం సామాజిక, ఆర్థిక ఆయుధంగా ఉపయోగించుకుంది. ఇక్కడ కూడా ఫిన్లాండ్ తరహాలోనే నాణ్యమైన బోధన ఉన్నా.. ఉపాధ్యాయుల మీదే పూర్తి బాధ్యత వదిలేయకుండా, కేంద్రీకృత పర్యవేక్షణ కఠినంగా ఉంటుంది. బడులు ఎప్పటికప్పుడు మార్కెట్‌కు తగ్గ ఫలితాలను కనబరుస్తుండాలి. పాఠ్యాంశాలనూ పైనుంచే నిర్ణయిస్తారుగానీ, ఎప్పటికప్పుడు తాజాపరుస్తుంటారు. కాబట్టి, వేగంగా ఫలితాలకు సింగపూర్ నమూనా ఎక్కువ ప్రయోజనకరం.

తెలుగు రాష్ట్రాలు సమయాభావం రీత్యా ముందు ఆసియాలోని సింగపూర్ నమూనాను అనుసరించి విద్యారంగాన్ని సంస్థాగతంగా పటిష్ఠం చేయటం అవసరం. సింగపూర్ తరహాలో బోధనా ప్రమాణాలు, అభ్యసన సామర్థ్యాలను ఎప్పటికప్పుడు ఒత్తిడి లేకుండా పరీక్షించటం, ఆధునిక సాంకేతికతల్ని ఎప్పటికప్పుడు పాఠ్యాంశాల్లో భాగం చేయటం, మార్కెట్ అవసరాలతో బోధనను అనుసంధానించటానికి వృత్తి విద్యను భాగం చేయటం, ఇన్‌స్పెక్షన్లు, ఉపాధ్యాయులలో జవాబుదారీతనం.. మొదలైన అంశాలపరంగా ఇప్పటికే ఉన్న వనరుల్ని పూర్తిగా బలోపేతం చేయాలి. మార్కులు, ర్యాంకులకే కాకుండా.. అభ్యసన సామర్థ్యాలను, సృజనాత్మకతను పరీక్షించేలా; ఒత్తిడి, బట్టీ, కాపీ అవకాశాలు లేకుండా పరీక్షా పత్రాలను జిగ్‌జాగ్‌గా రూపొందించాలి. సింగపూర్ నమూనా వల్ల మన వనరులు, మార్కెట్ సామర్థ్యంతోనే ప్రపంచస్థాయి ప్రమాణాలను పరిజ్ఞానం, ఉపాధి, ఆర్థికాభివృద్ధిలో అందుకోగలం. ఓ పదేళ్ల వ్యవధి తర్వాత పుట్టుకతో వివక్ష లేకుండా సమానావకాశాలు, సామాజిక సామరస్యత, నైపుణ్యాలతో ఉద్యోగార్హతా సామర్థ్యం, తలసరి ఆదాయం మధ్య అంతరాలు తగ్గటం, మానవ వనరుల సూచీ వంటి వాటిల్లో గరిష్ట ఫలితాలనిచ్చే ఫిన్లాండ్ నమూనాను సైతం అనుసరించవచ్చు.

ఈ రకంగా, సింగపూర్, ఫిన్లాండ్ సహా అన్ని దేశాల పరిస్థితులనూ పరిగణలోకి తీసుకొని భారతదేశంలో ప్రాంతాలవారీ పరిస్థితులను బేరీజు వేసి ఎఫ్.డి.ఆర్, లోక్‌సత్తా

బృందంతో జేపీ రూపొందించి, తెలంగాణ ప్రభుత్వానికి అందించిన విద్యావిధానాన్ని అనుసరించటం మేలు. తాత్సారంలేకుండా వెంటనే అమలు ప్రారంభిస్తే, 30 ఏళ్ల కాలవ్యవధిలో మన దేశం కూడా ఫిన్లాండ్‌తో సమానమైన, అదే సమయంలో అంతకంటే అంతర్జాతీయంగా ప్రభావశీల శక్తిగా రూపొందగలుగుతుంది. ❖

## స్కూలు విద్యలో పెరుగుతున్న తల్లిదండ్రుల జేబు వ్యయం.. జాతీయ సగటు కంటే తెలంగాణ, ఏపీల్లో ఎక్కువ

తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వాలు ఒక్కో సర్కారీ స్కూలు విద్యార్థి మీదా రూ.1,30,000 వరకు ఖర్చు చేస్తున్నాయి. ఇది ప్రజల పన్నుల డబ్బే. ప్రతి బిడ్డకీ నాణ్యమైన విద్యను, తద్వారా ఎదిగే అవకాశాలను సమానంగా అందించటం ప్రభుత్వ బాధ్యత కాబట్టి.. ఈ డబ్బు ఖర్చుకి ఎవరికీ అభ్యంతరం లేదు. కానీ నూటికి 80 మంది పిల్లలకు కనీస ప్రమాణాల చదువు రావటం లేదు. 8వ తరగతి పిల్లలు 2వ తరగతి పాఠం చదవలేక పోతున్నారు. కొన్ని పాఠాలు 1వ తరగతిలోకి రెండో తరగతిలో కంటే కష్టంగా ఉన్నాయట. ప్రయివేటు బడులు కొంత మెరుగు, వాటిల్లో కొన్ని మాత్రమే నిజంగా పనికొచ్చే చదువును అందించేవి. ఈ పరిస్థితుల్లో పాఠశాల విద్య కోసం ప్రభుత్వం చేస్తున్న ఖర్చుతో పాటు..ఒక్కో విద్యార్థిపై వారి తల్లిదండ్రులు చేస్తున్న వ్యయం జాతీయ సరాసరి కంటే ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో ఎక్కువగా ఉంది. జాతీయ సరాసరి రూ.13,051 ఉండగా.. ఏపీలో ఒక్కో విద్యార్థిపై సగటున రూ.19, 344; తెలంగాణలో 21,652. ఇందులో ఎక్కువగా బాలికలను పంపే ప్రభుత్వ పాఠశాలల్లో చేస్తున్న వ్యయం కూడా ఉంది.

ఆంధ్రప్రదేశ్ గ్రామీణ ప్రాంతాల్లో చదివించేందుకు ఒక్కొక్కరిపై రూ.14,942 అవుతుండగా.. పట్టణాల్లో రూ.26,784 ఖర్చు చేస్తున్నారు. తెలంగాణలో గ్రామీణ ప్రాంతాల్లో రూ.14,802; పట్టణ ప్రాంతాల్లో రూ.31,633 సొంతంగా వ్యయం చేస్తు న్నారు. జాతీయస్థాయిలో ఈ గణాంకాలు.. రూ.8725, రూ.23,898గా ఉన్నాయి. యూనియన్ గణాంకాలు, కార్య క్రమాల అమలు మంత్రిత్వ శాఖ ఇటీవల విడుదల చేసిన 'భారతదేశంలో మహిళలు, పురుషులు 2025' నివేదికలో విద్యపై చేస్తున్న వ్యయ వివరాలను వెల్లడించింది. గతేడాది సెప్టెంబర్‌లో విడుదల చేసిన 'చిల్డ్రన్ ఇన్ ఇండియా' నివేదిక ప్రకారం ఏపీలో ఒక్కో విద్యార్థిపై చేస్తున్న వ్యయం రూ.18, 479 ఉండగా.. తాజా నివేదికలో రూ.865 పెరిగింది. ఏపీలో ఖర్చు చేస్తున్నదాంట్లో కోర్సు ఫీజుతోపాటు..రవాణా, యూని ఫామ్, పుస్తకాల కోసం ఎక్కువగా ఖర్చు చేయాల్సి వస్తోంది.

**దక్షిణాదిలో అధికం**

దక్షిణ భారతదేశంలో పాఠశాల విద్యకు చేస్తున్న వ్యయంలో ఏపీ మూడో స్థానంలో ఉంది. తమిళనాడులో ఒక్కో విద్యార్థిపై రూ.22,338 ఖర్చు చేస్తుండగా.. ఆ తర్వాతి స్థానాల్లో తెలం గాణ, ఏపీ నిలిచాయి. సరిహద్దు రాష్ట్రం ఒడిశాలో అతి తక్కువగా ఒక్కొక్కరిపై రూ.7,838 మాత్రమే ఖర్చు చేస్తున్నారు. అన్ని దక్షిణాది రాష్ట్రాల్లోనూ విద్యపై చేస్తున్న వ్యయం జాతీయ సరాసరి కంటే అధికంగా ఉంది. రాష్ట్రంలో బాలికల కంటే బాలురపై చేస్తున్న వ్యయం ఎక్కువగా ఉంటోంది. బాలురను ఎక్కువగా ప్రయివేటు బడులకు, బాలికలను ప్రభుత్వ బడులకు పంపిస్తున్నారు. దీంతో బాలురపై చేసే వ్యయం ఎక్కువగా ఉంటోంది.

**తెలంగాణలో..**

+ తెలంగాణలో ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రయివేటులో కలిపి సుమారు 66.38 లక్షల మంది పిల్లలు పాఠశాల విద్యలో ఉన్నారు. వీరిలో ప్రభుత్వ బడుల్లో కేవలం 19 లక్షల మంది చదువుతున్నట్లు అంచనా. ప్రతి సంవత్సరం ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థుల చేరికలు తగ్గుతున్నాయి.

+ 35-38 లక్షల మంది పిల్లలు తెలంగాణ ప్రయివేటు బడుల్లో చదువుతుండగా, వారిలో బాలుర సంఖ్య యాభై శాతానికి పైగా ఉంది. బాలికల కంటే బాలుర విద్య మీదే తల్లిదండ్రులు ఎక్కువ వెచ్చిస్తున్నట్లు గణాంకాలు తెలియచేస్తున్నాయి.

**ఏపీలో..**

✦ 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి విద్యార్థుల ప్రవేశాలు పరిశీలిస్తే ప్రయివేటులోనే ఎక్కువమంది పిల్లలు ఉన్నారు. ప్రభుత్వ బడుల్లో 32.82 లక్షలు ఉండగా.. ప్రయివేటులో 35.41 లక్షల మంది పిల్లలు చదువుతున్నారు.

✦ 2025-26లో ప్రయివేటు బడుల్లో బాలురు 19,81,860 ఉండగా.. బాలికలు 15,59,191 మంది ఉన్నారు. ఈ గణాంకాలను పరిశీలించినా.. బాలికల కంటే బాలురపై చేస్తున్న వ్యయం అధికంగానే కనిపిస్తోంది.

✦ చాలా ప్రయివేటు పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక విద్యకే ఎక్కువ ఖర్చవుతోంది. కొన్ని సీబీఎస్ఈ గుర్తింపు ఉన్న విద్యాసంస్థలు రూ.35వేల నుండి రూ.50వేలకు పైగా డొనేషన్లు వసూలు చేస్తున్నాయి. ఇవికాక ఫీజులు అదనంగా ఉంటున్నాయి. పాఠ్యపుస్తకాలను ఆయా విద్యాసంస్థల్లోనే కొనుగోలు చేయాలనే నిబంధనతోనూ అధికంగా వసూలు చేస్తున్నాయి. ఏకరూప దుస్తుల నుండి బూట్ల వరకు అన్నీ విద్యాసంస్థలే సమకూరుస్తున్నాయి.

✦ పాఠశాలల పునఃప్రారంభంలో రూ.కోట్లలో విద్యాసంస్థలు వ్యాపారం చేస్తున్నాయి. తల్లిదండ్రుల్లోనూ చదువుపై అవగాహన పెరగటంతో పిల్లల చదువుకు ప్రాధాన్యం ఇస్తున్నారు. దీంతో విద్యపై చేసే ఖర్చు క్రమంగా పెరిగిపోతోంది.

❖

# విద్యాప్రమాణాల బాధ్యత టీచర్‌దే

**– చుక్కా రామయ్య**

ప్రపంచంలో చాలా దేశాలు నేడు ఫిన్లాండ్ వైపు చూస్తున్నాయి. అక్కడి ప్రగతి రహస్యం ఆ దేశ ప్రజల్లోనే ఉంది. పిల్లలు, ఉపాధ్యాయుల్లోనే ఆ రహస్యం దాగి ఉన్నది. ఉపాధ్యాయులకు ఆ వృత్తిపైన అంకితభావం, ఉపాధ్యాయుణ్ణి ఎంపిక చేసే పద్ధతి, ఉపాధ్యాయ వృత్తికిచ్చిన గౌరవం, సామాజిక స్థాయి ఇవే ఫిన్లాండ్ ప్రగతికి కారణాలు. దీనికితోడు ఆ దేశంలో ఉండే సంప్రదాయాలు, ఆచారాలు కూడా తోడ్పడనాయి. వధూవరులు ఇద్దరూ అక్షరాస్యులైతేనే వివాహానికి అర్హులు. ఆ దేశంలో చదువు కూడా గృహస్తులు కావటానికి ఒక నిబంధన. ఆ దేశంలో ఉపాధ్యాయులపై అపారమైన నమ్మకం ఉంటుం ది. శిక్షణ ఆ రీతిలో ఉంటుంది. ఈ నేపథ్యంలో, ఉపాధ్యా యులపై ఎటువంటి ఒత్తిడీ ఉండదు. వృత్తిపరమైన స్వతంత్రత ఉంటుంది. ఉపాధ్యాయులు తాము పనిచేసే స్కూళ్లకు సంబంధించిన 'కరిక్యులమ్'ను నిర్ణయిస్తారు. అన్ని స్కూళ్లకు ప్రభుత్వమే నిధులను అందజేస్తుంది. ఆ దేశంలోని మీడియా ప్రతి ఏడాది ఒక పోల్‌ను నిర్వహిస్తుంది. మీకు ఇష్టమైన వృత్తి ఏది? అని వృత్తిపరమైన పోల్ నిర్వహిస్తే ఉపాధ్యాయ వృత్తిపైనే ఆ దేశ ప్రజలు తమ ఇష్టాన్ని వ్యక్తం చేస్తారు. ఎలాంటి భార్య కావాలంటే ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న వారిపైనే యువకులు మొగ్గు చూపు తారు. ఎలాంటి భర్త కావాలంటే.. డాక్టరన్నా, టీచర్ అన్నా కావాలని మహిళలు చెబుతారు. ఆ దేశంలో ఉపాధ్యాయ వృత్తిని ఎందుకు కోరుకుంటున్నారని ఎవరిని అడిగినా– 'మా రక్తంలోనే ఉపాధ్యాయ వృత్తిపై ప్రేమ, గౌరవం ఉన్నాయి. మా ముందు తరాల వారంతా ఉపాధ్యాయ వృత్తి వారే..' అని చెబుతారు. దాన్నే 'పెడగాజికల్ లవ్' అంటారు. బోధనపై ప్రేమే దానికి కారణం. అక్కడ ఉపాధ్యాయుల ఎంపిక చాలా పకడ్బందీగా జరుగుతుంది. అది రెండు దశలలో ఉంటుంది. ఏటా మే మాసంలోగా 8 విశ్వవిద్యాలయాలు కలిసి ఉపాధ్యాయ అభ్యర్థులకు పరీక్షలు నిర్వహిస్తాయి. ఈ పరీక్షకు సిలబస్‌ను ఆ విశ్వవిద్యాలయాలే నిర్ణయిస్తాయి. విద్యార్థులలో మేధస్సును, జ్ఞాపకశక్తిని పెంచటానికి ఉపాధ్యాయులు ఏం చేయాలి? సామాజిక అంశాలపై ఉపాధ్యాయులకు ఉండాల్సిన అవగాహన ఏమిటి? ఇలాంటి ప్రశ్నలన్నీ ఉపాధ్యాయ అర్హత పరీక్షకు సంబంధించినవే. రెండో దశ పరీక్ష ఎంపికకు సంబంధించింది. అభ్యర్థి విద్యాప్రగతి, స్పోర్ట్స్ యాక్టివిటీ, ఎక్స్‌ట్రా కరిక్యులమ్ యాక్టివిటీ వంటివి పరిగణలోకి తీసుకుంటారు. చివరగా తరగతి గదిలో పాఠం చెప్పిస్తారు. ఇలా ప్రతి దశలో ఉపాధ్యాయ అభ్యర్థులను పరిశీలిం చి నియమిస్తారు. సింగపూర్, సౌత్ కొరియాలో ఇలానే చేస్తారు. టీచర్ రిక్రూటమెంట్‌లో సంబంధిత ఉపాధ్యాయుణ్ణి ఎంపిక చేయటమే ప్రధానం. ఆ దేశంలో ఉపాధ్యాయుడికున్న గౌరవం ఇది.

**పరివర్తనే లక్ష్యంగా...**

ప్రతి దేశంలో విద్య అనగా ఏమిటది? దాని లక్ష్యం ఏమిటది? అన్న ప్రశ్నలు చర్చకు వచ్చాయి. ఆనాడున్న పరిస్థితులనుబట్టి దేశ అవసరాలనుబట్టి ఒక్కొక్క మహనీయుడు ఒక్కొక్క విధంగా చర్చించారు, నిర్వచించారు. కానీ, ఎవరూ కూడా జీవనోపాధి కోసం మాత్రమే చదువు అని నిర్వచించలేదు. అమెరికాలో జఫర్‌సన్ కావొచ్చును, భారతదేశంలో జవహర్‌లాల్ నెహ్రూ కావొచ్చును, బ్రెజిల్‌లో ఉన్న పాల్ ఫ్రేరీ కావొచ్చును. బ్రెజిల్‌లో ప్రజాస్వామిక వ్యవస్థలను పటిష్ఠం చేయటానికే చదువు అన్నారు. చదువు ద్వారా ప్రజలకు సున్నితంగా రాజకీయ చైతన్యం కలిగించ గలగాలి. దానికోసం ఫ్రేరీ "పీడిత ప్రజలకు బోధన" అనే పుస్తకం రాశారు. పీడిత ప్రజలను పాలనా వ్యవస్థ ద్వారా ఏ విధంగా పాత్రధారి చేయాలో చెప్పాడు. విద్య ద్వారా సున్నితమైన చైతన్యం ఎలా కలిగించాలో సూచించాడు.

**రేపటి పట్ల ఆశను, ఈవేళ కొంత త్యాగం చేసే శక్తిని ఇచ్చేది మంచి చదువు**

చదువంటే జీవితలక్ష్యంపై భరోసా కలిగించటమే. అది లేకుంటే మనిషిలో పెనుగులాట రాదు. రేపటి గురించి ఏం చేయాలన్న ఆతృత మొదలు కావాలి. అందుకు చదువు సాధన కావాలి. చదువు ద్వారా విద్యార్థిలో పెనుగులాట లేకుంటే.. దేశం నిస్తేజంగా ఉంటుంది. రేపటి గురించి నమ్మకం ఉంటేనే ఆలోచిస్తాడు. ఉమ్మడి పోరాటాలకు సిద్ధపడతాడు. ప్రస్తుత సుఖాన్ని రేపటి కోసం త్యాగం చేస్తాడు. చదువు లక్ష్యం సమాజాన్ని మానవీకరణ చేయటమే. ప్రజల జీవనాన్ని నిన్నటికన్నా మెరుగైనదిగా తీర్చిదిద్దటమే. ప్రజల అవసరాలను కనుక్కోవటం, రేపటి అవసరాల గురించి ఆలోచించటం.. అనగా చదువుకు దార్శనికత లేకుంటే సమాజంలో చైతన్యమే ఉండదు. చదువు ఎందుకు? అనే ప్రశ్నకు సమాధానం.. భవిష్యత్తుపై భరోసా కలిగించటమే. అనగా వచ్చే తరానికి తనకన్నా మెరుగైన జీవితం ఉండాలని ఆకాంక్షించాలి. దాని కోసం పెనుగులాడటం జరగాలి. అందుకు కావలసిన నైపుణ్యాన్ని సంపాదించుకోవాలి. వచ్చేతరం కోసం కృషి చేయాలి. అందుకు కావలసిన అవసరాల నైపుణ్యాల్ని సంపాదించుకోవాలి. ఇలాంటి అభిప్రాయాలు వ్యక్తం చేసి లాటిన్ అమెరికాను మేలుకొలిపేందుకు కృషి చేసి, భవిష్యత్ నిర్మాణానికి చదువును ఉద్యమంగా మార్చుకున్నందునే ఫ్రేరీని విప్లవాత్మక విద్యావేత్త అంటారు. ఇలాంటి ఎంతోమంది మహనీయుల తపస్సు ఫలించి విద్యారంగం నిర్మితమైంది. దానిలో ఒక పాత్రధారి అవుతున్నందుకు ప్రతి ఉపాధ్యాయుడు గర్వించాలి. ఉపాధ్యాయ వృత్తి పొట్టపోసుకోవటానికి కాదు. జాతికి భవిష్యత్తుపై నమ్మకం, ఉత్సాహం కలిగించటానికి రేపటి కోసమై ఇవాళ్టి సుఖాల్ని త్యాగం చేసే లక్షణం ఉండాలి. అప్పుడే సమాజ పరివర్తనకు స్కూళ్లు సాధనాలుగా మారతాయి. పాఠశాల లక్ష్యం పరివర్తన కలిగించడం.

**అక్షరం ఏం చేస్తుందంటే..**

అక్షరం ఇతరులకు కనపడని దానిని చూపిస్తుంది. ఈ పరిజ్ఞానమే మనిషికి అదనపు జ్ఞానాన్ని ప్రసాదించింది. ఇతరులకు వినపడని బాధితుల ఆవేదనను వినిపిస్తుంది. మనిషిని ఇతర ప్రాణులకన్నా విశిష్టమైనదిగా చెక్కుతుంది. ఈ జ్ఞానం సమాజం ఇచ్చిన శక్తి. సమాజానికి ఆ జ్ఞానాన్ని తిరిగి ఇచ్చినవారే మానవత్వం గలవారు అని ఫెర్రీ అంటాడు. బ్రెజిల్ చెరకు తోటల్లో పనిచేస్తున్న కార్మికులు సంకెళ్ల నుండి విముక్తి పొంది అవకాశాలను అందు కునే శక్తిని అక్షరం ఇచ్చింది. దాన్నే మనం రీడింగ్ అంటాం. చదవటం మీ పరిధిని పెంచింది. ఇతరుల చేతి నుంచి జారుతున్న అక్షరాలు మీ దగ్గరికి ఎలా వచ్చాయో జ్ఞప్తికి తెచ్చుకోండి. మని షికి రాత రాయటం నేర్పింది అక్షరం. మెదడు నుంచి జారి చేతి గుండా వచ్చి అది రైటింగ్‌గా మారుతుంది. కాగితం మీదో, కాగిత రహితంగానో రాయటం లేకపోతే నీకు కనపడని దృశ్యాల నాదం వినపడేదా? చదవటం, రాయటం అన్నవి మనిషిని చెక్కుతాయి. ఇది సమాజం ఇచ్చిన నైపుణ్యం. "ఆఫ్రికాలోని ప్రజలు అక్షరా స్యతలో వెనుకపడి పోవటం వల్లనే కదా వారు అమెరికాలో శతాబ్దకాలం బానిసలుగా బతికారు, పత్తి పండించారు, దోపిడీ వ్యాపార వ్యవస్థను పెంచి పెద్దదిగా చేశారు. అక్షరాలు నేర్చుకుని విద్యావంతులు సంఘటితంగా ఉద్యమం చేయటమే సమత్వానికి కారణ భూతమైంది కదా! కాబట్టి మనకు దక్షిణాఫ్రికాలోని కార్మికులే ఆదర్శం" అని ఫెర్రీ ఉద్బోధించాడు. ఈ మాదిరిగా రీడింగ్, రైటింగ్‌లను ప్రచారం చేసి ఫెర్రీ సామాజిక కార్యకర్తగా మారా డు. చదువుకు వయసుతో సంబంధంలేని వయోజనులనూ ప్రోత్సహించాడు. అక్షరం ఎందుకు? అనే దానికి సమాధానంగా 'పీడిత ప్రజల బోధన' (పెడగాజి ఆఫ్ అప్రెస్డ్) అనే పుస్తకం రాశాడు. లాటిన్ అమెరికన్ దేశాలలో సముద్రాలు ఈది వలసలు పోయే జాతిని ఆపాడు. తమ దేశంలోనే నిర్మాతలుగా మార్చ గలిగాడు. అనేకమందిని నాయకులను తయారు చేయగలిగాడు. 'హోప్ ఆఫ్ ది అప్రెస్డ్' (పీడిత ప్రజల ఆశలు) అనే పుస్తకాన్ని ఫెర్రీ రాశాడు. ఒక ఉపాధ్యాయుడు ఏం సాధించగలడో చూపిం చాడు. పాఠశాలలు లాటిన్ అమెరికా దేశాల భవిష్యత్ నిర్దేతలుగా మారాయి. అందుకే ప్రఖ్యాత విద్యావేత్త కొఠారి తరగతి గదిలోనే దేశ భవిష్యత్తుకు రూపకల్పన జరుగుతుందన్నారు. ❖

# 'ఆర్‌టీఐ లైబ్రరీ' యాప్‌ను ప్రారంభించిన జేపీ

ప్రభుత్వంలో ఉన్నవారు మన సేవ కోసం, మనం ఎన్నుకున్నవారని.. మన చెల్లించే పన్నుల డబ్బుతో చేసే పనుల్లో వారు జవాబుదారీతనం, పారదర్శకతతో వ్యవహరించాలని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్.డి.ఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. అవిద్య, పేదరికం విస్తారంగా ఉన్న సువిశాల దేశంలో మనం ఆధునిక ప్రజాస్వామ్యాన్ని అమల్లోకి తెచ్చుకున్నాంగానీ, ఆ ప్రజాస్వామ్యం వేళ్లూనుకునే వ్యవస్థల ఏర్పాటు ఇంకా అసంపూర్ణంగానే ఉందన్నారు. ఆ వ్యవస్థీకృత ప్రజాస్వామ్య సంస్కరణల్లో భాగంగానే లోక్‌సత్తా పాలనా సమాచార హక్కు చట్టాన్ని (ఆర్‌టీఐ) 2005లో తీసుకొచ్చిందన్నారు. అయితే ఆ చట్టం ప్రభావాన్ని గుర్తించిన పాలకులు, అధికార యంత్రాంగం క్రమంగా సమాచారం ఇవ్వటానికి రకరకాల వంకలు చెబుతున్నారన్నారు. ఈ క్రమంలో ప్రజలు నిరుత్సాహ పడకుండా.. ఇప్పటికే ఆర్‌టీఐ ద్వారా వెల్లడించిన సమా చారం కోసం మళ్లీ దరఖాస్తు అవసరంలేకుండా, 'ఆర్‌టీఐ లైబ్రరీ' ఉపయోగపడుతుందన్నారు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఇతిహాస్ రూపొందించిన ఆ వెబ్ యాప్‌ను జేపీ హైదరా బాద్‌లో ప్రారంభించారు. సోషల్ మీడియా, ఏఐ వచ్చాక సమాచారం సమస్య కాదని.. కానీ ఏది నిజం, ఏది ఎందుకు, ఏ విధంగా ఉపయోగించుకోవాలి అనేవి పెద్ద సవాళ్లని అన్నారు. ఇలాంటి సమాచార వెల్లువ యుగంలో పారదర్శకత కోసం యాప్‌ను రూపొందించటం అభినందనీయమన్నారు.

ప్రజలు అడగకుండానే వారికి అవసరమైన, వారు అడుగుతున్న సమాచారాన్ని అందించాల్సిన బాధ్యత పాలకులు, అధికారులకు




"RTI Library" launched by Dr. Jayaprakash Narayan

ఉందని జేపీ అన్నారు. ఇటీవల హైదరాబాద్‌లో కేబీఆర్ పార్క్ జాతీయ పార్క్ పునర్నిర్మాణ పనులను చేపట్టటాన్ని ప్రజల్లో పలువురు వ్యతిరేకించారని.. వారు అడక్కుండానే సదరు సమాచారాన్ని తెలియచేసి వారి సందేహాలకు సమాధానం ఇవ్వాల్సిన బాధ్యత పాలనా యంత్రాంగానికి ఉందన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజలకు జవాబుదారీగా ఉంటూ.. మంచినీరు, పారిశుద్ధ్యం, మురుగు, వరదనీటి పారుదల, రైతుల సమస్యలు, విద్య, ఆరోగ్యం మొదలైన ప్రతి విషయాన్నీ ప్రభుత్వాలు తెలియచేయటం సమ్మిళిత అభివృద్ధికి, చిట్టచివరి పౌరుని సాధికారతకు కీలకమని జేపీ అన్నారు. ఏటా వేల సంఖ్యలో ఆర్‌టీఐ దరఖాస్తులు దాఖలవుతున్నా, వాటిలో 50 శాతం తిరస్కరణకు గురవుతున్నాయని ఇతిహాస్ తెలిపారు. 30 శాతం మంది గతంలో ఇతరులు పొందిన సమాచారం అడుగుతున్నారన్నారు. అలాంటివారికి ఆర్ఐటీ లైబ్రరీ ఆన్‌లైన్ వేదిక ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో గంజి శ్రీనివాస్, మధుబాబు, ఆనం చిన్నికృష్ణ పాల్గొన్నారు. ❖







## శ్రీ డీవీఎస్ వర్మకి లోక్‌సత్తా ఘననివాళులు

**లోక్‌సత్తా భావజాలాన్ని కేవలం అభిమానించటమేగాక.. అందుకోసం సమయాన్ని, వనరుల్ని వెచ్చించిన లక్షలాది మందిలో నాయకత్వ సామర్థ్యంతో పనిచేసిన వ్యక్తి శ్రీ డి.వి.ఎస్ వర్మ అని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్.డి.ఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ నివాళులర్పించారు. లోక్‌సత్తా పార్టీ తరపున ఎన్నికల్లో పోటీ చేయటమంటే, నిజాయతీతో సంపాదించిన డబ్బును ఖర్చు చేయటం తప్ప.. గెలిచే అవకాశాలు తక్కువ ఉన్నా, 2009 ఎన్నికల్లో తనకు సీటు కేటాయించలేదని వాదనలకు దిగారన్నారు. లోక్‌సత్తా పార్టీని ప్రజల ఆస్తిగా, ప్రజాస్వామిక పార్టీగా దేశంలోని మిగిలిన పార్టీలకు మార్గదర్శకంగా నిర్మించే క్రమంలో నిర్వహించిన రహస్య బ్యాలెట్ ఎన్నికల్లో, విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లటంలో వర్మ కృషి మరువలేనిదన్నారు. హైదరాబాద్‌లో అకాల మృతి చెందిన వర్మ చిత్రపటానికి ఆయన స్వగృహంలో పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు. లోక్‌సత్తా నేతలు కటారి శ్రీనివాసరావు, నందిపేట రవీందర్, రామరాజు తదితరులు పాల్గొన్నారు.**

### తెలంగాణ విద్యాకమిషన్ నివేదిక ముఖ్యాంశాలు

(12వపేజీ తరువాయి)

⏭ ప్రభుత్వ పాఠశాలల్లో శాశ్వత ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది, జీతాలు అవే పనులకు మార్కెట్ ప్రమాణాలతో పోలిస్తే చాలా ఎక్కువగా ఉన్నాయని కమిషన్ గుర్తించింది. భవిష్యత్తులో టీచర్లు, ఇతర సిబ్బంది నియామకాలు చేస్తే..ఈ జీతభత్యాలను సమీక్షించటం, హేతుబద్ధీకరించటం అవసరం. జీతాలు వంటి తప్పని సరి ఖర్చులు (రెవెన్యూ వ్యయం).. నాణ్యమైన విద్య, విద్యార్థుల సర్వతోముఖ వికాసం వంటి ఇతర వ్యయాల బడ్జెట్‌కి అవరోధం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి రీత్యా..విద్యారంగంలోని ఉద్యోగులతోపాటు, ప్రభుత్వోద్యోగులందరి జీతాలు, భత్యాలు, పెన్షన్లు వంటివి అభివృద్ధితో సమ తూకంతో ఉండేలా చర్య లు అమలు చేయాలి. నిర్లక్ష్యం చేస్తే, ప్రస్తుత వ్యయాలు భవిష్యత్తులో విద్యారంగ విస్తరణ, ఇతర సంస్కర ణలకు అవరోధంగా మారతాయి.

⏭ స్వచ్ఛంద సంస్థలు, ఐక్యరాజ్యసమితి విభాగాల భాగస్వామ్యాన్ని విద్యలో ప్రోత్సహించాలి. దాతల నుండి వనరుల సేకరణకు చట్టపరమైన అవరోధాలను పరిష్కరించటం సహా అన్ని ఏర్పాట్లతో పబ్లిక్ పోర్టల్‌ను అందుబాటులోకి తేవాలి.

⏭ హాజరు పట్టీలో, బహిరంగ పత్రాల్లో ఎస్.సి, ఎస్.టి కులం, తెగ వంటివి పేర్కొనకూడదు.

⏭ బ్రిటిష్ కాలంలో అప్పటి పరిస్థితుల రీత్యా అమలు చేసిన 35% నే పాస్ మార్కులుగా ఇప్పటికీ కొనసాగిస్తున్నారు. క్వాలి ఫయింగ్ మార్కుల్ని 45 శాతానికి పెంచాలి.

⏭ ప్రాథమిక స్థాయి నుండి పోస్ట్ గ్రాడ్యుయేషన్ వరకు కంప్యూటర్ నైపుణ్యాల్ని తప్పనిసరి చేయాలి.

⏭ ప్రభుత్వ విద్యాసంస్థల్లో జాతీయగీతాన్ని మాత్రమే ఆలపించాలి. రాష్ట్ర గీతాన్ని స్కూల్ అసెంబ్లీ సహా అధికారిక కార్యక్రమాల్లో మాత్రమే పాడాలి.


⏭ ప్రయివేటు కళాశాలలు వరుసగా రెండేళ్లపాటు నాసిరకం పనితీరును కనబరిస్తే, ఫీజు రీఇంబర్స్‌ను తొలగించాలి.

⏭ ప్రాథమికోన్నత పాఠశాల నుండే లైంగిక విద్య, ప్రాథమిక చట్టాలు, పోక్సో మొదలైన అంశాలను తెలియచెప్పాలి.

❖

# ఇంధన సాధికారత, సముద్ర రవాణా మార్గాలపై ప్రపంచ దేశాల హక్కుల్ని పరిరక్షించుకోవాలి

**- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్**



కొన్ని వారాల విధ్వంసం అనుకున్న ఇరాన్ సంక్షోభం కాస్తా నెలల తరబడి కొన సాగుతున్నట్లు కనిపిస్తోంది. తుపాను ముందు ప్రశాంతతలా కాల్పుల విరమణ, హోర్ముజ్ జలసంధి దిగ్బంధం, ఒప్పందంపై చర్చల నేపథ్యంలో.. ప్రస్తుతం రెండు రకాల పరిణామాలకు అవకాశం ఉందనుకోవచ్చు.

అమెరికా వారి అంచనా ప్రకారం.. చమురును అమ్ము కోలేదు కాబట్టి ఆ ఆదాయం మీదే ఎక్కువ ఆధారపడిన ఇరాన్, ఆర్థిక ఒత్తిడిని మరీ ఎక్కువకాలం భరించలేదు. హోర్ముజ్ జలసంధి విషయంలో రాజీకి సిద్ధంగా ఉన్నట్లు ఇరాన్ తాజా సంకేతాలు వెల్లడిస్తున్నాయి. కానీ యురేనియం శుద్ధి విషయంలో ఆ దేశం కొంత మొండితనాన్ని ప్రదర్శిస్తోంది. అణ్వస్త్ర సామర్థ్యం తన సార్వభౌమాధికార హక్కుగా ఇరాన్ భావిస్తోంది. మరోవంక, అమెరికా యురేనియం శుద్ధి విషయంలో రాజీ ప్రసక్తే లేదని అమెరికా సంకేతమిస్తోంది. హోర్ముజ్ విషయంలో మాత్రం కొంత రాజీకి అభ్యంతరం లేదంటోంది. ఇరాన్ యుద్ధంపై గతంలో రాసిన వ్యాసాల్లో పేర్కొన్నట్లు.. చమురు, గ్యాస్ ఉత్పత్తిలో అమెరికా స్వయంసమృద్ధం. అయితే ఇప్పుడు అంతర్జాతీయ మార్కెట్‌కి అనుగుణంగా ఆ కొద్దిమేర సైతం ధరలు పెరగకుండా ఏం చర్యలు తీసుకోవాలో అధ్యక్షుడు ట్రంప్ చర్చిస్తున్నారు. ఇందుకోసం చమురు సంస్థల ఎగ్జిక్యూటివ్‌లతో సమావేశమయ్యారు. దేశీయంగా మధ్యంతర ఎన్నికల్లో రాజకీయ ఓటమిని తప్పించుకునేందుకు మార్గాలను అన్వేషిస్తున్నారు. అమెరికన్ల మీద భారం పడకుండా, అవసర మైతే దీర్ఘకాలిక ప్రక్షాళనకు ట్రంప్ ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు కనిపిస్తోంది. చమురు సరఫరా ఆటంకాలపై దిగ్బంధాన్ని ప్రత్యక్షంగా కాకున్నా.. నెలల తరబడి కొనసాగించాలనే ప్రతి పాదన కూడా వాటిలో ఉండొచ్చు.

రెండో అంచనా, ఇరాన్ కోణం నుండి. దిగ్బంధానికి తలొగ్గటానికి ఆ దేశం సిద్ధంగా లేదు. దశాబ్దాలపాటు ఇరాన్ ఆర్థిక ఆంక్షలను ఎదుర్కొంది. ఇప్పుడు దిగ్బంధం ద్వారా అదనపు కష్టనష్టాల్ని ఓర్చుకోగలదు. ప్రజల బాధల పట్ల ఏమాత్రం పట్టింపులేని ప్రభుత్వం ఎంతటి తెంపరితనాన్నయినా ప్రదర్శించగలదు. ఓటర్లకు జవాబుదారీతనం ఎలాగూ లేదు. ఇలాంటి సందర్భంలో, ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ బాంబుల దాడి కొన సాగట మంటే.. ఇక తక్షణ పరిష్కారాలకు తిలోదకాలిచ్చు కోవటమే. ఇప్పటివరకూ జరిగిన ఘటనల్ని పరిశీలిస్తే, యుద్ధానికి అడ్డుకట్ట పడకపోతే ఇరాన్ మౌలిక వసతులు ఇంకా ధ్వంసమవుతాయి. ప్రతీకారంగా.. జీసీసీ దేశాల చమురు, గ్యాస్ క్షేత్రాలపై ఇరాన్ విచక్షణారహితంగా దాడులు చేయ వచ్చు. దీనివల్ల, ఆ దేశాల్లో పెద్దఎత్తున, శాశ్వత స్థాయి నష్టం జరిగే అవకాశం ఉంది. అంతర్జాతీయ ఇంధన సరఫరాలో దీర్ఘకాలిక పర్యవసానాలకి ఇది దారితీస్తుంది.

వచ్చే కొన్ని రోజుల్లో ఈ యుద్ధం ఆగినా.. హోర్ముజ్ జల సంధిలో నౌకల రవాణాను పూర్తిస్థాయిలో పునరుద్ధరించటానికి సమయం పడుతుంది. వారాల తరబడి ప్రపంచ వ్యాప్తంగా ఇంధన కొరతలుంటాయి. అంతకంటే ముఖ్యం, ఇంధన భద్రతపై ప్రపంచం నిరంతరం అభద్రతలో కొట్టు మిట్టాడుతుంటుంది. భవిష్యత్తులోనూ జలసంధిని ఎప్పుడైనా దిగ్బంధించవచ్చు. ఈ రకంగా ఛిన్నాభిన్నమైన ప్రపంచ వ్యవస్థలో దేశాలు బిక్కుబిక్కుమంటూ మనుగడ సాగించాల్సి ఉంటుంది. ఇరుకైన కీలక నౌకా మార్గాలు ప్రమాదాలను ఎదుర్కోవలసి ఉంటుంది. కాబట్టి, ఈ రెండు సవాళ్లు, ఈ సంక్షోభం నుండి పాఠాలూ.. ఈవేళ మారు మూల ప్రాంతాల వరకు అన్ని దేశాలకూ అత్యంత కీలకం. సంక్షిప్తంగా పరిశీలిద్దాం.

మొట్టమొదటిది, ఇంధన భద్రత. ప్రపంచంలోని చాలా దేశాలు ఇంధన భద్రత కోసం పోటీపడుతూ గందరగోళంలో చిక్కుకున్నాయి. ఇంధన భద్రత కోసం వెతుకులాట యుద్ధానంతర పరిణామాల్లో మూడు రకాలుగా రూపాం తరం చెందుతుంది. ఒకటి, దిగుమతి చేసుకునే దేశాలు నిల్వ సామర్థ్యాన్ని పెంపొందించుకోవటం. వ్యూహాత్మక నిల్వల్ని మరింత పెద్దఎత్తున ఏర్పాటు చేయటం. ఇందు కోసం భారీ మొత్తాలు వెచ్చించాల్సి వచ్చినా దిగుమతుల మీద ఆధారపడే దేశాలు వెనుకంజ వేయవు. రెండోది, అరేబియన్ ద్వీపకల్పం నుండి ఎర్రసముద్రం వరకు ఉన్న తూర్పు-పశ్చిమ పైప్‌లైన్ సామర్థ్యాన్ని ప్రస్తుతమున్న 7 ఎంబీడీ నుండి రెట్టింపు లేదా మూడు రెట్లు చేసేందుకు సర్వశక్తులతో ప్రయత్నిస్తాయి. దీనికితోడు, అరేబియన్ ద్వీపకల్పంలో ఉత్తరం నుండి

దక్షిణానికి చమురు, గ్యాస్, ఎరువులు, సల్ఫర్, హీలియం వాయువు, ఇతర సరకుల్ని రవాణా చేసేందుకు పైప్‌లైన్ల తయారీ, రోడ్ల నిర్మాణం కోసం భారీ పెట్టుబడులు పెట్టాలి. ఒక్కసారి ఈ సరకులు గల్ఫ్‌తో సంబంధం లేకుండా ఒమన్ ద్వారా అరేబియా సముద్రం లోకి ప్రవేశించగలిగితే, ఇంధన కొరతలతో సతమతమయ్యే ప్రపంచానికి సురక్షితంగా అందు తాయి. మూడోది, వచ్చే దశాబ్దకాలంపాటు, ప్రపంచవ్యాప్తంగా ఇంధన అవసరాల్ని తట్టుకోవటానికి దీర్ఘకాలిక చర్యల్ని దేశాలు మరిన్ని చేపడతాయి. వేగంగా అమలు చేస్తాయి. ఇందులో భాగంగా, పునరుత్పాదక ఇంధనాలకు మళ్లే ప్రక్రియను యుద్ధప్రాతిపదికన కొనసాగిస్తారు. డిమాండ్ నిర్వహణ, జీవ ఇంధ నాల ఉత్పత్తిని మరింత పెంచటం; అన్నిటినీ మించి, సౌర శక్తి ఉత్పత్తి, బ్యాటరీ నిల్వ వ్యవస్థలు, విద్యుత్ వాహనాలు, సమర్థవంతమైన ప్రజారవాణా వ్యవస్థలు – ఇవన్నీ ప్రతి దేశ ఆర్థిక ఎజెండాలో భాగమవుతాయి. తప్పనిసరి అయిన చోట, ఇంధనం కోసం బొగ్గు వినియోగం పెరుగుతుంది. బొగ్గు గ్యాసిఫికేషన్ వేగవంతమవుతుంది. లేకుంటే, భూగో ళంపై పచ్చదనాన్ని పెంపొందిస్తారు. భూతాపం పట్ల బాధ్యత కారణం కాకున్నా.. జీవ ఇంధనాల తయారీ ద్వారా చమురు మీద ఆధారపడటం తగ్గించటం కోసం.

రెండోది, ప్రపంచమంతా అత్యధిక ప్రాధాన్యతనిచ్చే అంశం– మూసివేత వంటి సమస్యలు ఎదుర్కొనే అవకాశమున్న కీలకమైన, ఇదేసమయంలో ఇరుకుగా ఉండే సముద్ర మార్గాలను నౌకల స్వేచ్ఛా రవాణాకు తెరిచివుంచే భరోసా నివ్వటం. ఇందుకు విశ్వసనీయ చర్యలు తీసుకోవటం. ఇదేమీ కొత్త కాదు. శతాబ్దాలుగా, స్వేచ్ఛా సముద్ర మార్గాలు, నౌకా వాణిజ్యంపై ప్రపంచ దేశాల మధ్య అసాధారణ ఏకాభిప్రాయం ఆనవాయితీగా వస్తోంది. ప్రపంచ వస్తు వాణిజ్యంలో 90% సముద్ర మార్గంలోనే జరుగుతోంది. అంతర్జాతీయ నౌకా వాణిజ్యంలో అనేక కీలకమైన, ఇరుకైన జలసంధులు ఉన్నాయి. సంధులు, ఒప్పందాల ద్వారా అంతర్జాతీయ వాణిజ్యానికి ఈ సముద్ర మార్గాలను తెరిచివుంచుతారు. అత్యంత కీలక సరఫరా మార్గాల్లో ఒకటైన హొర్ముజ్ జలసంధిని నియంత్రిం చటానికి భౌగోళిక అనుకూలతల్ని ఇరాన్ ఉపయోగిం చుకోవటం ఇప్పుడు మొత్తం ప్రపంచ ఆర్థిక వ్యవస్థనే అల్లకల్లోల పరుస్తోంది. నాలుగు వేల సంవత్సరాలుగా ఓడలు హొర్ముజ్ జలసంధి నుండి స్వేచ్ఛగా ప్రయాణించాయి. భారత్, అరబ్ దేశాల మధ్య సరకులను చేరవేశాయి.

మాలే ద్వీపకల్పం, సుమత్రా (ఇండొనేషియా) మధ్య ఉన్న కీలక జలమార్గం మలక్కా జలసంధి.. అండమాన్ సము ద్రాన్ని దక్షిణ చైనా సముద్రంతో కలుపుతుంది. జలసంధి నిర్వహణపై ఇండొనేషియా, మలేషియా, సింగపూర్ మధ్య ఒప్పందం ఉంది. నౌకా మార్గాలకు భద్రత కల్పించటం ఆ దేశాల బాధ్యతలో భాగం. అదేవిధంగా, బాబ్ అల్–మందబ్ జలసంధి. ఎర్ర సముద్రాన్ని అరేబియా సముద్రంతో సంధానం చేసే ఈ కీలక నౌకా మార్గ జలసంధి అనిశ్చిత దేశాలైన జిబౌటీ, యెమెన్, సోమాలియా, సూడాన్‌ల మధ్య ప్రాంతంలో ఉంది. ఇరాన్ పెంచి పోషిస్తున్న, ఆ దేశానికి ముసుగు మద్దతుదారులైన ఉగ్రవాద హౌతీలు ఈ జలసంధిలో ఓడల రవాణాకు 2023 నుండి 2025 వరకు పలుమార్లు దాడులతో ఆటంకం కలిగించారు.

మధ్యధరా సముద్రాన్ని నల్ల సముద్రంతో కలిపే బోస్ఫరస్, డార్‌డనెల్లిస్ జలసంధులూ ఎంతో కీలకమైనవి. ఈ ఇరుకు మార్గాలు టర్కీ ప్రాదేశిక పరిధిలో ఉన్నాయి. 1936 మాంట్రియక్స్ ఒప్పందం ప్రకారం.. ఈ మార్గం నుండి స్వేచ్ఛగా ప్రయాణించకుండా సరకు రవాణా ఓడల్ని శాంతి సమ యంలో అడ్డుకోవటానికి వీల్లేదు. అయితే యుద్ధనౌకలపై నియంత్రణ అమలుచేయవచ్చు. అదేవిధంగా, యుద్ధ సమయంలో అనుమానాస్పద వైరిదేశాల ఓడల్ని దిగ్బం ధించే అధికారం టర్కీకి ఉంటుంది. డానిష్ జలసంధులపై డెన్మార్క్ కొన్ని శతాబ్దాలపాటు అజమాయిషీ చెలాయించింది. ఉత్తర సముద్రం, బాల్టిక్ సాగరాల మధ్య రవాణా చేసే ఓడల నుండి టోల్ డబ్బు (సుంకాలు) వసూలు చేసేది. 1857 నాటి కోపెన్‌హాగన్ ఒప్పందం టోల్ వసూలుకు ముగింపు పలికింది. అన్ని నౌకలకూ స్వేచ్ఛా రవాణా హక్కును కల్పించింది. మధ్యధరా సముద్రాన్ని అట్లాంటిక్ మహాసముద్రంతో కలిపే జిబ్రాల్టర్ జలసంధిని యు.ఎన్.సి. ఎల్.ఓ.ఎస్ నిర్వహిస్తుంది. ఇందులో అన్ని ఓడలకూ స్వేచ్ఛా రవాణా అవకాశం కల్పించారు.

ఈ ఆరు కీలక సముద్ర మార్గాలూ కాకుండా, సరకుల్ని సులభంగా రవాణా చేయటానికి రెండు కాలువల్ని తవ్వారు. ఎర్ర సముద్రాన్ని మధ్యధరా సముద్రంతో కలిపే సూయజ్ కాలువ ఈజిప్ట్ గుండా ప్రయాణిస్తుంది. 1869లో పూర్త యింది. 1956లో కాలువను జాతీయీకరించాక, పూర్తి స్థాయిలో ఈజిప్ట్ అజమాయిషీలోకి వెళ్లింది. అయితే ఏ నౌక యినా స్వేచ్ఛగా ఆ మార్గం నుండి ప్రయాణించవచ్చు. ఇంకోటి, అట్లాంటిక్, పసిఫిక్ మహాసముద్రాలను కలిపే పనామా కాలువ. ఇది పనామా ప్రాదేశిక పరిధిలో సాగు తుంది. పనామా ప్రభుత్వం 1999లో కాలువను నియంత్రణలోకి తీసుకుంది. పనామా కాలువ శాశ్వతంగా తటస్థ జలమార్గంగా కొనసాగుతుందని సంబంధిత ఒప్పందం గ్యారంటీ ఇస్తుంది. పనామా శాశ్వత తటస్థతకు శాశ్వత గ్యారంటీ ఇచ్చే హక్కు అమెరికాకు దఖలుపరిచారు. హొర్ముజ్ జలసంధిలో ఓడల రవాణాకు ఆటంకాలు కలిగించటం ఒక ప్రమాదకర ఆనవాయితీకి నాంది పలకటం. ఇరుకుగా ఉండే అన్ని కీలక నౌకా రవాణా మార్గాల భవిష్యత్తునూ ప్రమాదంలో పడేస్తుంది. ప్రపంచ సమాజం కలిసికట్టుగా వ్యవహరించాల్సిన; అంత ర్జాతీయ సరకు ఓడల మార్గాల్ని, కీలక సరఫరా గొలుసుల్ని పరిరక్షించుకోవాల్సిన సమయమిది.

❖

# ఈలం .. ఈల:
# శ్రీలంక, భారత్‌లో తమిళుల విలక్షణ తీర్పు




రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, శ్రీలంకలో సంక్షోభం, ఇజ్రాయిల్-పాలస్తీనా మారణకాండ, నేపాల్‌లో జెన్ జడ్ తిరుగుబాటు, ఇరాన్ యుద్ధం ఇలా వరుసగా ప్రపంచ వ్యాప్తంగా ఘర్షణలు కొనసాగుతూ మన నిత్యజీవితానికి అవసరమైన సరఫరా గొలుసుల్ని దెబ్బతీస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్.డి.ఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్‌ని ఎఫ్.డి.ఆర్ పరిశోధకుల్లోని ఒకరు ఆసక్తికర ప్రశ్న అడిగారు. 1970ల నుండి ఎల్.టి.టి.ఇ ఆవిర్భావం నేపథ్యంలో శ్రీలంకలో అంతర్యుద్ధం మనకు తెలుసు. రెండు భాషలున్న సింహళ మెజారిటీ నుండి విడిపోయి 'ఈలం' దేశంగా ఏర్పడాలని తమిళ మైనారిటీ జాతులు నిరంతరం ఘర్షణ పడటం చివరికి భారత ప్రధాని హత్యకు కూడా దారితీసింది. అయితే కొవిడ్ తదనంతరం ఆర్థికంగా దివాళా తీసి అంతర్యుద్ధాన్ని చూసిన శ్రీలంకలో, తమ డిమాండ్లను తీవ్రంగా వ్యతిరేకించే సింహళ నాయకుడు అనుర కుమార దిస్సనాయకే (జనతా విముక్తి పెరమున పార్టీ)కి జాఫ్నా తదితర ప్రాంతాలలోని తమిళులు, అందునా యువత కూడా 2024 ఎన్నికల్లో ఓటు వేశారు. ఇంత భాషాపరమైన జాతివైరం ఉన్నవారు ఎందుకు శత్రుపక్షాన్ని గెలిపించారు? అని ఆ పరిశోధకుడు ప్రశ్నించారు. తమిళ యువతకు గత చరిత్ర తెలియకపోవటం ఇందుకు కారణమా? అని కూడా అడిగారు.

చాలా ఆసక్తికరమైన ప్రశ్న. బహుశా గతం బరువు అంతగా లేకపోవటం, ప్రపంచాన్ని మొబైల్ తదితర సాంకేతికతలతో చూస్తూ తమ ఆర్థిక ప్రయోజనాలు అర్థంకావటం వల్ల.. లంకలోని తమిళ యువత అలా ఓటు వేసి ఉండొచ్చని జేపీ తెలిపారు. ఆ ఎన్నికలు జరిగిన తర్వాత ఏడాదిన్నర కాలాన్ని చూస్తే అది వాస్తవమని అర్థమవుతుంది. కానీ ఇందులో ఇంకో అంశం కూడా అంతర్లీనంగా కనిపిస్తుంది. కొవిడ్ తర్వాత శ్రీలంకకు ఆదాయమార్గాలైన పర్యాటకం తగ్గిపోయి, సేంద్రియ ఎరువులను అధ్యయనం లేకుండా ఒకేసారి భారీ విస్తీర్ణంలో వినియోగించటం, చైనా ప్రాజెక్టుల పేరుతో అప్పులు, అవినీతి, విలాసవంత జీవితం, వంశపారంపర్య రాజకీయాలు.. ఇలా చూస్తుండగానే ఆర్థిక, ఆకలి సంక్షోభం విరుచుకుపడటంతో, తమిళులకు నిజమైన జీవితం అనుభవంలోకి వచ్చింది. తిండి, బట్ట, నివాసం, భవిష్యత్తు.. ఈ కనీస అవసరాలు విలువ తెలిసొచ్చింది. ఇందుకోసం ఆదాయాలు, అభివృద్ధిని సుస్థిరంగా పెంపొందించుకోవటం

**కొవిడ్ తర్వాత శ్రీలంకకు ఆదాయా మార్గాలైన పర్యాటకం తగ్గిపోయి, సేంద్రియ ఎరువులను అధ్యయనం లేకుండా ఒకే సారి భారీ విస్తీర్ణంలో వినియోగించటం, చైనా ప్రాజెక్టుల పేరుతో అప్పులు, అవినీతి, విలాసవంత జీవితం, వంశపారంపర్య రాజకీయాలు.. ఇలా చూస్తుండగానే ఆర్థిక, ఆకలి సంక్షోభం విరుచుకుపడటంతో, తమిళులకు నిజమైన జీవితం అనుభవంలోకి వచ్చింది. తిండి, బట్ట, నివాసం, భవిష్యత్తు..ఈ కనీస అవసరాలు విలువ తెలిసొచ్చింది. ఇందుకోసం ఆదాయాలు, అభివృద్ధిని సుస్థిరంగా పెంపొందించుకోవటం ఎంత కీలకమో అర్థమైంది.**

ఎంత కీలకమో అర్థమైంది. వీటిని పణంగా పెట్టి ప్రత్యేక తమిళ ఈలం, సంపూర్ణ స్వయంప్రతిపత్తి రాష్ట్రం, యుద్ధాలు, ఉగ్రవాదం వంటి వాటి వల్ల ఉపయోగంలేదని వారికి బోధపడింది. ఎప్పుడైతే, తమ నిజమైన ప్రయోజనాలు అర్థమయ్యాయో, ఎల్‌టీటీఇ గెరిల్లా యుద్ధ నిషా నుండి బయటకు వచ్చారు. ఆవేశం స్థానంలో ఆలోచనతో ఓటు వేశారు. ఎవ్వరూ ఊహించని రీతిలో ప్రత్యేక తమిళ దేశాన్ని తరచూ విమర్శించే దిస్సనాయకే అధ్యక్షుడయ్యారు. రెండేళ్ల తర్వాత ఇలాంటి సన్నివేశమే 2026లో తమిళనాడులో వచ్చిన ఎన్నికల ఫలితం.

అయితే, శ్రీలంక తమిళులు ఏళ్ల తరబడి యుద్ధం ద్వారా భారీ మూల్యం చెల్లించి, చివరికి ఆర్థికంగా దేశం దివాళా తీశాకగానీ మేలుకోలేకపోయారు. భారత్‌లోని తమిళులు రాజ్యాంగ ప్రజాస్వామ్యానికి-సమాజానికి మధ్య సంఘర్షణ నుండి మేలుకొని ఓటు వేశారు. సుమారు అరవై ఏళ్లపాటు ద్రవిడ ఛత్రం కింద ఒక నమూనా పాలన తమిళనాడులో సాగింది. ఇటీవల హిందీ భాషను జాతీయస్థాయి రాజభాషగా ప్రకటించటం, ప్రతి రాష్ట్రంలో మాతృభాషతోపాటు నేర్చుకోవాలి అని యూనియన్ ప్రభుత్వంలోని బీజేపీ ప్రయత్నించినా, తమిళనాడు తీవ్రంగా నిరసించింది. ఇంగ్లిష్‌లో 'టెస్టింగ్ వాటర్స్'. అలా.. తమిళనాట వాతావరణం ఎంతవరకూ జాతీయ పార్టీలకు అనుకూలంగా ఉంది అని మోదీ పార్టీ చేసిన పరీక్ష తొలి దశలోనే బెడిసికొట్టింది. తమ సెంగోల్‌ను రాజదండంగా తీసుకెళ్లి కొత్త పార్లమెంటులో జాతి సార్వభౌమాధికారానికి సంకేతంగా నిలిపినా తమిళులు మెచ్చలేదు. దీంతో, ఇక ఇప్పట్లో అక్కడ బీజేపీ, కాంగ్రెస్‌లకు

అవకాశంలేదనే అభిప్రాయం విశ్లేషకులు వ్యక్తం చేశారు.
అదే తరుణంలో, ప్రత్యక్ష రాజకీయాల్లో ప్రవేశం కోసం కొన్నేళ్లుగా దృఢసంకల్పంతో ప్రయత్నిస్తున్న సినీ నటుడు సి. జోసెఫ్ విజయ్ చాలా ధైర్యంగానే కాదు, చాతుర్యంతో తమిళ సమాజంలోని గందరగోళాన్ని అర్థం చేసుకున్నారు. సంప్రదాయానికి, ఆధునికతకు వారధిగా తమిళగ వెట్రి కజగం (టీవీకే) పార్టీని స్థాపించారు. ఈ రకంగా.. అటు ద్రవిడ పార్టీల మధ్య ఎంపిక గావించుకోలేక, ఇటు జాతీయ పార్టీల వైపు మళ్లలేక మార్పు కోసం ఎదురుచూస్తున్న తమిళియన్లకు విజయ్ వ్యూహాత్మక మధ్యేమార్గం ఆశాకిరణంగా కనిపించింది. కెప్టెన్ విజయ్‌కాంత్ సినిమాలో సహాయ నటుడిగా కెరీర్‌ను ప్రారంభించిన విజయ్‌కి ఆయన పార్టీ డీఎండీకే లాగే 18-20% ఓట్లు, ఆ మేరకు కొన్ని సీట్లు వస్తాయనుకున్నారు. కానీ ఎనిమిది జిల్లాల్లో మినహాయించి, మిగతా రాష్ట్రమంతటినీ టీవీకే తుడిచిపెట్టేసింది. తనకు రాజకీయ శత్రువు డీఎంకే, భావజాల శత్రువు బీజేపీ.. అని చెప్పి మెజారిటీకి తగ్గిన పది సీట్లు భర్తీ గావించుకోవటానికి ఇబ్బందిపడ్డా.. రెండు దిగ్గజ పార్టీలైన డీఎంకే, అన్నా డీఎంకే మళ్లీ ఎన్నికల ప్రతిపాదన ధైర్యం చేయలేకపోయాయి. చివరికి డీఎంకే, అన్నాడీఎంకే కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన వచ్చినా స్టాలిన్ అంగీకరించలేదని చెబుతున్నారు. స్టాలిన్ ఎమ్మెల్యేగా ఓడిపోకుంటే, మళ్లీ ముఖ్యమంత్రి అయ్యే ఆఫర్ వచ్చి వుంటే ఎలా ఆలోచించేవారో తెలియదుగానీ.. టీవీకేకి మద్దతు విషయంలో ఆయన హుందాగానే కాదు, ముందుచూపుతో వ్యవహరించారు. ద్రవిడ గుత్తాధిపత్యానికి బీటలువార్చిన బీజేపీయే డీఎంకే, అన్నా డీఎంకేల ద్వారా ప్రభుత్వం ఏర్పాటుని ప్రతిపాదించిందని చెబుతున్నారు. విజయ్ అభిమానుల నుండి ప్రతిఘటన ఎదురుకాకుండా, రజినీకాంత్‌ని రాయబారానికి ఎంచుకుందని చెబుతున్నారు. అందులో నిజానిజాలు ఎలావున్నా.. ఇప్పుడు డీఎంకే, అన్నా డీఎంకే కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తే, ఇక భవిష్యత్తులో ఆ పార్టీల ఉనికే ప్రమాదంలో పడే అవకాశం ఉండేది. ఇప్పటికే బీటలు వారిన ద్రవిడ భావజాల వైరుధ్యం చివరికి ఆ పార్టీలకే ఎసరు పెట్టేది. స్టాలిన్ ప్రాప్తకాలజ్ఞతతో వ్యవహరించి, విజయ్ ముఖ్యమంత్రి కావటానికి మార్గం సుగమం చేశారు. ప్రమాణస్వీకారం చేసిన వెంటనే ముఖ్యమంత్రి విజయ్ స్టాలిన్‌ను కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. అంతకుముందు మెజారిటీ కోసం అన్నా డీఎంకే అగ్రనేత పళనిస్వామిని కలిసిన ప్పటికీ తిరస్కరించడంతో.. టీవీకే ప్రభుత్వం ఏర్పాటు వాయిదా పడుతూ వచ్చింది. అప్పుడు పళనిస్వామి సరైన వ్యూహంతో వ్యవహరించివుంటే, టీవీకేకు, అన్నాడీఎంకేకు, బీజేపీకి, తమిళులకు కూడా లాభదాయకంగా ఉండేది. వారి అత్యాశను స్టాలిన్ వ్యూహాత్మకంగా ఉపయోగించుకుని, అన్నాడీఎంకేని ప్రతిపక్షంగా కూడా నామమాత్రం చేసేలా పావులు కదిపారు.



ఏమైనా, రాజకీయంగా అప్రమత్తంగా ఉంటూనే.. స్టాలిన్ అనుభవాన్ని, మద్దతుని ఉపయోగిం చుకునే వినమ్రతను విజయ్ ప్రదర్శించటం ఒకరకంగా మంచిదే.
ఇక కామరాజ్, పెరియార్, అంబేద్కర్, అన్నాదురై, ఏపీజే అబ్దుల్ కలాం.. ఈ అయిదుగురిని టీవీకే ఐకాన్లుగా, తన ఎజెండాను ద్రవిడ అని కాకుండా.. తమిళంగా విజయ్ నిర్వచించారు. అదేవిధంగా, సమాజం కోసం సేవలందించిన మహిళా నేతలు వేలు నాచ్చియార్, అంజలై అమ్మాళ్‌లను కూడా ఆయన ప్రస్తావించారు. తద్వారా అన్ని పార్టీలలోని మంచినీ తాను తీసుకుంటాననని; కుల వివక్ష లేని సుపరిపాలన, ఛాందసత్వం, అరాచకంలేని రాజ్యాంగ ప్రజాస్వామ్యం, సంక్షేమం, వంశపారంపర్య రాజకీయాల కన్నా అర్హులైన సామాన్య యువత కలల్ని నెరవేర్చటం మొదలైన అంశాల చుట్టూ.. తమిళ ఐడెంటీని, జాతీయవాదాన్ని, ఆధునిక ప్రజాస్వామ్యాన్ని, ఆర్థికాభివృద్ధిని మూస ద్రవిడ భావజాలం నుండి ఆవిష్కరించారు. ఒక తెలుగు సీనియర్ పాత్రికేయుడు వ్యాఖ్యానించినట్లు, ఇది ఆధునిక పెరి యారిజం. పేరేదైనా, ఒకప్పుడు ద్రవిడనాడుగా, ఆ తర్వాత మద్రాస్ ప్రెసిడెన్సీగా, తదనంతరం తమిళనాడుగా మారిన రాష్ట్రానికి 'కొనసాగింపు – మార్పు' (కంటిన్యుయిటీ అండ్ ఛేంజ్) మార్గాన్ని విజయ్ అందించారనుకోవచ్చు. టీవీకే డబ్బు పంచకుండానే విజయ్‌ని ముఖ్యమంత్రి చేశారంటే.. ప్రజల్లో, ముఖ్యంగా యువత, అణగారిన, మైనారిటీ వర్గాల్లో ద్రవిడ మూస సాంస్కృతిక చట్రంలోని వైరుధ్యం నుండి బయటపడాలనే ధోరణి, ఇప్పుడు జరుగుతున్న అభివృద్ధి కంటే వేగంగా తాము పెరగాలని భావోద్వేగభరితంగా కోరు కుంటున్నట్లు అర్థం చేసుకోవచ్చు. దీనర్థం, 'సరైన మార్గం చూపితే, అవకాశం కల్పిస్తే, అనుకూల పరిస్థితులను నిర్మిస్తే.. ఓటు హక్కు విలువ తెలుసుకుని సద్వినియోగం గావించుకునే ధోరణి కొన్నిచోట్లయినా ప్రజల్లో మొదలైందని'. అదేవిధంగా ఓడిపోయిన అభ్యర్థులకు చాలామంది డబ్బులు తిరిగి ఇచ్చేస్తున్నారంటే– 'రాజకీయ పార్టీలు ఎంత పరాధీన మనస్తత్వాన్ని పెంచినా, ప్రజల్లో ఇంకా

ఆత్మాభిమానం ఉందని' అర్థం.

ఆర్థిక దివాళా లేకుంటే, ఎల్‌టిటిఇ ప్రాంతం సింహళ పార్టీలకు ఓటు వేసేది కాదేమో. చాలా దేశాల్లో కార్మిక శక్తిలో మహిళల పాత్ర పెరగటం వంటి మార్పులు యుద్ధాలు, సమాజంలో దీర్ఘకాల సంఘర్షణల నుండే జరిగాయి. ఉగ్రవాద మరణాలు మన దేశంలో ఎక్కువేగానీ, భారీ హింసాత్మక సంస్కృతి మన సమాజంలో విస్తృత స్థాయిలో వేళ్లూనుకోలేదు. అందువల్లే, తమిళనాడులో ఎన్నికల తీర్పుని ప్రజాస్వామ్యం ద్వారా సాధించిన అద్భుతంగానే చెప్పుకోవాలి. కొన్ని మౌలికాంశాల్లో ద్రవిడ పార్టీలు కూపస్థ మండూకాల్లా విఫలం కావటం కూడా తమిళనాడులో టీవీకే అసాధారణ విజయానికి ఒక కారణమై ఉండవచ్చు. కానీ హింస లేకుండా, ఓటు ద్వారా ఇంత పెద్ద మార్పుని తమిళ ప్రజలు చూపటం భారతదేశంలోనే కాదు, ప్రపంచంలోనే ఓ అద్భుతం. శ్రీలంకలో ఎల్‌టిటిఈ పోరాటాన్ని, దిస్సనాయకేకి తమిళ యువత ఓటు వేయటాన్ని, టీవీకే తాజా విజయాన్ని పోల్చి చూస్తే ఈ అంతర్లీన వాస్తవం మనకు అర్థమవుతుంది. ఎల్‌టిటిఇ చీఫ్ ప్రభాకరన్‌కు ముఖ్యమంత్రి హోదాలో విజయ్ నివాళులర్పించటం వివాదాస్పదమైనా.. శ్రీలంక తమిళుల, తమిళనాడు వాసుల మధ్య బాంధవ్యాన్ని మళ్లీ చర్చకు తెచ్చింది.

టీవీకేని భారీ మెజారిటీతో ప్రజలు ఎన్నుకున్నారు. తమిళనాడు ప్రజల ఆకాంక్షల్ని నెరవేర్చటం విజయ్‌కి అంత తేలిక్కాదు. ఆకాంక్షలే కాదు, ఎన్నికల హామీల్ని నెరవేర్చటం కూడా తేలిక్కాదు. జేపీ చెప్పినట్లు, ప్రజాస్వామ్యానికి ఇదొకరకంగా అవకాశం, మరో రకంగా ప్రమాదం. ఇవన్నీ భావోద్వేగపూరిత అంశాలు, తాత్కాలికమైనవి, పైస్థాయిలోని నురగలు. అసలు విషయం, ప్రజల అంతరంగంలోని ఆకాంక్ష జేపీ చెబుతున్నట్లు, వేగంగా అభివృద్ధి కోసం ఆరాటం. 11% అభివృద్ధి రేటు కూడా చాలటం లేదని తమిళనాడు ప్రజలు భావిస్తున్నారు. టీవీకే సాంప్రదాయ ద్రవిడ రాజకీయాన్ని మించి ఏదో చేస్తుందని ఆశపడుతున్నారు. టీవీకే ఎన్నికల హామీలు ద్రవిడ పార్టీలకు కొనసాగింపుగా తెలుస్తూనే ఉన్నాయి. కానీ డీఎంకే, అన్నా డీఎంకేలను మించి తననుంచి ఏమి ఆశిస్తున్నారో, టీవీకే చాలా స్పష్టంగా అర్థంచేసుకోవాలి, గుర్తించాలి, ఆ ఆకాంక్షల్ని విధానాలుగా మలచగలగాలి.


ప్రజలు తమకు మంచి జరుగుతుందనుకుంటే, డబ్బు, ప్రలోభాలతో సంబంధం లేకుండా ఓటు వేయటానికి సిద్ధపడటం, పెద్ద ఖర్చులేకున్నా 'విజిల్' (ఈల) గుర్తుకి ఓటు వేయటం వరకూ సానుకూల మార్పు. కానీ ఆలోచించి వారు విజయ్ పార్టీకి ఓటు వేశారా? వాటిని నెరవేర్చలేకపోతే ఏం జరుగుతుంది? అనేవి మాత్రం శేష ప్రశ్నలే. ప్రభుత్వ డబ్బు ను పవిత్రంగా భావిస్తాననటం, సమ్మిళిత ఆర్థికాభివృద్ధికి కీలకమైన విద్య, ఆరోగ్యం, రవాణా, తాగునీరు వంటి అంశాల మీద దృష్టి సారిస్తానని విజయ్ అన్నారు. ఇవి కేవలం నిధులు కేటాయిస్తే జరిగే పనులు కావు. అదీగాక, తాత్కాలిక తాయిలాల వల్ల అత్యధిక అప్పులున్న రాష్ట్రాల్లో తమిళనాడు మొదటిస్థానాల్లో ఉంది. ఇప్పుడు విజయ్ ఇచ్చిన హామీలు కూడా తడిసిమోపెడు ఆర్థిక భారమవుతాయి. అయితే, రాజకీయ సంకల్పం, ప్రభుత్వోద్యోగ వ్యవస్థ ద్వారా పనిచేయించగలిగే స్ఫూర్తిదాయక నాయకత్వ లక్షణాల్ని ప్రదర్శించటం, వివిధ రంగాల నిపుణుల సలహాలను విధానాలుగా మలిచే చాతుర్యం, భేషజాలులేకుండా స్వీకరించే వినమ్రత, ప్రత్యర్థులను సైతం మెప్పించే సేవాతత్పరత ఉంటే అసాధ్యం కాదు. పరిపాలనాపరంగా సంస్కరణల్ని సమర్థంగా అమలు చేస్తే, ఆర్థిక సంక్షోభంలో సైతం విజయ్ తనదైన ముద్ర వేయవచ్చు. హామీల్ని విజయవంతంగా అమలు చేయవచ్చు. అందులో కీలకమైనది, స్టాలిన్ కృషికి కొనసాగింపుగా ప్రజలూ భావించేది, ఇతర రాష్ట్రాలనూ ఆకర్షించేది ఫెడరలిజాన్ని మూడో అంచెకి విస్తరించటం.

డీఎంకే, అన్నాడీఎంకే, చివరికి బీజేపీలు చేయలేని, భారతదేశానికి అత్యంత కీలకమైన స్థానిక ప్రభుత్వాల సాధికారతను, రూర్బన్ సదుపాయాల కల్పనతో చిన్న పట్టణాల అభివృద్ధిని ఆ రకంగా సాధించి చూపవచ్చు. విద్య, ఆరోగ్యం, తాగునీరు వంటి వన్నీ అక్కడ బలమైన స్థానిక ప్రభుత్వాల ద్వారా సాధించవచ్చు. మద్యనియంత్రణ, మాదక ద్రవ్యాలు, అసాంఘిక శక్తుల కట్టడి మొదలైనవి స్థానికంగా మహిళా కమిటీలకు అప్పగించవచ్చు. అయితే ఇది వేళ్లూనుకుని విస్తరించాలంటే – సినిమాలోలా మార్పులు సీన్ మారిన వెంటనే సాధ్యమవుతాయనుకోవటం అపోహేనని ప్రజలకు అర్థమవటం అవసరం. దీనికి సరైన పరిష్కారం – స్థానిక ప్రభుత్వాలకు సాధికారతనిచ్చి, వార్డు స్థాయి నుండి అత్యున్నత స్థాయి వరకూ ప్రజలకు ఎన్నికల మధ్య భాగస్వామ్యం కల్పించటం; ఆర్థికాభివృద్ధిని నష్టపరచకుండా ఉత్పాదక సంక్షేమంతో ప్రజలందరి ఆదాయాలను పెంచటం. దీని వల్ల క్రమంగా తమ ఓటుకు, ప్రజాస్వామ్యానికి– తమ జీవితాలకు మధ్య సంబంధం వారికి అనుభవపూర్వకంగా అర్థమవుతుంది.

భారీ మూల్యం చెల్లించాకగానీ, ఆర్థికాభివృద్ధి విలువను అర్థం చేసుకోలేని శ్రీలంక తమిళులకు భిన్నంగా, ప్రజాస్వామ్య ప్రక్రియ ద్వారా ఆ ఆకాంక్షను ప్రదర్శించినందుకు మాత్రం తమిళనాడు ప్రజల్ని అభినందిస్తూ ఈ మార్పును సుస్థిరంగా, ఇతర రాష్ట్రాలూ అనుసరించదగిన పరిణతి మార్పుగా కొనసాగించాలని కోరుకుందాం. ఇక ఈ ఎన్నికల్లో మరో ఆసక్తికర అంశం. మన ఫస్ట్–పాస్ట్–ది–పోస్ట్ సిస్టం (ఎఫ్.పి.టి.పి) విధానంలో మూడు పార్టీలు– డీఎంకే, అన్నా డీఎంకే, టీవీకే .. ఎన్నికల్లో బలమైనవిగా ఆవిర్భవించటం. మూడో పార్టీ పట్ల ప్రజల్లో అంచనా లేకపోవటం వల్ల జరిగిందా, ఈ ఎన్నికల వ్యవస్థను కూడా సక్రమంగా వినియోగించుకునే వారి సంఖ్య ప్రజల్లో క్రమంగానైనా పెరుగుతోందా? అనేవి నిపుణులు అధ్యయనం చేయాల్సిన అంశాలు.

❖

# సమాజంలో ఆలోచన, ఆచరణ కోసం తపించిన ధన్యజీవి ఉప్పల గోపాలరావు



జాతీయోద్యమ ప్రభావం క్రమంగా క్షీణిస్తూ అరాచక, వ్యక్తిగత ధోరణులు పెరుగుతున్న కాలంలో మౌన ప్రేక్షకుడిగా మిగిలి పోకుండా తెలుగునాట హైదరాబాద్ సహా కొన్ని ప్రాంతాల్లో సంఘటిత దిద్దుబాటు కార్యక్రమాల్ని ప్రారంభించిన చైతన్యశీలి ఉప్పల గోపాలరావు(ఉగోరా) అని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్.డి.ఆర్), లోక్ సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ ఘన నివా ళులర్పించారు. ఆయనకు పెద్ద చదువు లేదని.. కానీ సమాజంలో పరిణామాలు, ఉద్యమాల మధ్య పెరగటం ఆయనకు సునిశిత పరిశీలనా శక్తిని, సామాజిక సోయిని అందించిందన్నారు.

చాలామందిలా ఆయన సాంప్రదాయ రాజకీయ ప్రవాహంలో కొట్టుకుపోకుండా వాస్తవాల్ని గుర్తించే ప్రయత్నం చేశారు. కేవలం ఆటగాళ్లను మారిస్తే చాలు అనే భ్రమ నుండి తన ఉద్రేకాన్ని, ఉద్వేగాల్ని ఆలోచన వైపు మళ్లించారు. దేశంలోని సమస్యలకు లోపం వ్యక్తుల్లో, ప్రజల్లో కాకుండా వ్యవస్థల్లో ఉందని గుర్తించారు. వ్యవస్థల నిర్మాణం చేయాల్సిన నేతలు.. అధికారానికి, అక్రమ సంపాదనకి బానిసలై స్వతంత్ర దేశంలోనూ ప్రజల్ని పరాధీనులుగా, యాచక ప్రవృత్తి గలవారిగా కొనసాగిస్తున్నారని అర్థం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో.. ప్రజల్లో అవగాహన పెంచటం, పౌరసత్వ భావనను పెంపొందించటం, ప్రభుత్వం చేత పనిచేయించటం కోసం ఉగోరా సంఘటిత కృషిని ప్రారంభించారు. పలు సందర్భాల్లో ఆయనే ఒక సైన్యంలా పనిచేశారు.

ఒక స్పష్టమైన అవగాహనతో నిర్దిష్ట అంశాలపై పనిచేయటం వల్ల పలువురు ఇతర ఉద్యమకారుల వలే ఆయన శక్తియుక్తులు వృథా కాలేదు. సుపరిపాలన, రవాణా, ఓటు, ఎన్నికల సంస్కరణలు, పర్యావరణం మొదలైన అంశాలపై ప్రజల్లో చైతన్యం తేగలిగారు, కొంతమేర ప్రభుత్వ యంత్రాంగాన్ని, మీడియానీ కదిలించగలిగారు.

వ్యక్తిగతాన్ని, సమాజహితాన్ని సంధానం చేసుకుంటూ సాటి పౌరులకు మార్గం చూపేందుకు, నాయకత్వం అందించేందుకు కృషి చేశారు. దేశ నిర్మాణం అంటే ముఖ్యమంత్రి, ప్రధానమంత్రుల స్థాయిలో పనిచేయాలనే భ్రమను కూడా ఆయన ప్రదర్శించలేదు. తన చుట్టూ ఉన్న సమస్యలపై స్పష్టంగా, హేతుబద్ధంగా పనిచేశారు. సీనియర్ సిటిజన్స్ అనుభవాన్ని, శక్తిని కూడా ఉత్పాదక శక్తులుగా మలిచారు. తన ప్రజా ఆలోచనా వేదిక సంస్థ ద్వారా వివిధ కార్యక్రమాలతో ప్రజల్లో ఆలోచనను, చర్చను పెంచే ప్రయత్నం చేశారు. ఇం దుకోసం సొంత డబ్బు ను కూడా వెచ్చించారు. ఎంతోమందిని నాయకులుగా తయారుచేయాలని తపించారు. విద్యార్థులలో మెరిటోక్రసీని ప్రోత్సహిస్తూ నగదు సహాయం చేశారు.

మన చుట్టూ ఉన్న సమస్యలపై హేతుబద్ధంగా, వాస్తవాల ఆధారంగా స్పందిస్తూ పరిష్కారంలో భాగమవటం. ఓటుకు, మన జీవితానికి మధ్య సంబంధాన్ని అర్థం చేసుకుని సమర్థులు, నిజాయతీపరులకు ఓటు వేయటం. ప్రభుత్వ కార్యాలయాల్లో సేవలను హక్కుగా పొందటం. చట్టబద్ధ పాలనలో భాగమవటం. అలాగే రాజకీయ పార్టీలకు బానిస కావద్దని ఉగోరా స్పష్టమైన సంకేతం ఇచ్చారు. ఒకే దేశంలో, ఒకే ప్రజల కోసం, ఒకే లక్ష్యాల కోసం పనిచేస్తున్న మనం ఒకరి నొకరు శత్రువుల్లా చూసుకోవటం తగదని చెబుతుండటంతోపాటు సానుకూల సామాజిక సంస్కృతిని ఆచరణలో చూపారు. ఉమ్మడి లక్ష్యాల కోసం, సమాజ హితం కోసం అనేకమంది వ్యక్తులు, సంస్థలతో కలిసి పనిచేశారు. ప్రముఖుల నుంచి సామాన్య ప్రజల వరకూ ఎవరితోనైనా కలిసి పనిచేసేవారు. లోక్‌సత్తా నిర్వహించిన అనేక కార్యక్రమాల్లోనూ భాగమయ్యారు. ఉగోరా తన కృషిని సంకలనం చేస్తూ వెలువరించిన పుస్తకంలో కూడా తనను తాను ఒక సామాజిక స్పృహ గల కార్యకర్తగానే చెప్పుకోవటం ఆయన వినమ్రతకు సంకేతం.


స్వతంత్ర భారతదేశంలో మనం సాధించిన విజయాలతో పోలిస్తే సాధించాల్సింది చాలా ఎక్కువ కాబట్టి సాధించిన విజయాల్ని సాధారణంగా పెద్దగా పట్టించుకోం. కానీ ఉగోరా పుస్తకం చూస్తే ఇన్ని చేశారా? అనిపించకమానదు. సాధించాల్సిన పెద్ద లక్ష్యాలకు ప్రేరణనివ్వటానికి సాధించిన విజయాల్ని మననం చేసుకోవటం కూడా ఒక్కోసారి అవసరం.

ఉప్పల గోపాలరావు మృతి సమాజానికి తీరనిలోటు. తమ వ్యక్తిగత జీవితాన్ని చూసుకుంటూనే చుట్టూ ఉన్న సమాజం కోసం కొద్ది సమయం, వనరులు కేటాయించాలి అనే ఆచరణ సాధ్య సందేశాన్ని ఉప్పల గోపాలరావుగారి జీవితం నుంచి యువత తీసుకుంటారని ఆశిస్తూ ఉగోరాకు మనందరి తరపున మనసు లోతుల్లో నుండి అంజలి ఘటిస్తున్నాను" అని జేపీ పేర్కొన్నారు.

❖

# తెలంగాణలో 'ఫ్యూచర్ మైండ్స్' సిద్ధమవ్వాలి: జేపీ






సృజనాత్మక స్వేచ్ఛను సద్వినియోగం గావించుకునే సామర్థ్యాన్ని పెంపొందించుకున్న విద్యార్థులదే భవిష్యత్తు' అని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్.డి.ఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయ ప్రకాష్ నారాయణ్ అన్నారు. హైదరాబాద్ టీహబ్‌లో జరిగిన కాగ్నిఛాంప్ ఇండియా స్కాలర్‌షిప్–తెలంగాణ 2026లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తెలంగాణలో విద్యారంగానికి కొత్త దిశను సూచిస్తూ లక్షకుపైగా విద్యార్థుల భాగస్వామ్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంపికైన టాప్ 100 యువ మేధావులు, వారి తల్లిదండ్రులు, ప్రముఖ విద్యావేత్తలు, పరిశ్రమ నాయకులు, పాఠశాలల ప్రతినిధులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. తెలంగాణ ఇప్పటికే సాంకేతికత, ఆవిష్కరణల్లో దేశానికి నాయకత్వం వహిస్తోందని.. ఇప్పుడు కాగ్నిటివ్ నైపుణ్యాల సన్నద్ధతలోనూ ముందుండాల్సిన సమయం ఆసన్నమైందని జేపీ అన్నారు. “అంతర్జాతీయ మార్కెట్‌లో లావాదేవీలుండే సంస్థలు మార్కులను ఎక్కువగా పట్టించుకోవు. సమస్యలను ఎలా ఆలోచిస్తారు, ఎలా పరిష్కరిస్తారు అంశాలను ఎక్కువ పరిశీలిస్తాయి. అలాంటి 'ఫ్యూచర్ మైండ్స్' తెలంగాణలో సిద్ధమైతే.. ప్రపంచ సంస్థలు తమ తదుపరి ఆవిష్కరణ కేంద్రాలకు రాష్ట్రానికే ప్రాధాన్యతనిస్తాయి.“ప్రతి బిడ్డా తెలివైనదే. కానీ ప్రతి బాలికా ఒకే విధంగా నేర్చుకోలేదు. కొంతమంది పిల్లలు చూసి నేర్చుకుంటారు. కొం దరు తర్కం ద్వారా అర్థం గావించుకుంటారు. మరికొందరు సృజనాత్మకత, ఇతరులతో మాటామంతీ, చర్చ, సమాచార విశ్లేషణలో అసాధారణ ప్రతిభ చూపుతారు. అందరికీ ఒకే విధమైన, మూస పద్ధతిలో బట్టీపట్టే విద్య కొనసాగటం వల్ల అనేకమంది పిల్లల అసలు సామర్థ్యం వికసించటం లేదు. “ఏఐ ఆధారిత కాగ్నిటివ్ ఇంటెలిజెన్స్ వేదిక.. విద్యార్థుల సహజ ఆలోచనాశైలి, నేర్చుకునే విధానం, సమస్య పరిష్కార సామర్థ్యం, విశ్లేషణ నైపుణ్యం, అవసరమైన సందర్భాల్లో నాయకత్వ లక్షణాలను ప్రదర్శించటం మొదలైన అంశాలను శాస్త్రీయంగా విశ్లేషించి వారి అసలు కాగ్నిటివ్ బలాన్ని గుర్తించటానికి ఉపయో గపడుతుంది” అని జేపీ అన్నారు. తెలంగాణ ఫ్యూచర్ రెడీ టాలెంట్ హబ్‌గా మారుతుందని, గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్లు (జీసీసీ) కార్యాలయాలకు తెలంగాణకు మరింత ప్రాధాన్యత నిస్తాయని కాగ్నిటివ్ స్కోర్ ఏఐ ఫౌండర్స్ కీర్తి కుమార్ జైన్, విక్రమ్ సింగ్ నెగి పేర్కొన్నారు. ప్రపంచస్థాయి ఇన్నోవేషన్ ఎకో సిస్టంకి తెలంగాణ కేంద్రంగా నిలుస్తుందన్నారు. 'మార్క్ష్ ఎకానమీ' నుండి రాష్ట్రం 'మైండ్ ఎకానమీ' వైపు అడుగులు వేస్తోందన్నారు.

# కేజీహెచ్, విమ్స్‌పై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలి: భీశెట్టి బాబ్జీ

ఉత్తరాంధ్ర ప్రజలకు గణనీయ వైద్యసేవలు అందిస్తున్న విశాఖ కేజీహెచ్, విమ్స్ ఆస్పత్రుల పనితీరుపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని లోక్‌సత్తా ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. వైజాగ్ ఎంవీపీ కాలనీలోని లోక్‌సత్తా కార్యాలయంలో జరిగిన జిల్లా నియోజకవర్గాల అధ్యక్షుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేజీహెచ్, విమ్స్‌లో ఊహించని స్థాయిలో రోగుల సంఖ్య పెరిగిపోతోందన్నారు. మౌలిక వసతులు లేక డాక్టర్లు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారన్నారు. అన్నీ ఉచితం అని చెబుతున్నా పేదలు ప్రాణాలకు భరోసా లేదన్నారు. త్వరలో లోక్‌సత్తా ఈ రెండు ఆస్పత్రుల తీరుపై సమగ్ర అధ్యయనం చేసి ప్రభుత్వానికి పరిష్కారాల నివేదికను అందిస్తుందన్నారు. త్వరలో ప్రారంభించనున్న 'సంజీవని' పథకంలో భాగంగా లోక్‌సత్తా ప్రతిపాదిస్తున్న 'ఫ్యామిలీ డాక్టర్' పర్యవేక్షణలో ఏఐ డాక్టర్ పనిచేస్తారనటం సంతోషకరమన్నారు. నాణ్యమైన వైద్యం రాష్ట్ర ప్రజలందరికీ తక్కువ ఖర్చుతో అందించేందుకు లోక్‌సత్తా రూపొందించిన నమూనా ఎంతో ఉపయోగపడుతుందని, పొరపాట్లకు ఆస్కారం లేకుండా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ బృందంతో ముఖ్యమంత్రి సమావేశం ఏర్పాటు చేసి సమగ్ర ఆరోగ్య విధానాన్ని ఖరారు చేయాలన్నారు. భారత్‌కి ఒక నమూనాను అందించాలన్నారు.

కార్యక్రమంలో హ్యాపీ లైఫ్ సంస్థ అధ్యక్షుడు ఎ. జ్ఞానేశ్వరరావు, దొంకాడ వెంకటేశ్వరరావు, రెడ్డి మురళీధర్, గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో చట్టబద్ధపాలన.. స్థానిక కోర్టుల ఏర్పాటుకు ముందడుగేది?

మన దేశంలో పెట్టుబడులు ఎక్కువ వస్తున్న రాష్ట్రాలకు, తక్కువగా ఉన్న రాష్ట్రాలకు మధ్య ఇతరత్రా కారణాలతోపాటు ఒక ప్రధాన అంశంలో తేడా కనిపిస్తుంది. అది చట్టబద్ధపాలన. అసలు భారత్‌లో ఏ రాష్ట్రంలోనైనా చట్టబద్ధపాలన ఉందా? అంటే నీళ్లు నమలాల్సిందేగానీ.. ఉన్నంతలో కొంత పద్ధతిగా వ్యవహరిస్తారు అనుకున్న రాష్ట్రాలకి ఎక్కువ ప్రాధాన్యత ఉంటుంది. ఈ విషయం బాగా అర్థం కావాలంటే– గతంలో తమిళనాడులో డీఎంకే, అన్నా డీఎంకేల మధ్య నేతల వస్త్రాపహరణం ఘటనలు, ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో వైకాపా ఆధ్వర్యంలో పరిణామాలు, తెదేపా కూటమి పాలనలో స్పందన చూస్తే అర్థమవుతుంది.

ఇప్పుడు మనం మాట్లాడుకునే తెలంగాణ విషయానికొస్తే.. ఉన్నంతలో దేశంలో సమర్థవంతమైన పోలీసులుగా రాష్ట్ర రక్షక భటులకు పేరుంది. హైదరాబాద్ ఆర్థిక వ్యవస్థ అవసరంరీత్యా, బహుశా ఆ ప్రొఫెషనలిజం పెరిగి ఉండ వచ్చు. ఇదే సమయంలో రాజకీయ జోక్యం తగ్గిందనటానికి ఆధారాలు లేవు. ఫోన్ ట్యాపింగ్, ఎన్నికల సమయంలో అధికార పార్టీ తరలించే డబ్బు మూటల్ని వదిలేసి, ప్రతి పక్షాల వారివి పట్టుకోవటం వంటివన్నీ పోలీసుల కను సన్నల్లోనే జరిగాయనే ఆరోపణలున్నాయి. ఎన్నికల్లో స్వాధీనం చేసుకున్న కోట్ల రూపాయలు ఏమయ్యాయనే సందేహాన్నీ ఇంతవరకూ ఎవరూ తీర్చలేకపోయారు. ఇటీవల రెండు సంఘటనలు తెలంగాణ పోలీసు యంత్రాంగానికి సంబంధించి ప్రజల్లో ఆసక్తి రేకెత్తించాయి.

ఒకటి, యూనియన్ హోం శాఖ సహాయ మంత్రిగా ఉన్న బండి సంజయ్ కుమారుడు భగీరథ ఓ అమ్మాయి పట్ల అనుచితంగా వ్యవహరించటమేకాక, దాడికి పాల్పడ్డారనే ఆరోపణలకు సంబంధించినది. రెండోది, మల్కాజిగిరి కమిషనర్ ఆఫ్ పోలీస్‌గా ఉన్న సుమతి దిల్‌షుక్‌నగర్ వద్ద ఒక బస్టాప్‌లో రాత్రి 12 గంటల నుండి 3.30 వరకు సాధారణ మహిళలా నిలబడి, డజన్ల కొద్దీ కుర్రాళ్ల అసభ్య పదాలను, ఈవ్ టీజింగ్‌ను భరించటం. దగ్గర్లోనే మఫ్టీలో ఉన్న పోలీసు బృందాలు ఉన్నాయనుకోండి. ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి ఉన్న వేదిక మీద హోం శాఖ సహాయమంత్రి ఉంటే, ఆయన కుమారుడిని విచారించే సాహసం ఏ పోలీసు చేయగలడు? అని కొందరు సందేహాలు వ్యక్తం చేసినా, చివరికి నాటకీయ పరిణామాల మధ్య పోలీసులు అరెస్ట్



చేశారు. ఈ విషయంలో పోలీసులు రాజును మించిన రాజభక్తిని ప్రదర్శించారనేది వాస్తవం. అంతకుముందు, ఒక ప్రయివేటు ఇంజినీరింగ్ కళాశాలలో ఈ కుర్రాడి మూలంగా పెద్ద వివాదం రేగితే సద్దుమణిగేలా చేశారు. సోషల్ మీడియాలో, సమాజంలో ప్రచారం కోసం నేతలు ప్రదర్శించే రాజకీయ సంస్కృతి, వాడే భాష వారి పిల్లల్నీ ప్రభావితం చేస్తే ఇలా జరగటానికి ఆస్కారాలు ఎక్కువ ఉంటాయి. బీజేపీ పార్లమెంటరీ బోర్డు సమావేశంలో ప్రధాని మోదీ కూడా బండి సంజయ్‌ని పిలిచి ప్రశంసించారు. కానీ ఆయన భాష గురించి, తెలంగాణలో కొత్తగా కట్టిన సచివాలయాన్ని కూల్చిపారేస్తాం లాంటి ప్రకటనల గురించి ఏమీ అనలేదు. చివరికి న్యాయస్థానాలు కూడా.. 'రాజకీయాలలో ఉన్నప్పుడు అంత సున్నితంగా ఉంటే ఎలా? రాజకీయ విమర్శకి, వ్యక్తిగత నిందలకు పెద్ద తేడా ఉండదు గదా?' అని వ్యాఖ్యానిస్తున్నాయి. అన్ని రంగాలకూ తల్లి వేరు వంటి రాజకీయాల్లో రోల్‌మోడల్స్ గురించి కాగడా వేసి వెతుక్కోవాల్సిన రోజులు వస్తాయని జాతీయోద్యమనేతలు, రాజ్యాంగ నిర్మాతలు ఊహించివుండరు. భగీరథ కేసులో న్యాయస్థానం ఏం చేస్తుందో వేచిచూద్దాం. కానీ రాజును మించిన రాజభక్తిని ప్రదర్శించటం తప్పు.. తమకు జీతమిచ్చే ప్రజలకు, తాము ప్రమాణం చేసిన భారత రాజ్యాంగానికి పోలీసులు జవాబుదారీగా వ్యవహరించకపోవటం మాత్రం స్పష్టంగా కనిపిస్తోంది.

ఇక సుమతి మేడమ్ విషయం. కొందరు బందిపోటు దొం గల్ని సినీ ఫక్కీలో ఛేజ్ చేసి పట్టుకోవటంతోపాటు, నక్సల్స్‌ని అదుపు చేయటంలో ఆమె చాలా ధైర్యంగా, సమర్థంగా వ్యవహరించారని రికార్డులు చెబుతున్నాయి. ఆ తర్వాత రాష్ట్ర ఆవిర్భావ సమయంలో హడావుడి అనంతరం చాలా కాలం నిశ్శబ్దంగా ఉన్నాక, మల్కాజిగిరి సీపీ అయ్యారు. అతి విస్తారమైన కమిషనరేట్‌గా పేరొందిన మల్కాజిగిరిలో ఫిర్యాదులను పరిశీలించి ఆకతాయిల బెడదను

నియంత్రించాలని ఆమె భావించివుండవచ్చు. కానీ నాలుగు గంటల్లో అంతమంది అలా అర్థరాత్రి స్వైరవిహారం చేస్తుంటే, ఆమె తీసుకున్న చర్య – వారిలో ఎక్కువమందికి కౌన్సెలింగ్ ఇవ్వటం. మరుసటి రోజు ప్రెస్ మీట్ పెట్టి, పెట్రోలింగ్ పెంచటం, మహిళలు ధైర్యంగా ఫిర్యాదు చేయటం వంటి సలహాలివ్వటానికే పరిమితమయ్యారు.

హైదరాబాద్‌లో నేరాలను అదుపు చేయటంలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషించాయి. వాటిని ఏర్పాటు చేయటంలో లోక్‌సత్తా చేసిన ఉద్యమం కీలక పాత్ర పోషించింది. ఆ తర్వాత దేశంలోనే అత్యధిక సీసీ కెమెరాలు కలిగిన నగరంగా హైదరాబాద్ పేరొందింది. నగరంలో సుమారు 5.85 లక్షల సీసీ కెమెరాలుంటే, ఈవేళ వాటిలో సగానికిపైగా పనిచేయటం లేదట. అదే విధంగా పార్కుల్లో మొదటి దశలో భాగంగా 8 వేల సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అవీ సక్రమంగా పనిచేయటం లేదు. చాలా తక్కువ ఖర్చుతో చేయగల పరిష్కారమది. రాష్ట్రానికి ప్రతిష్టాత్మకమైన కమాండ్, కంట్రోల్ సెంటర్‌కి మొదటి లేయర్‌గా ఉండే ఈ కెమెరాలు పనిచేయకున్నా వారూ పట్టించుకోలేదు.

ఇంకోటి, లోక్‌సత్తా కృషి వల్లే 2009లో గ్రామ న్యాయాలయాల చట్టం వచ్చింది. ముఖ్యమంత్రిగా ఎన్.టి రామారావు స్వహస్తాలతో డ్రాఫ్ట్ చేసిన ఆ ఆలోచనను, జేపీ జాతీయ స్థాయిలోకి తీసుకెళ్లి పార్లమెంటు ద్వారా ఏకగ్రీవ ఆమోదం సాధించారు. పేరుకి అది గ్రామ న్యాయాలయాల చట్టం గానీ, దాన్నుంచి పట్టణ ప్రాంతాల్లో స్థానిక కోర్టుల్ని కూడా ఏర్పాటు చేయవచ్చు. వీటి ద్వారా ఈవ్ టీజింగ్ వంటి చిన్న నేరాలకు పాల్పడే వారిని తొలిదశలోనే అదుపు చేయవచ్చు. దిల్‌షుక్‌నగర్‌లో హాస్టల్ పిల్లలు ఇలాంటి ఆకతాయి పనులు చేశారని చెబుతున్నారు. వారి మీద కేసులు ఫైల్ చేసి, కెరీర్‌ను నాశనం చేయాలని ఎవరూ చెప్పరు. కానీ అలాంటి వారిని మొదట్లోనే నియంత్రిం చకపోవటం వల్లనే మహిళలపై అత్యాచారాల దాకా నేరాలు జరుగుతున్నాయి. నియంత్రించటమంటే, సింగపూర్‌లోలా చేయవచ్చు. అంటే, ఆ కేసును స్థానిక కోర్టుల్లో ఒక వారం రోజుల్లో తేల్చేస్తారు. ఈవ్‌టీజింగ్ వంటి నేరాలకు పాల్పడ్డవారికి కొందరికి హెచ్చరిక సరిపోవచ్చు, ఇంకొం దరికి ఓ పాతిక కొరడా దెబ్బలు విధిస్తారు. అయినా.. ఆ తర్వాత రెండు, మూడు సార్లు చేస్తే, అప్పుడు చదువుతున్న కాలేజీ నుండి కొంతకాలం బహిష్కరించటం, ఉపాధి అవకాశాలు లేకుండా చేయటం వంటి శిక్షలు అమలు చేస్తారు. తొలిదశలోనే అలా చేయటం వల్ల అక్కడ నేరాలు తగ్గాయని అధ్యయనాలు రుజువు చేయటం వల్ల ఆ పద్ధతిని అక్కడ కొనసాగిస్తున్నారు. మనకూ ఇలాంటి సామెతలు, కథలు ఉన్నాయి. 'తోటకూర దొంగతనం నాడే చెప్పి వుంటే, జైలుకెళ్లాల్సిన పరిస్థితి వచ్చేది కాదు గదా'.. అని తల్లిని ఓ దొంగ ఆవేదనతో ప్రశ్నిస్తాడు.

ఇంట్లో, స్కూల్‌లో అమ్మాయిల పట్ల సమానత్వ భావం, గౌరవ భావం ఉండేలా పెంచాలని, బోధించాలని సమాజం పట్ల కాస్త అవగాహనగల ప్రతి ఒక్కరూ చెబుతారు. మహి ళలను అణగదొక్కాలని ప్రయత్నించటమంటే, మనం అణగి పోవటమే.. అని మహాత్మాగాంధీ అనుభవపూర్వకంగా చెప్పారు. కానీ మనింటి దగ్గర్నుంచి తరగతి గది వరకూ అమ్మాయిలు, అబ్బాయిలు వేర్వేరు అన్నట్లు సాకుతాం. జేపీ లాంటి వారు లేఖలు రాసినా, సుప్రీంకోర్టు మొట్టికా యలు వేసినా ఇప్పటికీ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో ఒక్కటంటే ఒక్క గ్రామ న్యాయాలయం లేదా స్థానిక కోర్టు ఏర్పాటు కాలేదు. హైదరాబాద్ ఈ విషయంలో మిగిలిన మహానగరాలకు మార్గం చూపాలి. పట్టణీకరణ పెరుగుతున్న కొద్దీ, ఇలాంటి వ్యవస్థీకృత ఏర్పాట్లే ప్రజలకు నిజమైన భద్రతను, తద్వారా ఆర్థికాభివృద్ధిని అందిస్తాయి. స్థానిక కోర్టుల ద్వారా రూ.2 లక్షల వరకు క్రిమినల్ నేరాలు, కొన్ని రకాల సివిల్ కేసులను కూడా వేగంగా పరిష్కరిం చవచ్చు. ఖర్చు కూడా ఉండదు. దీనివల్ల న్యాయస్థానాల మీద కేసుల భారం కూడా తగ్గుతుంది. స్థానిక కోర్టులను ఏర్పాటు చేసి షీటీమ్స్, ఇతర మహిళా విభాగాలతో సమన్వయం గావించు కుంటూ.. ఈవ్‌టీజింగ్‌ను చట్టబద్ధపాలన పటిష్ఠంగా అమలు చేయటం ద్వారా ఎదుర్కొనేందుకు చొరవ చూపాలి. 'హైడ్రా' మీదయినా విమర్శలు ఉన్నాయిగానీ.. అంతకంటే ఎక్కువ పేరు స్థానిక కోర్టుల ద్వారా విమర్శలు లేకుండా తెలంగాణ పోలీసు విభాగం సాధించగలుగుతుందనటంలో సందేహం లేదు.

అదేవిధంగా డీజీపీగా నియమితులైన సీవీ ఆనంద్ బండి సంజయ్ కుమారుడి హైప్రొఫైల్ కేసులో సరిగా స్పందించలేదని ఆరోపణలు ఎదుర్కొన్నారు. కనీసం నేర పరిశోధనా విభాగంలో రాజకీయ జోక్యం లేకుండా వ్యవహరించే సామర్థ్యాన్ని డీజీపీ ప్రదర్శించాలి. ఇందుకు రాజకీయ నాయకుల్ని ఒప్పించలేకపోతే, పౌర సమాజం సహాయం తీసుకుని, ప్రజల్ని సమీకరించవచ్చు. చట్టం అమలు, ట్రాఫిక్ నిబంధనల అమలు వంటి విషయాల్లో రాజీలేకుండా ఎలా వ్యవహరించాలో కేరళం పోలీసుల నుండి కొన్ని పాఠాల్ని తెలంగాణ యంత్రాంగం అధ్యయనం చేయవచ్చు. అక్కడ ఏ పార్టీ అధికారంలో ఉన్నా, పోలీసుల విషయంలో కొన్ని స్వీయనియంత్రణల్ని పాటిస్తారు. అదేవిధంగా కమ్యూనిటీ పోలీసింగ్ పేరుతో ప్రజలనూ భాగస్వాముల్ని చేస్తారు. ఇవన్నీ మన వద్దా అవసరం. అదేవిధంగా, పోలీసులు ఎంత సమర్థంగా వ్యవహరించినా, ప్రాసిక్యూషన్ కూడా సమర్థంగా, నిష్పాక్షికంగా వ్యవ హరించాలి కాబట్టి.. అక్కడా రాజకీయ జోక్యం లేకుండా స్వతంత్ర ప్రాసిక్యూషన్ ఏర్పాటు అవసరం. ❖

# పన్నెండేళ్ల తెలంగాణ, ఆంధ్రప్రదేశ్..
# గతం కంటే భవిష్యత్తు కీలకమైన సంధి దశ

తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 12 ఏళ్లు పూర్తయ్యాయి. పుష్కర కాలం ప్రత్యేకమైనదేగానీ, ప్రతి వార్షికోత్సవ సమీక్షా విలువైనదే. తెలంగాణ ఏర్పడిన జూన్ 2న.. ఇన్నేళ్లలో వివిధ రంగాలలో కృషిని, లోపాలుంటే వాటిని ఎక్కువగా విశ్లేషించుకుని, భవిష్యత్తుకి సంకల్పం చెప్పుకోవటం ఆనవాయితీ. కానీ 2026 సంవత్సర తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం అంతకంటే భిన్నమైనది. గతం కంటే, భవిష్యత్తును గురించి ఎక్కువ మాట్లాడుకోవాల్సిన దశలో ఈవేళ రాష్ట్రం ఉంది.

ఒక ఉద్యమ నేపథ్య రాష్ట్రం ఆర్థిక శక్తిగా జాతీయ స్థాయిలో గుర్తింపు పొందటం తెలంగాణ విలక్షణతగా పేర్కొనవచ్చు.

ఏ గతం తెలంగాణ ఉద్యమాన్ని ప్రేరేపించిందో.. ఆ గతం కంటే ఎక్కువగా ఈవేళ అభివృద్ధి, ఆదాయాలు, నాణ్యమైన విద్యను అందించే మంచి పాలన గురించి రాష్ట్ర ప్రజలు మాట్లాడుతున్నారు. తెలంగాణ ఉద్యమంలో అన్ని వర్గాలకూ ఆమోదయోగ్య పౌర సమాజ ప్రముఖునిగా గుర్తింపు పొందిన ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ కోదండరాం తాను స్థాపించిన తెజస పార్టీ నాలుగవ ప్లీనరీలో మాట్లాడుతూ, "కేవలం పాలకులు మారటం కాదు.. పరిపాలనా విధానం మారాలన్నదే మా లక్ష్యం. సమాజంలో అనేక సమస్యలకు రాజకీయ వ్యవస్థే ఏకైక పరిష్కార వేదిక. అది మలినమైతే సామాన్యుడి కష్టాలకు పరిష్కారం లభించదు" అన్నారు. ఎక్కడో విన్నట్లుంది గదా ఈ మాటలు. అవును. ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్.డి.ఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ దశాబ్దాలుగా ఎన్నోసార్లు చెప్పిన, చెబుతున్న మాటలివి. అదేవిధంగా, తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) వ్యవస్థాపకురాలు కవిత ఇటీవల ఒక డిజిటల్ వార్తా సంస్థ నిర్వహించిన తెలంగాణ కాంక్లేవ్‌లో మాట్లాడుతూ.. 'ప్రభుత్వాల ఆటలు మారుతున్నాయిగానీ, ఆట నియమాలు మారటం లేదు' అన్నారు. అదేవిధంగా, కాళేశ్వరంలాంటి భారీ ప్రాజెక్టులు కాకుండా.. తెలంగాణలో పెద్దసంఖ్యలో ఉన్న వాగులు, కుంటలపై రైతుల భాగస్వామ్యంతోనే చెక్‌డ్యాంలు నిర్మిస్తామని తమ ఎజెండాగా చెప్పారు. ఇవీ జేపీ ఎప్పటి నుండో చెబుతున్నవే. కడెం, ధోతివాగు, పెద్దవాగు, కుష్టి వాగు, సాత్నాల వాగు.. చిన్న నీటి వనరులను సద్వినియోగం గావించుకుంటే, రూ.25 వేల కోట్లతో తెలంగాణలో వ్యవసాయం మొత్తానికీ నీరివ్వొచ్చని, భారీ ఎత్తిపోతలకు వినియోగించాల్సిన డబ్బును అన్ని జిల్లాల్లో చిన్న పట్టణాలను యువతకు ఉపాధి కేంద్రాలుగా తీర్చిదిద్దాలని జేపీ సూచించారు. ప్రాణహిత-చేవెళ్ల సమయంలోనే భారీ ప్రాజెక్టుల వల్ల ఖర్చు పెరిగి ఎలా తెలంగాణ ప్రజలకు రాబోయేకాలంలో నష్టదాయకమవుతుందో, అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డికి తెలియచేస్తే, ఒక సమావేశం ఏర్పాటు చేసి ప్రత్యామ్నాయాలు పరిశీలిస్తామన్నారు. అప్పట్లో జేపీ వాదాన్ని సమర్థించిన కేసీఆర్.. రాష్ట్రం ఏర్పడి అధికారంలోకి వచ్చాక, మాట మార్చి ప్రాణహిత-చేవెళ్లను ఇంకా విస్తరించి కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించి ఇంకా నష్టం చేశారు.



ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ఉద్యమం జరుగుతున్న సమయంలోనే " రాజకీయం మారకుండా రాజధాని మారినంత మాత్రాన మార్పు రాదు. ఆట నియమాలు మాం ˊకుండా ఆటగాళ్లు మారినంత మాత్రాన ప్రయోజనం లేదు" అని జేపీ తన ప్రసంగాలు, రచనల్లో పేర్కొన్న భావాల్ని ఇప్పుడు తెలంగాణ పౌర సమాజ నేతలు, మీడియా అందరూ అంగీకరిస్తున్నారు. కోదండరాం సార్ అవే మాటల్ని ప్లీనరీలో సందేశంగా పేర్కొన్నారు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు వల్ల ఆంధ్రప్రదేశ్‌లో కొంపలేమీ మునిగిపోలేదు, తెలంగాణలో అద్భుతాలేమీ జరగలేదు.. అన్నది ఇప్పుడు ప్రజలూ ముక్తకంఠంతో అంగీకరిస్తున్న సత్యం. ఇదంతా గతంలో భాగంగా చెప్పటం లేదు.. భవిష్యత్ తెలంగాణ మార్పులకు అవసరం కాబట్టి చెప్పాల్సి వస్తోంది. గత పుష్కర కాలంలో రాష్ట్రంలో జరిగిన పరిణామాల్లో కేవలం ఈ రాబోయేకాలానికి అవసరమైనవి మాత్రమే ప్రస్తావించుకుందాం.

2014-2023

తెలంగాణ ఉద్యమానికి నాయకత్వం అందించి, రాష్ట్రం ఏర్పడ్డాక తొలి ముఖ్యమంత్రిగా ఎన్నికైన కె.చంద్రశేఖరరావు సాధించిన మొదటి విజయం - గత వైషమ్యాలను విస్మరించి హైదరాబాద్‌లో శాంతి సామరస్యతలను పెంపొందించటం; అంతకు ముందు ముఖ్యమంత్రులు వైఎస్ రాజశేఖరరెడ్డి, చంద్రబాబు నాయుడు చేసిన అభివృద్ధిని కొనసాగించటం. దీంతోపాటు విద్యుత్ రంగంలో రాష్ట్రం స్వావలంబన సాధించేలా చేశారు. మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, రైతుభరోసా, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, డబుల్ బెడ్‌రూమ్ వంటి పథకాలను అమలు

చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ వంటి పథకాలను కొనసాగించారు.కొన్ని పథకాలు ప్రజాదరణ పొందాయి. అదే స్థాయిలో పలు విమర్శలను కేసీఆర్ సర్కారు మూటగట్టుకుంది. విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేయడం, నిరుద్యోగ సమస్య, ఒకటి రెండు నగరాలు మినహా మిగతా వాటిని పట్టించుకోకపోవడం వంటి విమర్శలు వచ్చాయి. అవినీతి అధికారులు, నేతలపై విచారణను తొక్కిపెట్టడం, కమీషన్ల కోసం తప్ప మరే సహేతుక లక్ష్యమూ కనిపించని కాళేశ్వరం ప్రాజెక్టును అతి భారీ వ్యయం తో నిర్మించటంపై సర్కారు విమర్శలు ఎదుర్కొంది.చట్టబద్ధ పాలన, గ్రామ న్యాయాలయాలు, సిటిజన్ చార్టర్ వంటి వాటి అమలు ఊసేలేదు.

2023 డిసెంబర్ నుండి..

కాంగ్రెస్ ప్రభుత్వం కేసీఆర్‌ను మించి తాత్కాలిక వ్యక్తిగత తాయిలాల్ని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చింది. హామీల్ని హేతుబద్ధీకరించి, దశలవారీగా అమలు చేయాలని జేపీ లాంటి నిపుణుల సూచనల్ని పట్టించుకోకపోవటం మాత్రం కాంగ్రెస్ ప్రభుత్వ పొరపాటే. అయితే, తెలంగాణ గతం కంటే భవిష్యత్తు ముఖ్యమైన దశలో ఉన్నామన్న అంశాన్ని రేవంత్ బాగా గుర్తించారు. 'రైజింగ్ తెలంగాణ 2047' కార్యక్రమాన్ని రేవంత్ ప్రారంభించారు. విద్యను ఎలాగైనా బాగుచేయాలనే పట్టుదలతో ఉన్నారు. పెట్టుబడులను ప్రోత్సహించటం, యూనియన్ ప్రభుత్వంతో సహకార ఫెడరల్ స్ఫూర్తితో వ్యవహరిస్తూ నిధులు రాబట్టుకోవటం, 30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మాణం, ర్యాపిడ్ రైలు మార్గాలు, మౌలిక వసతుల విస్తరణ వంటివి చొరవ తీసుకుని చేస్తున్నారు. నగరంలో ప్రజల, ప్రభుత్వ భూముల పరిరక్షణకు ఒక రక్షణ దళాన్ని ఏర్పాటు చేయాలని అసెంబ్లీలో ఉన్నప్పుడు జేపీ కోరినా, అప్పటి ముఖ్యమంత్రి చొరవ చూపలేదు. రేవంత్ ఇప్పుడు 'హైడ్రా' ద్వారా అలాంటి ప్రయత్నం చేస్తున్నారు. జీహెచ్ఎంసీ ప్రాంతంలో కనీసం 10 లక్షల కోట్ల విలువైన భూములు ఆక్రమణలకు గురయ్యాయని అంచనా. హైడ్రా ఇప్పటి వరకూ రూ. 80–100,000 కోట్ల విలువైన భూములను పరిరక్షించినట్లు అధికారులు చెబుతున్నారు.

ఈవేళ తెలంగాణ పుష్కర కాల వార్షికోత్సవమే కాదు, రేవంత్ ముఖ్యమంత్రి అయి సగం పాలనా కాలం పూర్తయింది. కానీ ఇప్పటివరకూ విద్యారంగంలో సైతం సమస్యల పరిష్కారాల అమలుకు చొరవ చూపలేకపోయారు. యంగ్ ఇండియా పాఠశాలల ఏర్పాటు సంస్కరణలా కనిపించే ఒక అసమర్థ పాలనా విధానం.

ఆరోగ్య రంగం గురించి పెద్దగా ప్రయత్నం లేదు. వితరణగా ఇచ్చిన ఆధునిక రోగనిర్ధారణ యంత్రాలను ప్రారంభించటం, గత ప్రభుత్వ హయాంలోని ఆస్పత్రులను అందుబాటులోకి తేవటం తప్ప.. విధానపరంగా చాలా తేలిగ్గా అమలు చేసే విధానాల మీద రేవంత్ దృష్టి సారించలేదు.

తెలంగాణ పన్నుల ఆదాయం 2021–22 ఆర్థిక సంవత్సరం (రూ.96,844 కోట్లు)తో పోలిస్తే 2025–26లో రూ.35,000 కోట్ల దాకా పెరిగినా, మద్యం ద్వారా ఆదాయాన్ని గత ప్రభుత్వం కంటే ఎక్కువగా జమ చేస్తున్నా.. ఎన్నికల హామీల్ని హేతుబద్ధీకరించకపోవటం వల్ల అప్పులు, రోజువారీ ఖర్చులు పెరిగిపోయాయి. ఈవేళ ఒక్క రూపాయి కూడా జమ చేయ కుండా భావితరాల మీద విపరీత భారం వేస్తూ పెరిగిపోయే పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) ప్రభుత్వోద్యోగులకు పునరుద్ధరిస్తామన్న హామీని పక్కన పెట్టటం కొంతలో కొంత ఊరట.

మూసీ నది ప్రక్షాళనను, నైట్ ఎకానమీ ప్రయత్నాన్ని అందరూ స్వాగతించినా, రూ.లక్షన్నర కోట్ల ప్రణాళిక అంటూ అర్థంలేని లీకులిచ్చి అభాసుపాలయ్యారు. పంచాయతీ ఎన్నికలను బీసీ రిజర్వేషన్లు, కులగణన చుట్టూ తిప్పారు తప్ప.. స్థానిక ప్రభుత్వాల్లో ఇప్పటికే ఉన్న 75% రిజర్వేషన్ల ద్వారా ఎన్నికైన బీసీ, ఎస్.సీ, ఎస్.టీ, మహిళలకు అధికారాలు, నిధులు లేకుండా చేశారు. తీరా ఏ రాజకీయ రిజర్వేషనూ లేకుండా 61% మంది బీసీలు సహజ నాయకత్వ సామర్థ్యంతో స్థానిక ప్రభుత్వాల్లో ఎన్నికయ్యారు. తెలంగాణలో ఆర్థిక సంక్షోభ పరిస్థితులు లేవు. కానీ మితిమీరిన, ప్రజలు అడగని తాయిలాల్ని కూడా ఇస్తూ రాష్ట్రాన్ని పాలకులే ఒడిదుడుకుల్లోకి నెడుతున్నారు. అదేవిధంగా, హైదరాబాద్‌ను విస్తరించటం తప్ప మిగిలిన తెలంగాణలో గ్రామీణులకు సమీపంలో వికేంద్రీకరణను పట్టించుకోవటం లేదు. అలాగని హైదరాబాద్‌లో కనీస సదుపాయాల్ని మెరుగుపరిచారా అంటే, అదీ లేదు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించినప్పుడు ఒక పద్ధతి ప్రకారం బస్సుల సంఖ్యను పెంచటం, ఎంఎంటీఎస్‌ను డెడికేటెడ్ లైన్స్‌లో అందుబాటులోకి తేవటం, ట్రాఫిక్ నిబంధనలను కఠినంగా అమలు చేయటం వంటి చర్యలు తీసుకుని, భారత్ ట్యాక్సీ వంటి యాగ్రిగేటర్‌లను మెట్రో తో అనుసంధానం చేసి, ఒకే టికెట్ పద్ధతిని తీసుకొచ్చి, పునరుత్పాదక ఇంధన వనరుల్ని అభివృద్ధి చేసివుంటే.. ఈవేళ హైదరాబాద్‌లో పెట్రోలు, డీజిల్ ధరలు పెరిగినా, తగ్గినా పెద్దగా ప్రజల మీద భారం పడేది కాదు. నగరం ట్రాఫిక్ సమస్యలో బెంగళూరుతో, కాలుష్యంతో ఢిల్లీతో పోటీపడే పరిస్థితి వస్తున్నా.. ఇంకా ప్రభుత్వంలో చలనం లేదు. బలమైన నాయకుడు, ముఖ్యమంత్రే రాష్ట్రానికి రారాజు, పెత్తందారీ ధోరణి వంటివి మీడియా ట్రాప్‌లే తప్ప వాటి వల్ల ప్రజలకు ఒరిగేదేమీ లేదు. ఇప్పటికైనా నిపుణులతో కూర్చుని, తక్కువ ఖర్చుతో తెలంగాణ సమాజంలో ప్రతి బిడ్డకూ అవకాశాలనిచ్చే మార్పుల్ని విద్య, ఆరోగ్యం, చట్టబద్ధపాలన, గ్రామ న్యాయాలయాల ద్వారా స్థానిక కోర్టులు, అధికార వికేంద్రీకరణ వంటి మార్పుల ద్వారా సాధించవచ్చు. ఉట్టికెగరలేదనే విషయం గుర్తించకుండా, పెద్దపెద్ద మాటలు మాట్లాడితే ప్రజలు ఎవరినీ పట్టించుకోరు. 'మీ వల్ల తెలంగాణ సమాజంలో వచ్చిన ప్రజాస్వామిక మార్పు ఏమిటి' అన్నది మాత్రమే మీ స్థానాన్ని చరిత్రలో పదిలం చేసే కార్యాచరణ. మిగిలిన సమయాన్నయినా అందుకు సద్వినియోగం గావించు కుంటే.. 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా వికసిత భారత్‌కి వాటా అందించాలన్న లక్ష్యాన్ని

నెరవేర్చాలంటే, ఇవి కనీస చర్యలు.

**ఆంధ్రప్రదేశ్**

సాంప్రదాయ రాజకీయ నాయకుల వల్ల బాగా నష్టపోయిన రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. ఈవేళ దక్షిణాదిన అతి తక్కువ తలసరి ఆదాయం కలిగివుంది. ఈ నష్టం రాష్ట్ర విభజన సమయంలో సమైక్యాంధ్ర పేరుతో కొందరు నాయకులు చేసిన దగా, అసమర్థ రాజకీయాల వల్ల ఎక్కువగా జరిగింది. రాష్ట్ర విభజన అనివార్యం అయినప్పుడు, హైదరాబాద్ అండను కోల్పోయే పరిశేష ఆంధ్రప్రదేశ్‌కి ఏం కావాలో స్పష్టంగా ప్రణాళికను ఏకాభిప్రాయంతో రూపొందించుకోవాలి. కానీ ఒక్క జేపీ తప్ప ఆ అంశాన్ని ఎవరూ పట్టించుకోలేదు. అసెంబ్లీలో జేపీ ప్రతిపాదించిన రోడ్‌మ్యాప్‌కి రాష్ట్ర విభజన చట్టంలో, ప్రధానమంత్రి హామీల్లో చోటు కల్పించారు. ఆ తర్వాత కూడా రెవెన్యూలోటు భర్తీ, ప్రత్యేక హెూదాకి సంబంధించి ప్రతిష్టంభన కొనసాగుతుంటే.. జాతీయ స్థాయి స్వతంత్ర నిపుణుల కమిటీని లోక్‌సత్తా ఏర్పాటు చేసి ప్రామాణిక నివేదికను యూనియన్, రాష్ట్ర ప్రభుత్వాలకి, అన్ని పార్టీలకీ అందించింది. కానీ పార్టీ రాజకీయం ఎక్కువ, ప్రజా పాలన తక్కువ కావటంతో.. ఏపీకి మొదటి ముఖ్యమంత్రి అయిన చంద్రబాబు అవకాశాన్ని సద్విని యోగం గావించుకోలేకపోయారు.

రాజధాని నిర్మాణానికి భూసేకరణ అభినందనీయమని, అయితే రాజధానితో సంబంధంలేకుండా అమరావతిని గ్రీన్‌ఫీల్డ్ సిటీగా అభివృద్ధి చేయాలని జేపీ చెబితే చంద్రబాబు పెడచెవిన పెట్టారు. ఆ తర్వాత వైఎస్ జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో వచ్చిన వైకాపా ప్రభుత్వం అంతకంటే ఘోరంగా.. అసలు అభివృద్ధే అక్కర్లేదు అంటూ, రాజధానిని వివాదాస్పదం చేస్తూ తుగ్లక్ పాలన తరహాలో వ్యవహరించింది. గ్రామ సచివాలయాల ఏర్పాటుతో మంచి ప్రయత్నం చేసినా, వాలంటీర్ల పేరుతో ఖజానా మీద భారం వేయటంతోపాటు.. గ్రామాలలో రాజకీయ సంస్కృతిని ఇంకా కలుషితం చేసింది. అదేవిధంగా, లోక్‌సత్తా ప్రతిపాదించిన ఫ్యామిలీ డాక్టర్ పద్ధతిని పేరుకు మాత్రం తీసుకొచ్చి ఆచరణలో యధాతథ పరిస్థితిని కొనసాగించింది. విద్యలో నాణ్యతా ప్రమాణాలకన్నా, సిలబస్‌లో, ప్రాథమిక స్థాయి లోనే అర్థంకాని భాషలో బోధన, సిలబస్ వంటి విన్యాసాలు చేసింది. పెట్టుబడులు పెట్టేవారిని తరిమేసింది. ఎన్నికల సమయం వచ్చేసరికి.. అభివృద్ధి కోరేవారంతా వర్గశత్రువులు అనే వాదన తీసుకొచ్చి, కులాల మధ్య చిచ్చుపెట్టింది. వ్యతిరేకించే రాజకీయ ప్రత్యర్థులను భయపెట్టటానికి చట్టాన్ని, పోలీసు యంత్రాంగాన్ని దుర్వినియోగపరిచింది. ఎన్నికల్లో జగన్ పార్టీని ఓడించటానికి ఆయన కంటే ఎక్కువ తాత్కాలిక తాయిలాల్ని కూటమి ఇవ్వటం వల్ల.. రాష్ట్రం ఇప్పటికీ అప్పుల భారం నుండి కోలుకోలేకపోతోంది. అదేవిధంగా రివర్స్ టెండరింగ్ పేరుతో పోలవరం, పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టు కాంట్రాక్టుల్ని దెబ్బ తీయటం రాష్ట్రానికి అశనిపాతమైంది. అయితే, పెట్టుబడులను ఆకర్షించటం, ఆధునిక ఆర్థిక వ్యవస్థకు అవసరమైన సాంకేతికతలకు ప్రాధాన్యతనివ్వటం వల్ల రాష్ట్రంలో కొంత ఆశావహ పరిస్థితి ఏర్పడింది.


**లోక్‌సత్తా ప్రతిపాదించిన ఫ్యామిలీ డాక్టర్ పద్ధతిని పేరుకు మాత్రం తీసుకొచ్చి ఆచరణలో యధాతథ పరిస్థితిని కొనసాగించింది. విద్యలో నాణ్యతా ప్రమాణాలకన్నా, సిలబస్‌లో, ప్రాథమిక స్థాయి లోనే అర్థంకాని భాషలో బోధన, సిలబస్ వంటి విన్యాసాలు చేసింది. పెట్టుబడులు పెట్టేవారిని తరిమేసింది. ఎన్నికల సమయం వచ్చేసరికి.. అభివృద్ధి కోరేవారంతా వర్గశత్రువులు అనే వాదన తీసుకొచ్చి, కులాల మధ్య చిచ్చుపెట్టింది.**

తెలంగాణకు కొంత భిన్నంగా ఏపీ.. గతం నుండి ఎక్కువ పాఠాలు నేర్చుకోవటం అవసరం. సంక్షేమం, అభివృద్ధి మధ్య సమతూకం దెబ్బతినే రాజకీయం చేస్తే, ఒక రాష్ట్రం ఎంత ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతుందో ఏపీ యావత్ భారతదేశానికీ ఒక కేస్ స్టడీ. రాష్ట్రం అప్పులు ఇప్పటికే రూ.10లక్షల కోట్లు పైగా ఉంటాయని అంచనా. ఆదాయం మాత్రం ఆ వేగంతో పెరగటం లేదు. ఇక్కడ కూడా లోక్‌సత్తా సూచించినట్లు.. సుదీర్ఘ సముద్ర తీరప్రాంతాన్ని, చేపలు, రొయ్యలు, హార్టికల్చర్, మౌలిక వసతుల్ని, లాజిస్టిక్స్, జలరవాణా, భూమిపై, సముద్రనీటిపై సౌర ఇంధనం, ఎంఎస్ఎంఈలను, పోర్టుల్ని, గ్రీన్‌ఫీల్డ్ ఆర్థిక నగరాన్ని, తయారీ పరిశ్రమల్ని కష్టించి పనిచేసే ప్రజలు, ప్రవాస భారతీయుల భాగస్వామ్యంతో అభివృద్ధి చేస్తే, అందులో కుల, వర్గ వివక్షలు లేకుండా అందరికీ అవకాశం కల్పించి సమ్మిళిత ఆర్థిక వృద్ధిని సాధిస్తే.. తలసరి ఆదాయం ఇప్పుడున్న 2.9 లక్షల నుండి మొదటి పది రాష్ట్రాల స్థాయికి చేరుకుంటుంది. అదేవిధంగా విద్య, ఆరోగ్యం, స్థానిక ప్రభుత్వాల సాధికారత, చట్టబద్ధపాలన, చట్టసభలు, సోషల్ మీడియాలో సహా బహిరంగ చర్చ ప్రమాణాలను పెంచటం.. మొదలైన పెద్ద అదనపు ఖర్చులేని పాలనా సంస్కరణల్ని అమలు చేస్తే స్వర్ణాంధ్ర 2047 లక్ష్యాన్ని చేరుకోగలుగుతుంది. అయితే, ఎక్కువ జననాల రేటు తగ్గి రాష్ట్రంలో పనిచేసేవారి సంఖ్య తగ్గుతోందని, జననాల అవసరంరీత్యా ముగ్గురు, నలుగురు పిల్లల్ని కనండి.. వంటివి తొందరపాటు చర్యలు. ఇప్పటికే వున్న ప్రజలకు, యువతకు ముందు నాణ్యమైన జీవనోపాధి, ఆదాయాలు సమకూర్చండి. ప్రధానంగా, గ్రామీణ చిన్న పట్టణాల అభివృద్ధి వల్ల.. ఎటువంటి మినహాయింపు చట్టాలూ అవసరం లేకుండా పనిచేయగలిగిన స్థానికులందరికీ ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ఆదాయాల్ని, జీవన నాణ్యతను, వలసల సంఖ్యలను లెక్కేసుకున్నాక.. అవసరమైతే అప్పుడు ప్రజలు, ముఖ్యంగా మహిళలు ఆలోచించి జననాల గురించి సొంత నిర్ణయం తీసుకోగలరు.

కాబట్టి, గతాన్ని అవసరమైన పాఠాలకు పరిమితం చేసి, భవిష్యత్తు మీద దృష్టిసారిస్తే.. రెండు తెలుగు రాష్ట్రాలూ దేశ రాజకీయాల్లో కీలకపాత్ర పోషించగలుగుతాయి.

❖

# అది అసత్య ప్రచారం : జేపీ




**దేశంలో ఇంకో 25 ఏళ్లు బీజేపీ అధికారంలోఉంటే దేశం అభివృద్ధి చెందుతున్నట్టు లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ చెప్పినట్టుగా సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం జరుగుతోంది..దీనిపై ఆయన స్పందించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..**

ఇవాళ్టి సోషల్ మీడియాలో ఇదిగో పులి అంటే అదిగో తోక అన్నట్టు, దున్నపోతు ఈనిందంటే దూడను కట్టేయడంలా ఉంది. అసలు పార్టీల గురించి మనం ఇంతగా ఆలోచించాల్సిన పని లేదు. ఏ పార్టీ అయినా, ప్రభుత్వం అయినా ఏం చేస్తోంది..ఏం ప్రతిపాదిస్తోంది అది ప్రాతిపదిక కావాలి కానీ , ఒక పార్టీకి అంకితమవ్వడం కానీ, పార్టీకి విధేయులుగా ఉండడం కానీ, పార్టీలకు బానిసలుగా ఉండడం కానీ చాలా పొరపాటు ఆలోచన. పార్టీలు మన కోసం ఉన్నాయి. మనం పార్టీల కోసం లేము. ఓటర్లు రాజకీయ పార్టీలకు బానిసలు కాదు. నేను మళ్లీ మళ్లీ రోజు చెబుతుందేంటి? ఒక 25 ఏళ్ల పాటు భారతదేశంలో వేగంగా ఆర్థిక ప్రగతి జరగాలి..అది జరగాలంటే ఆర్థిక క్రమశిక్షణ కావాలి..ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో పెట్టుబడులను ప్రోత్సహించాలి. మౌలిక సదుపాయాల్ని పెంచాలి..సంక్షేమానికి-అభివృద్ధికి మధ్య సమతూకాన్ని సాధించాలి. మంచి ప్రమాణాల విద్యను అందించి ఈ బిడ్డలు భవిష్యత్తులో సంపద సృష్టిలో పాలు పంచుకునేలా నైపుణ్యాలను అభివృద్ధి చేయాలి. జేబులో డబ్బులు ఖర్చు కాకుండా మంచి ఆరోగ్యం అందరికీ అందాలి. చట్టబద్ధ పాలన ఉండాలి. నేను సంపాదించుకుంటే, నేను నిజాయితీగా ఉంటే, నేను కష్టపడితే నాకు భద్రత ఉంటుందనే నమ్మకం కలగాలి..'బడితె ఉన్నవాడిదే బర్రె కాకూడదు'. ఈ పద్ధతుల్ని ఇంకో 25 ఏళ్లపాటు వేగంగా కొనసాగించినట్టయితే, కనీసం 7-8 శాతం తగ్గకుండా అభివృద్ధి సాధిస్తే ..ఇప్పుడు ఉన్న కష్టాల నుంచి బయటపడితే మనకు ఉన్న అవకాశాల్ని ఉపయోగించుకోగలం. అని వ్యాఖ్యానించాను..మీరు చూస్తే బహుశా ఎక్కడా కూడా ఫలానా పార్టీ ఎన్నికల్లో నెగ్గాలి..బీజేపీ కానీ మరొకటి కానీ 25 ఏళ్లు నెగ్గితే బాగుంటుందన్న మాట పొరపాటున కూడా నా నోటి నుంచి రాదు.. ఆ ఆలోచన నా ఊహలో కూడా తట్టదు. కానీ ఫలానా విధానాలు ఉండాలి.. అని అప్పుడు, ఇప్పుడు చెబుతున్నాను. ఒకొక్క సందర్భంలో ఒక్కో రాష్ట్రంలో, జాతీయ స్థాయిలో ఒక్కో పార్టీ కొన్ని విధానాల్ని అనుసరిస్తుంది. అది బాగుంది అంటే ఏ కారణంగా మంచో మనం చెప్పాలి. బాగోలేదు అంటే ఏ కారణంగా చెడు, ప్రత్యామ్నాయం ఏంటో చెప్పాలి. నా పంథా ఎప్పుడూ అదే. ప్రభుత్వానిదో, పార్టీదో ఒక నిర్ణయం మంచిది అయినట్టయితే ఎందుకు మంచిది అనుకుంటున్నాం.చెడ్డది అనుకుంటే ఎందుకు చెడ్డది అనుకుంటున్నాం.. ప్రత్యామ్నాయం ఏంటి? అనేది చూస్తాం. ఉదాహరణకు వ్యవసాయ చట్టాలు కచ్చితంగా మంచి చట్టాలు. దేశంలో అందరూ రకరకాలుగా మాట్లాడు తున్నా.. అప్పుడు..ఇప్పుడు..ఎప్పుడూ కూడా నేను స్పష్టంగా అవి మంచివనే చెబుతున్నాను.. ఆ మూడు చట్టాలు కూడా మంచి ఉద్దేశ్యంతో చేసినవి, వ్యవసాయానికి పని కొచ్చేవి.

ఉదాహరణకు..రైతు తన పంటను ఎక్కడైనా స్వేచ్ఛగా అమ్ముకునే అవకాశాన్ని ఇవ్వడం చాలా మంచిది. రోజూ ప్రభుత్వ నియంత్రణ పెట్టకుండా ధరల్ని తగ్గించడమే లక్ష్యంగా పెట్టుకుని రైతును దెబ్బతీయకుండా, మేము వదిలేస్తాం అనవసరంగా పట్టించుకోం అనేది చాలా మంచిది. 'కొనబోతే కొరివి.. అమ్మబోతే అడవి' అనే పరిస్థితి లేకుండా గ్యారంటీగా ఈ రేటు వస్తుంది..ఇష్టం ఉంటే పంట వేస్తాను లేకపోతే లేదు అనే పరిస్థితి్త కచ్చితంగా మంచిది. అక్కడ ఏ పార్టీ అన్నది కాదు..ఏ విధానం మంచిది. ఏ విధానాన్ని సమర్థిస్తే మంచిది అనేదే ముఖ్యం. అయితే రాజకీయ అవసరాల కోసం బీజేపీ ఆ మూడు చట్టాలను వెనక్కి తీసుకుంది..అలా వెనక్కి తీసుకోవ డం సరైంది కాదు.

అలాగే తెలంగాణ ప్రభుత్వం ఇటీవల ఎంఎంటీఎస్‌లో ప్రజలందరికీ ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించాలని భావించింది. ప్రస్తుతం ఎంఎంటీఎస్‌లో 40 వేల మందే ప్రయాణిస్తున్నారు..దీన్ని ప్రోత్సహించేందుకు ప్రయాణం ఉచితం చేద్దామని భావించారు..ప్రజల్లోకి ఎంఎంటీఎస్ వచ్చిందనుకోండి లక్షలాది మంది ఉపయోగించుకున్నారను కోండి రోడ్ల మీద రద్దీ తగ్గుతుంది. ఆర్టీసీ, ఎంఎంటీఎస్, మెట్రోకు మధ్య సమన్వయాన్ని సాధిస్తే అది మంచి నిర్ణయం. అంటే అర్థం కాంగ్రెస్‌కు మద్దతిస్తున్నాననో, రేవంత్‌రెడ్డిగారికి మద్దతు ఇస్తున్నానో కాదు. ఈ నిర్ణయం మంచిది..అవసరం. దాన్ని ప్రోత్సహిస్తున్నాం. కేసీఆర్‌గారు చాలా సందర్భాల్లో నన్ను బహిరంగంగానే చాలాసార్లు విమర్శించారు. అయినా ఆయన చంద్రబాబు, రాజశేఖరరెడ్డి చేసినట్టుగానే హైదరా బాద్ ఆర్థిక ప్రగతి కొనసాగించారు..అలాగే ఆంధ్ర, తెలంగాణ వైషమ్యాలు లేకుండా చేశారు..ఈ రెండూ మంచివి. దాన్ని ఆహ్వానించాం. అంటే నేను టీఆర్ఎస్‌కు కొమ్ముకాస్తున్నానని కాదు. అలాగే ఏపీలో గతంలో జగన్ ప్రభుత్వం రెండు మంచి పనులు చేసింది.. గ్యారెంటెడ్ పెన్షన్ స్కీం. పాత పెన్షన్ పద్ధతి మంచిది కాదని దేశంలో గట్టిగా వాదించిన ఏకైక ప్రభుత్వం జగన్ ప్రభుత్వం. దానికి ప్రత్యామ్నాయంగా గ్యారెంటెడ్ పెన్షన్ సిస్టమ్ తీసుకొచ్చింది.. కనీసం ఉండేలా చేసి కంట్రిబ్యూటరీ పెన్షన్ కోసం ఏర్పాటు చేశారు. నేను బహిరంగంగా మద్దతు ఇచ్చాను. జాతీయ స్థాయిలో రౌండ్ టేబుల్ పెట్టి ఆ రాష్ట్ర ఆర్థిక మంత్రిని రమ్మని నేనే స్వయంగా ఆహ్వానించాను. ఏ కారణంగానో ఆయన రాలేకపోయారు. అలాగే ప్రాథమిక ఆరోగ్యం క్షేత్రస్థాయికి వెళ్లడం కోసం గట్టి ఏర్పాట్లు చేశారు. నేను బహిరంగంగా దాన్ని అభినందించాను. అంటే అర్థం జగన్ పార్టీకి మద్దతు ఇస్తున్నానని కాదు, జగన్‌కు మద్దతు ఇస్తున్నానని కాదు. ప్రభుత్వం మీ గుత్తాధిపత్యం కాదు. మీ సొంతం కాదు. రాష్ట్రం కానీ, దేశం కానీ ఎవరి సొంత ఆస్తి కాదు. మన ఆస్తి. ఎన్నికలు మన కోసం..ఓటర్ల కోసం, ప్రజల కోసం, పన్ను కట్టేవాళ్ల కోసం. మనం ఏం అనుకుంటున్నాం. ఎన్నికలు వాళ్లకు వాళ్లకు మధ్య పోరాటం. ఇద్దరు రాజుల మధ్య పోరాటం. మనం కేవలం మౌన ప్రేక్షకులం. లేకపోతే చప్పట్లు కొట్టే వెర్రిబాగుల వాళ్లం అని..అదికాదు. మనం ప్రభువులం. మనం పన్ను కట్టేవాళ్లం. ఈ నిర్ణయాలు, చేసే పనులు మన అందరి ప్రయోజనాలను గనుక కాపాడితే అది మంచిది. కాపాడకపోతే అవి చెడ్డవి. ఉదాహరణకు..మోదీ ప్రభుత్వం డీమానిటైజేషన్ చేసినప్పుడు సరిగా చేస్తే మంచి ఆలోచన అన్నాను. కానీ చేసిన తీరును చాలా తప్పని ఎండగట్టాను. నోట్ల రద్దు వల్ల ఫలితం ఏం రాలేదు. అందుకే వాళ్లు ఈ మధ్య దాని గురించి మాట్లాడటం మానేశారు. అలాగే సెలక్టివ్ ప్రాసిక్యూషన్. చట్టాన్ని కొంతమంది మీదే ప్రయోగించడం కచ్చితంగా తప్పు..చట్టబద్ధమైన పాలన ఉండాలని రోజూ వాదిస్తున్నవాడిని. ఒకవేళ నిజంగా వాళ్లు ప్రాసిక్యూషన్‌కు అర్హులైనా కూడా అందర్నీ సమానంగా చూడకపోతే విశ్వసనీయత దెబ్బతింటుంది. అలాగే దేశంలోని అన్ని రాష్ట్రాలలో కూడా సమస్య ఏంటి? విద్యలో డబ్బులు ఖర్చు పెడుతున్నారు కానీ, నాణ్యమైన ప్రమాణాలు లేవు. బిడ్డల తెలివి తేటలు వికసించడం లేదు. జాతీయ స్థాయి, రాష్ట్రంలో పార్టీ అధికారంలోఉన్నా ప్రతి రోజూ నేను గట్టిగా అరుస్తున్న అంశం ఏమైనా ఉందంటే పాఠశాల విద్య . ప్రమాణాలు లేకుండా దేశాన్ని కుళ్లబొడుస్తున్నారు..నాశనం చేస్తున్నారు. ఈ విమర్శ అందరికీ చెందుతుంది. ఈ పార్టీ ఆ పార్టీ అనే తేడా లేదు. అలాగే అధికార కేంద్రీకరణ.. ఒక్క కేరళలో మినహాయిస్తే జాతీయ స్థాయిలో అన్ని రాష్ట్రాలలో ప్రధానంగా రాష్ట్ర ప్రభుత్వాల చేతుల్లో పెట్టారు. క్షేత్రస్థాయికి వెళ్లలేదు. దక్షిణాది రాష్ట్రాలలో ఓట్ల కొనుగోలు. మొన్న విజయ్ పార్టీ కొంతమేర డబ్బులు లేకుండా వచ్చింది. కేరళలో కొంత మినహాయింపు. దాన్ని రోజూ ప్రశ్నించేవాడ్ని. కాబట్టి అంశాల ప్రాతిపదికగా ఉండాలి.. పార్టీ ప్రాతిపదికగా కాదు. నేను రాసిన కొన్ని వేల పేజీలు ఉన్నాయి..మాట్లాడిన మాటలు కొన్ని వేల గంటలు ఉన్నాయి..ఎక్కడైనా చూపించండి..అన్నీ బహిరంగంగా ఉన్నాయి. ఫలానా పార్టీ నెగ్గినట్టయితే దేశం బాగుపడుతుందని చెప్పినట్టు రికార్డు ఉంటే చూపించండి. కొంత విశ్వసనీయత ఉన్నప్పుడు మీరు గనుక విమర్శిస్తే దాన్ని మరింత తీవ్రంగా తీసుకుంటారు. మీ మీద ఘాటుగా తిరిగి స్పందిస్తారు. మీరు కనుక అభినందిస్తే దాన్ని బాగా ప్రచారం చేసుకుంటారు. ఆంధ్ర, తెలంగాణ ఉద్యమం అప్పుడు నాకు ఇదే సమస్య ఎదురైంది. శాసన సభలో మా పార్టీ తరఫున నేను ఒక్కడ్నే సభ్యుడ్ని. తెలంగాణ వాదాన్ని బలపరిచే వాళ్లం తా తెలంగాణ వల్ల అద్భుతాలు జరుగుతాయి..ఆ మాట ఒప్పు కోవాలంటారు. సమైక్య ఆంధ్ర కావాలని వాదించేవాళ్లంతా దాని వల్ల ఉపద్రవం జరుగుతుంది..రాష్ట్రం నాశన మైపోతుంది..దాన్ని చెప్పాలంటారు..నేను రెండూ తప్పు ..ఉపద్రవం రాదు..అద్భుతాలు జరగవు. తెలంగాణ ప్రజలు

కోరుకుంటే శాంతియుతంగా, సామరస్యంగా విడిపోదాం. అద్భుతాలు జరగవు. ఉపద్రవం కూడా రాదంటే ఇద్దరికీ నచ్చలేదు. ఇన్నేళ్లు గడిచాకా ఇద్దరూ ఒప్పుకుంటారు. కాబట్టి ఉద్రేకంలో ఉన్నప్పుడు పార్టీల మనుష్యులుగా భావిస్తున్నప్పుడు మన కోసం మనం బతకనప్పుడు ప్రతీదాన్నీ కూడా ఈ పార్టీకి అనుకూలమా, ఆ పార్టీకి అనుకూలమా? చూస్తారు కానీ, ప్రజలకు అనుకూలమా? వ్యతిరేకమా చూడడం లేదు. అసలు పార్టీలను పట్టించుకోవాల్సిన అవసరం లేదు. వాళ్లే పట్టించుకోరు. నిన్నటి దాకా ఒక పార్టీలోఉండి బండ బూతులు తిట్టి మర్నాడు ఇంకో పార్టీలోకి వెళ్లి పోతున్నారు కదా? ఇప్పుడు పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ ముఖ్యమంత్రి సువేందు అధికారి ఆరేళ్ల క్రితం ఏ పార్టీలో ఉన్నారు. బీజేపీని తిట్టినటు వంటి టీఎంసీ పార్టీలో ఉన్నారు. అస్సాం ముఖ్య మంత్రి హేమంత్ బిశ్వాస్..గతంలో కాంగ్రెస్ పార్టీలో ప్రముఖుడు. అలాగే మన తెలుగు రాష్ట్రాలలో రేవంత్ రెడ్డిగారు ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో నాయకుడు. గతంలో ఏ పార్టీలో ఉన్నారు.. టీడీపీ. వాళ్లకే పార్టీలంటే అంతగా పట్టింపు లేనప్పుడు మనం అంతగా పట్టించుకోవాలా? మనం పట్టించు కోవాల్సింది ఏం చేస్తున్నారు? ఏం ప్రతిపాదిస్తున్నారు? ఏ సందేశాన్ని ప్రజల మధ్య పెడుతున్నారు? అది తప్ప, ఏ పార్టీకీ అంకితం కాకూడదు. లోక్‌సత్తా కానీ ఎఫ్‌డీఆర్ కానీ, నేను కానీ అలా అంకితమయ్యే సమస్యే లేదు. ఇన్నేళ్లుగా ప్రజలు చూశారు. ప్రజాప్రయోజనాల్ని నాకు అర్థమైన రీతిలో కాపాడడం ఎట్లా? వాస్తవాల ఆధారంగా ఒక హేతుబద్ధమైన వాదన తీసుకు రావడం ఎట్లాగ? దేశ భవిష్యత్తుకి ఎలాంటి విధానాలు రూపొందించాలి..దానికి ఉన్న సాక్ష్యాలేంటి? ప్రపంచంలో అనుభవం ఏంటి? మనదేశంలో ఉన్న పరిస్థితుల్లో మార్గాలేంటి? ఇది అన్వేషించి నిరంతరం ప్రయత్నం చేయడమూ, ఫలితాల్ని సాధించడం తప్ప ఫలనా వాళ్లకు కొమ్ము కాయడం అనేది నిరర్థకమైన ప్రక్రియ. దానివల్ల ప్రయోజనం లేదు. అలాగే ఎవరిపట్లా ద్వేషం ఉండక్కర్లేదు. రాజకీయాల్లో ఉన్న వారు దేశంలో అయినా, రాష్ట్రంలో అయినా కూడా చాలా తంటాలు పడాలి. పార్టీ ఏదైనా కూడా ఇష్టం వచ్చి నట్టుగా బూతులు తిట్టడం కాకుండా నిర్మాణా త్మకమైన విమర్శ చేయడం. పరిష్కారాల్ని చూపెట్టడం. వాళు సరైంది చేస్తున్నప్పుడు దాన్ని ఒప్పు కోవడం. అలాకాకుండా ప్రతీ దానికి పాప్యులిజం. జనం చప్పట్లు కొట్టడం మంచిదనే భావన. చాలా మంది ఆ పనే చేస్తారు. అంతకంటే ప్రమాదం మరొకటి లేదు. ఆరోజు తృప్తి పరచడమే రాజకీయం అయితే దేశం వల్లకాడు అయి పోతుంది. దేశం సర్వనాశనం అయి పోతుంది. కాబట్టి దీర్ఘకా లిక ప్రయోజనాలు, స్వల్పకాలికంగా ప్రజల్ని తృప్తి పరచడం ఈ రెండింటిని సమన్వయం చేయాలి. దానికి మనం మద్దతు ఇవ్వాలి. అన్నీ ఫ్రీగా రావాలని అందరికీ ఉంటుంది.కానీ అది సాధ్యంకాదు. ఇక్కడ పెంచకపోతే ఇంకో రూపంలో వస్తుంది. ప్రియమైనా, అప్రియమైనా సరే సత్యాన్ని చాతనైన మేరకు చెప్పాలి.. కారణాలు చెప్పాలి..పిడివాదం కాదు..నేను అనుకుం టున్నానని కాదు ఈకారణంగా అనుకుంటున్నా.. ఇది వాస్తవం..ఇదీ తర్కం. ఇదీ ప్రపంచ అనుభవం ఈ పరిస్థితుల్లో మన దేశంలో ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ఇదీ పరిష్కారం. ఆ వైపు వెళితేనే దేశంలో నిర్మాణాత్మకమైన చర్చ జరుగుతుంది. మంచి ప్రజాస్వామ్యం నిర్మాణం జరుగుతుంది. సందర్భాన్ని బట్టి నిర్ణయం చేయాలి తప్ప రోజువారీగా పార్టీల కు అంకితమైన వాళ్లలా కాదు. ప్రజల సంక్షేమానికి, దీర్ఘ కాలిక ప్రయోజనాలకి వచ్చే తరం భవిష్యత్తుకి అంకితమైన వాళ్లం. అదొక్కటే ప్రామాణికమైన చర్చ. మిగతావన్నీ కూడా కుహనా చర్చలు. ప్రజా సంక్షేమానికి పనికొచ్చేవి కావు.

**సందర్భాన్ని బట్టి ఎవరికి అనుకూలంగా వారు మార్చు కుం టున్న ఈ పరిస్థితిని ఎలా చూస్తారు?**

జేపీ: దాన్ని మనం ఏ చేయలేం. ఒక రకంగా అది మన విశ్వసనీయతకి కితాబు. కాళేశ్వరంలో ఖర్చు అనవసరంగా పెడుతున్నారని నేను అంటే..ఆంధ్రలో పుట్టాడు..ఈయనకు ఎందుకు ఇక్కడ అని కేసీఆర్‌గారు అన్నారు..సహేతుక విమర్శకు అవకాశం లేక చేసిన విమర్శ అది. అక్కడ పుట్టింది వాస్తవమే. దాన్ని ఏ రకంగాను మార్చలేను కదా? అది ఏ రకంగా చర్చ అవుతుంది.. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం కరెక్టు కాదని నేను గట్టిగా వాదించాను. అది సరైన నిర్ణయని గట్టిగా నిలబడ్డాను. జేపీగారు కూడా దీన్ని ఒప్పుకుంటున్నారన్నారు. మన మాట నచ్చితేనేమో వాడు కుంటారు. నచ్చకపోతే తిట్టి పోస్తారు..అది విశ్వసనీయతకు కితాబు. అడ్డగోలుగా మాట్లాడినా, వాస్తవం ఉన్నా లేక పోయి నా పట్టించుకోను. నిష్పక్షపాతంగా మాట్లాడతారు.. వాస్తవాల్నే మాట్లాడుతారు. ప్రజా సంక్షేమం గురించి మాట్లాడుతారు. .తర్కబద్ధంగా మాట్లాడతారన్న నమ్మకం ఉన్న పుడు ఎవరికి వాళ్లు మన పక్షం రావాలని కోరుకుంటారు. కొంత మంది లేని దాన్ని సృష్టించుకుని ప్రచారం చేసుకుంటారు.. మరి కొంత మంది అనవసరమైన విమర్శలు చేస్తారు..కులం, మతం అంటారు..అవి చర్చలో అసలు భాగమే కాకూడదు. మళ్లీ మళ్లీ చెబుతున్నాను..వాస్తవమూ, తర్కమూ, ప్రపంచానుభవమూ, మన అనుభమూ, మన జాతి అవసరం దాని ప్రాతిపదిక ఏది? ప్రత్యామ్నాయం మీరు మం చిది చూపెడితే మరింత బాగుంటే మనం దాన్ని స్వీకరించాలి. లేదంటే ఒప్పించాలి. ఏదీ తేలకపోతే మెజార్టీ అభిప్రాయానికి తలొగ్గాలి. అదీ ప్రజాస్వామ్యం. అంతే కానీ తాబట్టిన కుందేలుకు మూడే కాళ్లు అనేవాడు, లేకపోతే నేను చెప్పింది వినకపోతే ఒప్పుకోను అనే వాడు ప్రజాస్వామ్యానికి పనికిరాడు. ❖




ఎం. పార్థసారథి
(ఫౌండర్ ప్రెసిడెంట్)

# జుగాడ్ ఓటర్ల ఉద్యమం

ప్లాట్ నం: బి- 64, రోడ్ నం. 10, హుడా కాలనీ, సరూర్‌నగర్, హైదరాబాద్ - 500 035,ఈమెయిల్: mpstexer@gmail.com

## జుగాడ్ 50:50 ద్విపక్ష-పార్టీ రాజనీతి JUNE 2026

Jugaad Bharat United Voters Simplifying Democracy - Strengthening Unity among Voters

## ₹ ధనమూలమిదం జగత్ ₹

✦కొందరి ఓట్లను కోట్లు ఖర్చుతో కొనుక్కుని మనపైనే అధికారం చలాయించే రాజకీయ పార్టీలకు స్వస్తి. ఓటు మనది. పార్టీ మనది. డబ్బు మనది. అధికారం మనది. పనిచేయని ప్రభుత్వాన్ని గద్దె దింపే అధికారం కూడా మనదే! అందరూ మనవాళ్లే! అందుచేత, పార్టీ ఫిరాయింపు చట్టం రద్దు అయిపోతుంది.

✦ప్రస్తుత న్యాయవ్యవస్థలో అధికశాతం, లాయర్లతోసహా వాయిదాపద్ధతిలో, న్యాయమేదో నిర్ధారించే బాధ్యత జడ్జీగారి మీద పడుతున్నది. జిల్లా కోర్టులో వచ్చే తీర్పు హైకోర్టులోనూ, ఆతరువాత, సుప్రీంకోర్టు లోనూ సవాలు చేసే అవకాశం రాజ్యాంగమే కల్పించ డంతో న్యాయానికి అర్థమే మారిపోతోంది.

✦అందుచేత ముందుగా లాయర్ల ఫీజులను సరిదిద్ది న్యాయవ్యవస్థను సరళీకృతం చేద్దాం. గ్రామస్థాయి సర్పంచులనుండీ ఆర్థికవనరుల వికేంద్రీకరణతో పారదర్శకంగా పరిపాలన కావాలంటే - Jugaad ఓటర్లసాక్షిగా అధికార వికేంద్రీకరణ అమలు పరుస్తూ - మనచే ఎన్నుకోబడ్డ MLA గారి ద్వారా సాధించుకోవచ్చు. మంచి చట్టాలను నిర్మించి మంచి పాలన అందించడమే MLA ల యొక్క రాజ్యాంగబద్ధ ప్రాథమిక కర్తవ్యం. ఆ MLA మీరేనేమో..!

✦Jugaad పార్టీ కార్యకర్తగా నమోదు చేసుకోవాలంటే జీవితంలో ఒకేసారి తనకష్టార్జితమైన రూ.10,000/ విరాళమివ్వగలిగి ఉండాలి. లేదా, మెరుగైన సమాజం కోసం జుగాడ్ ఓటరుగా ఒకేసారి రూ. 5,000 కానీ రూ. 2,000 కానీ ఇచ్చి, మీవంతు బాధ్యత మీరు స్వీకరించండి.

**Contact: Jugaad Parthasarathy (9866416798) with (1) your MLA Constituency name (2) your name and gender (3) your age (4) your. Cell No:**

**జుగాడ్ భావి భారత భాగ్య విధాతలు :** (Rs/-10,000 donors): **Sarvasri: (1) M.PARTHASARATHY (2) K.SUBRAHMANYAM (3) Col.P.V.RAMANA RAO (4) U.SUBBA RAO (5) Prof.C.K.MURTHY (6) SYED ANSARI (7) Smt. D.KASTURI (8) K.SRINIVAS MURTHY (Rajahmundry AP) (9) Dr. VAMSI RAJ (Kakinada AP) (10) Dr.G.ABBAIAH (Kakinada AP)(11)KOTIKALAPUDI TARAKESH (12) D.V.S.Rao**

**జుగాడ్ ఓటర్లు :Sarvasri (1) JVL. NARAYANA (Nellore AP) (2) S.D.BABU (Tamilnadu) (3) T.SURYANARAYANA (Vizag AP) (4)Smt.D. SUBHADRA (5) M.RANGA RAO (6) M.SAI SUBBARAO (7) Smt.D.JANAKI (8) J.VENKATA RAO (Vijayawada AP) (9) P.NARASIMHA RAO (10) SAI SURYANARAYANA (Karnataka) (11) MSS KUMAR (12) Dr.U.V.KRISHNA MURTHY (13) M.RAMA RAO (14) NANDAN SRIDHAR (15) Smt.K.RAJESWARI (16) Smt.K.LAKSH-MI (17) Justice CHANDRAKUMAR (18) K. VASUDEVA RAO (19) NARAGONI (20) D.KONDALA RAO (21) M.S. Narayana Rao (22) Sriram (Amalapuram AP) (23) P.Sunil (Bhimavaram AP) (24) Amaranath (25) B.Poorna Kumar Das (26) KHS Sarma (27) Metta Ramarao (Vizag, AP) (28) IR Rao (29) S Madhavarao (30) DRK Rao (31) Smt.P Amulya (32) pallela Devaraju (33) YSN MURTY (Kakinada, AP) (34) DV KOTESWARA RAO (35) Santosh Eeraveni (36)Somanchi Radhakrishna 37) C.V.Ratnam 38) Smt Jayanti Vijaya 39) Vishnubhotla Venugopal 40) Er.P.Narasinga rao**

advt

RNI. Regd No. 69976/98 Postal Reg. No. HCD-913/2024-2026 Published on 10th June 2026 Posting Date 15 &16th of every month
Posted at BPC-IV Patrika Channel, Nampally, HYDERABAD-500 001







పెట్రో, గ్యాస్ కష్టాలు తాత్కాలికం,

ట్రాఫిక్ హైదరా'బాధ'?

"అధ్వాన్న ట్రాఫిక్, అసమర్థ ప్రజారవాణా వల్ల

హైదరాబాదీలు ఏడాదికి నష్టపోతున్నది రూ.50,000 కోట్లు"

watch 'Townhall with JP'

& Join the Solution Movement

https://www.youtube.com/@JPLoksattaOfficial

*If undelivered please return to:*
*LOKSATTA UDYAMA SAMSTHA,*
*H.NO. 6-3-678,B-106,*
*PASHA COURT 71, Somajiguda,*
*Behind TRIBHUVANDAS*
*JEWELLERS (TBZ),*
*Hyderabad - 500 082*

**Edited, Printed and Published by Dr. Jayaprakash Narayan, National Coordinator, Loksatta for and behalf of Foundation for Democratic Reforms, H.NO. 6-3-678,B-106,PASHA COURT 71, Somajiguda, Behind TRIBHUVANDAS JEWELLERS , Hyderabad- 500 082.**
**Printed at Kala Jyothi Process Pvt Ltd, Plot No : CFC-1 and 2, Survey No: 18, E-City, SEZ, General industrial park, Raviryal & Srinagar village, Maheswaram mandal, Rangareddy district-501359, Telangana.**